# క్రాంతి

సి.పి.ఐ (మావోయిస్టు) ఎ.పి, ఎస్.టి, ఎ.ఒ.బి కమిటీల అధికార పత్రిక

సంపుటి : 31 సంచిక : 2 మార్చి - ఏప్రిల్ 2007 వెల : ఐదురూపాయలు


**లోపలి పేజీల్లో**


ఎస్.ఇ.జడ్‌లు....................4
రానిబోదిలి....................10
మార్చి 8 పిలుపు....................13
అఫ్జల్ విడుదలకై....................15
ఖమ్మం జిల్లా నిర్బంధం....................18
ఫిలిప్పైన్స్....................మధ్య పేజీ
బస్తర్ మహిళ....................26
అమరుల చరిత్రలు....................29
లెబనాన్....................37


# కేంద్ర బడ్జెట్ 2007 - 08

ఐక్య ప్రగతిశీల కూటమి (యు.పి.ఎ) నాలుగవ బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టిన తదనంతరం ఆర్థిక మంత్రి చిదంబరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ "ప్రపంచంతో కలిసిపోవడానికి భారతదేశం సిద్ధంగా ఉందని 1997లో ప్రవేశపెట్టిన 'కలల' బడ్జెట్ ఒకవేళ చెప్పి ఉంటే, అణగారిన ప్రజలు ఆర్థిక ప్రక్రియలో భాగం అని 2007లో ప్రవేశపెట్టిన బడ్జెట్ చెబుతుంది" అని అన్నాడు. ఈ పది సంవత్సరాల్లో దేశ ఆర్థిక వ్యవస్థను పరిశీలిస్తే భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంతో కలిసిపోయే పేరిట ఎన్నడూ లేనంతగా అంతర్జాతీయ గుత్త సంస్థల గుప్పిట్లోకి వెళ్ళి పోవడం అక్షర సత్యం. అంతేగానీ 2007 బడ్జెట్ గానీ, అంతకుముందు బడ్జెట్ గానీ ఎంత మాత్రం అణగారిన ప్రజలను ఆర్థిక ప్రక్రియలో భాగం చేయడానికి ఉద్దేశించినవి కావు. నేడు భారతదేశ ఆర్థిక ప్రక్రియలో ధనవంతులు మరింత ధనవంతులుగా మారితే పేదలు మరింత పేదలుగా మారుతున్నారు. ఈ ప్రక్రియ వేగవంతం అవుతున్నది. భారత ఆర్థిక వ్యవస్థ జి.డి.పి పెరుగుదల 8 శాతం కొనసాగుతున్నదని, యిది రాబోయే కాలంలో 10 శాతం పెరుగనుందని ఆర్థిక మంత్రి లెక్కలతో సహా చూపెడుతున్నప్పటికీ, ఈ పెరుగుదల విదేశీ మదుపుదారుల, దళారీ నిరంకుశ బూర్జువాల, బడా భూస్వామ్య, సంపన్న వర్గాల ఆస్తుల పెరుగుదల మాత్రమే గాని, పేదల ఆర్థిక శక్తి పెరుగుదలకు చిహ్నం కాదు. బడ్జెట్ అనేది అసలు పెద్ద అంకెల గారడీ. అది అంకెల్లో మెజారిటీ ప్రజలను ఉద్దేశించినట్టుగా భ్రమింపజేస్తుంది. కానీ బడ్జెట్‌ను వివరంగా పరిశీలిస్తే అది కోట్లాది ప్రజలకు వ్యతిరేకంగానే ఉంటుంది.

చిదంబరం తన బడ్జెట్ ప్రసంగంలో యు.పి.ఎ ప్రభుత్వం తన పదవీ కాలాన్ని సగం పూర్తి చేసుకుంటున్న తరుణంలో మధ్యంతర నివేదిక ప్రవేశపెట్ట వచ్చునని, అయితే అది ఇలా ఉంటుందని పేర్కొంటూ అందులో చాలా అనుకూలాంశాలు, కొన్ని ప్రతికూలాంశాలు ఉన్నాయని పేర్కొన్నాడు. జాతీయ ఆదాయం పెరుగుదల రేటు, ఉత్పత్తి రంగం పెరుగుదల రేటు, సేవారంగం పెరుగుదల రేటు, తలసరి ఆదాయం, పొదుపురేటు, మదుపురేటు అన్నీ పైపైకి వెళుతున్నాయని వ్యవసాయం పెరుగుదల రేటులో మాత్రం కావలసినంత పురోగతి లేదని, ద్రవ్యోల్బణం కూడా ఎక్కువగా ఉందని ఆయన అన్నాడు - ఇందులో ఉత్పత్తి సేవా రంగాల పెరుగుదల 11 శాతం ఉండగా, వ్యవసాయ రంగం అభివృద్ధి 4 శాతం ఆశించగా, 2.3 శాతం మాత్రమే పెరుగుదల సాధించింది. ద్రవ్యోల్బణం రేటు 6.72 శాతం చేరి దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు మండి పోతున్నాయి. ఇక బడ్జెట్ ప్రవేశపెట్టిన కొద్ది రోజుల్లోనే స్టాక్ మార్కెట్ సెన్సెక్స్ సూచి 14 వేల పాయింట్ల నుండి 10 వేలకు పడిపోయి మధ్య తరగతి ప్రజల కలలను చెదరగొట్టిన వైనం మన కళ్ల ముందే చూశాం. వ్యవసాయాన్ని ఆధారంగా చేసుకొని బతుకుతున్న 115 మిలియన్ కుటుంబాల పరిస్థితి దుర్భరంగా తయారై, వ్యవసాయంలో గిట్టుబాటు లేక నిత్యం వందల మంది

ఆత్మహత్యలు చేసుకుంటున్న దయనీయ పరిస్థితిని చూస్తూ మన ఆర్థిక వ్యవస్థ 'బలోపేతం' అవుతుందని ఎలా నమ్మగలం? మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టుగా అధిక ధరలు ప్రజల మూల్గులు పీల్చివేస్తుంటే ఆర్థిక వ్యవస్థ పెరుగుదల రేటును చూసి ఎలా గర్వపడగలం?

ఇలాంటి స్థితిలో ప్రజల్లో ప్రభుత్వాల పట్ల తీవ్ర అసంతృప్తి పెరుగుతుంటే ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు మాయమాటలు చెబుతూ ప్రజల కోపాగ్నిని చల్లార్చి, తమ ప్రభుత్వాలు అధికారంలో కొనసాగేలా బూటకపు వాగ్దానాలు చేస్తాయి. చిదంబరం తన బడ్జెట్‌ను అణగారిన ప్రజల బడ్జెట్ అని పేర్కొనడం గాని, వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసానని చెప్పుకోవడం గాని ఇందులో భాగమే. అంతేగాక తన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి 15.7 శాతం పెరుగుదలతో 8 వేల 558

| (రూ.కోట్లలో) | 2005–06 | 2006–07 | | 2007–08 |
|---|---|---|---|---|
| | | బ.అంచనా | స.అంచనా | బ.అంచనా |
| రెవెన్యూ వసూళ్లు | 3,47,462 | 4,03,465 | 4,23,331 | 4,86,422 |
| మూలధన వసూళ్లు | 1,58,661 | 1,60,526 | 1,58,306 | 1,94,099 |
| మొత్తం వసూళ్లు | 5,06,123 | 5,63,991 | 5,81,637 | 6,80,521 |
| ప్రణాళికేతర వ్యయం | 3,65,485 | 3,91,263 | 4,08,907 | 4,75,421 |
| ప్రణాళిక వ్యయం | 1,40,638 | 1,72,728 | 1,72,730 | 2,05,100 |
| మొత్తం వ్యయం | 5,06,123 | 5,63,991 | 5,81,637 | 6,80,521 |
| రెవెన్యూ లోటు | 92,299 | 84,727 | 83,436 | 71,476 |
| ద్రవ్య లోటు | 1,46,435 | 1,48,686 | 1,52,328 | 1,50,948 |
| ప్రాథమిక లోటు | 13,805 | 8,863 | 6,136 | (-) 8,047 |

బ.అంచనా: బడ్జెట్ అంచనా; స.అంచనా: సవరించిన అంచనా

కోట్లు, విద్యకు 34.2 శాతం పెరుగుదలతో 32 వేల 250 కోట్లు, ఆరోగ్యం సంక్షేమంకు 21.9 శాతం పెరుగుదలతో 15 వేల 291 కోట్లు, భారత్ నిర్మాణ్‌కు 31.6 శాతం పెరుగుదలతో 24 వేల 603 కోట్ల నిధులు కేటాయించామనీ ఇవి రాబోయే రోజుల్లో పేద ప్రజల స్థితిగతులను మార్చివేస్తాయనీ అంటున్నాడు. చిదంబరం వ్యాఖ్యానించినట్టుగా ఈ కేటాయింపులు ప్రజల స్థితిగతులను మార్చడం సంగతి ఏమిటో చూద్దాం కానీ తన బడ్జెట్ ప్రసంగంలో ఆ వెను వెంటనే "యు.పి.ఎ ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలకు తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తుందని'' ఢంకా బజాయించి చెప్పాడు. తన ఆర్థిక పాలసీలో సామ్రాజ్యవాదుల నయా ఉదారవాద విధానాలతో పీట ముడి వేసుకున్నంతకాలం ప్రజలను ఉద్దేశించి ప్రకటించిన ఎంత ఉదాత్తమైన కేటాయింపులైనా సంపన్నులకూ, సామ్రాజ్యవాదులకు లాభాలు చేకూర్చేవిగానే తయారవుతాయి.

భారత్ నిర్మాణ్ పేరిట బహుళజాతి కంపెనీలకు ఎలా లాభాలు పంచి పెడుతున్నారో ఈ ఉదాహరణతో మనం చూడవచ్చు. భారత్ నిర్మాణ్ కింద సాగునీటి సౌకర్యాల కల్పన, తాగునీటి సౌకర్యాల కల్పన, గ్రామీణ రహదారులు, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం, గ్రామీణ విద్యుదీకరణ, గ్రామీణ ప్రాంతాల్లో టెలిఫోన్ సౌకర్యం వంటివి ఉన్నాయి. ఈ పనులన్నీ గ్రామీణ జీవితాన్ని ఏమేరకు మెరుగుపరుస్తాయో తెలియదు గానీ, బహుళజాతి సరుకులకు గ్రామీణ మార్కెట్లను బార్లా తెరుస్తాయి.

దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఆర్థిక మంత్రి అత్యంత మక్కువ ప్రదర్శిస్తూ ఇందుకు గాలి బుడగ లాంటి పెరుగుతున్న ఫారెక్స్ రిజర్వులను కనీసం ఐదు, ఆరు బిలియన్ డాలర్లు (దాదాపు 30 వేల కోట్ల రూపాయలు) వినియోగించవచ్చని చెప్పాడు. ముఖ్యంగా విద్యుత్ లాంటి ప్రాజెక్టుల్లో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్య విషయం గురించి మాట్లాడుతూ, లాభసాటిగా నడవడంలో తేడా ఉంటే ఆ తేడాను (వయోబిలిటి గ్యాప్) ప్రయివేట్ వ్యాపార వేత్తలకు యివ్వడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దాదాపు 2 వేల 521 కోట్ల రూపాయలు అలా యివ్వనున్నామని చెప్పాడు. భారత్ నిర్మాణ్ పేరిట ప్రభుత్వ సొమ్మును పెట్టుబడిదారులకు ధారదత్తం చేస్తున్నారు.

వ్యవసాయ రంగంకు తను యిచ్చే ప్రాధాన్యత గురించి చెబుతూ "ఏదైనా ఆగవలసిందే కానీ వ్యవసాయం మాత్రం ఆగేది లేదు''అనే జవహర్‌లాల్ మాటలను ఉటంకిస్తూ వ్యవసాయ రంగంలో కేటాయింపులు చేశాడు. 2.4 మిలియన్ల హెక్టార్ల భూమికి అదనంగా సాగునీటి సదుపాయం, మరో 50 లక్షల కుటుంబాలకు వ్యవసాయ రుణాల విస్తరణ. మొత్తం రుణం అందుబాటు కోసం 2 లక్షల 25 వేల కోట్ల రూపాయల కేటాయింపులు చేశాడు. అయితే ఈ నిధులు ఆచరణలో కష్టాల కోరుస్తున్న రైతాంగం వద్దకు చేరతాయనే నమ్మకం లేదు. వీటిని దళారీలు మింగి వేయడం మనం నిత్యం చూస్తున్నదే. రైతాంగానికి గిట్టుబాటు ధరలు లేక కొనుగోలు శక్తి పడిపోతున్నది. ప్రయివేట్ వడ్డీ వ్యాపారం యిప్పటికీ రైతాంగం మూల్గులను పీల్చివేస్తూనే ఉంది. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల లభ్యత, వాటిలో జరుగుతున్న అనేక అక్రమాల వల్ల నిలువు దోపిడీకి గురైతున్న రైతాంగానికి ఆత్మహత్యలే శరణ్యంగా మారాయి. ఇలాంటి స్థితిలో చిదంబరం ప్రకటించిన కేటాయింపులు రైతాంగ స్థితిగతులను మార్చడానికి ఏ మాత్రం ఉపయోగపడేవిగా లేవు.

ఇక విద్యకు ఇచ్చిన ప్రాధాన్యత చూస్తే, కేటాయింపులు 32 వేల 250 కోట్లని చెప్పినప్పటికీ, ఇది జాతీయోత్పత్తిలో సుమారు

ఒక శాతం మాత్రమే. దేశంలో పిల్లలు 8వ తరగతి నుండి 9వ తరగతికి వెళ్లే సమయంలో బడి మానుకోవడం అనేది సర్వసాధారణమైంది. ఒక్కొక్క కుటుంబానికి తమ పిల్లలను బడికి పంపించడానికి నెలకు అయిదు వందల చొప్పున కేటాయిస్తోన్న లక్ష స్కాలర్ షిప్‌లు ఏ మూలకు సరిపోవు. ప్రభుత్వం ప్రాథమిక విద్యపై కంటే ఉన్నత విద్యపైన కేటాయింపులు ఎక్కువ చేస్తున్నది. అంటే రాష్ట్రపతీ, మంత్రులు 'జ్ఞాన సమాజం' అనే పేరిట మెకాలే విద్యా విధానం బాటలో సామ్రాజ్యవాదులకు ఉపయోగపడే ఐ.ఐ.టిలు, ఐ.ఐ.ఎంల స్థాపనకు పూనుకొంటున్నారు.

వైద్య రంగం విషయంలో దేశంలో మెజారిటి ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో లేదు. ప్రస్తుతం పెంచిన కేటాయింపులు సముద్రంలో నీటి బొట్టు చందమే. ఆరోగ్య రంగానికి కేంద్రం చేసిన కేటాయింపు స్థూల దేశీయోత్పత్తిలో 0.05 శాతం మాత్రమే. ప్రజల కొనుగోలు శక్తి పెరగకుండా కుటుంబాలు తమ పిల్లలను బడికి పంపించడం గానీ, తాము సరైన వైద్యం చేయించుకోవడం గాని సాధ్యం కాదు. అలాంటి చర్యలు ప్రభుత్వాలు తీసుకొంటాయని అనుకోవడం వట్టి భ్రమ మాత్రమే. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పరిశీలిస్తే ఈ విషయం మనకు తేట తెల్లమవుతుంది. ప్రస్తుత బడ్జెట్‌లో ఈ పథకాన్ని మరో 130 జిల్లాలకు విస్తరించారు. దీనితో ఈ పథకం 330 జిల్లాలకు విస్తరిస్తుంది. ఈ పథకం కింద ఇచ్చే రోజువారి కూలి మొత్తానికి 100 రూపాయల గరిష్ట పరిమితి కూడ విధించారు. గత సంవత్సరం ఒక కోటి 50 లక్షల మంది ఉపాధి హామీకై దరఖాస్తు చేసుకున్నారు. అయితే కోటి 47 లక్షల మందికి పని చూపించినప్పటికీ 33 శాతం మందికి మాత్రమే 100 రోజులకు పూర్తిగా పని కల్పించగలిగారు. పై లెక్కల ప్రకారం చూస్తే 40 కోట్ల శ్రామిక శక్తిగల ఈ దేశంలో ఏమేరకు ఉపాధి సమస్య పరిష్కరింపబడుతుంది?

ప్రభుత్వం తమ బడ్జెట్‌లో ఫోకస్‌గా పేర్కొన్న వ్యవసాయా, విద్యా, వైద్యా, భారత్ నిర్మాణ్ రంగాలకు కేటాయింపులు, వాటి డొల్లతనం యిలా ఉండగా బడ్జెట్ అసలు రంగు బయటపెట్టాల్సి ఉంది. ఇంద్రజాలికుడు తన జేబులో నుండి పావురాలను తీసిన విధంగా చిదంబరం ప్రజలపై పన్నుల భారాన్ని ఎలా పెంచాడో చూడాల్సి ఉంది. ప్రభుత్వం పేదల బడ్జెట్ అని ఎంత చెప్పుకొన్నప్పటికీ, ఆర్థిక సంస్కరణల దిశ మారలేదు. కనుక ప్రభుత్వం తన రాబడి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ప్రభుత్వానికి పన్నుల రూపంలో వస్తున్న రెవెన్యూ ప్రతి సంవత్సరం గణనీయంగా పెరుగుతూనే ఉంది. 2006-07 సంవత్సరం సవరించిన అంచనా ప్రకారం పన్నుల రూపంలో ప్రభుత్వానికి సమకూరిన రెవెన్యూ 4 లక్షల 67 వేల 848 కోట్ల రూపాయలు. ఇది 2005-06తో పోలిస్తే 27.8 శాతం పెరుగుదల సాధించింది. 2007-08 బడ్జెట్‌లో అంచనా రూ. 5 లక్షల 48 వేల కోట్లుగా చూపెట్టారు. ఇది జి.డి.పి రేటులో 11.4 శాతంగా ఉంటుంది. అంటే ప్రజలను మరింతగా పిండుక తింటారన్నమాట.

ఈ బడ్జెట్‌లో ప్రజలకు పన్నుల రాయితీల్లో పెద్దగా ఊరడింపులు ఎలాగూ లేకపోగా, గతంలో 2 శాతం ఉన్న విద్య పన్నును ఈసారి 3 శాతానికి పెంచారు. ఈ పన్ను ప్రభావం ప్రజలపై తీవ్రంగా ఉంటుంది. ఇది పన్నులపై చెల్లించాల్సిన సెస్‌గానే గాకుండా, అదనపు భారంగా ఉత్పత్తులపై, సర్వీస్ రంగంలో ఎక్సైజ్, కస్టమ్స్‌లతో పాటు సర్వీస్ టాక్స్‌గా ఈ పన్ను ప్రభావం ఉంటుంది. మధ్య తరగతి ప్రజలపై విధించే ఆదాయపు పన్నులో పెద్దగా రాయితీలు ఏమీ యివ్వలేదు. ఆదాయపు పన్ను మినహాయింపు కనీస స్థాయిని వివిధ కేటగిరిల్లో 10 వేలు మాత్రమే హెచ్చించారు. దీని వల్ల సాధారణ పన్ను చెల్లింపు దారులకు పన్ను చెల్లింపు కనీస స్థాయి 1 లక్ష నుండి లక్షా 10 వేలకు, స్త్రీలకు 1 లక్షా 35 వేల నుండి 1 లక్షా 45 వేలకు, వృద్ధులకు 1 లక్షా 85 వేల నుండి 1 లక్షా 95 వేలకు పెంచారు.

నేరుగా పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చే, ప్రజలపై పరోక్షంగా ప్రభావంపడే కస్టమ్స్ డ్యూటీని మాత్రం గణనీయంగా తగ్గించారు. ఇప్పటికీ పన్నుల (మాట్ విధానం) నుండి మినహాయించిన సాఫ్ట్‌వేర్ పార్కులు, హార్డ్‌వేర్ పార్కులు, ఎగుమతి లక్ష్యం గల యూనిట్లు, పాత ప్రత్యేక ఆర్థిక మండలాలు (ఎస్.ఈ.జడ్) విపరీతమైన లాభాలు సంపాదిస్తున్నాయి. అలాగే అనేక పన్ను మినహాయింపులతో విదేశీ మదుపుదారులకు కోట్లు తరలిపోతున్న స్టాక్ మార్కెట్లలో సామాన్య మదుపుదార్లపై ప్రభావం వేసే డెవిడెండ్స్ డిస్ట్రిబ్యూషన్ టాక్స్ (డి.డి.టి) విధించారు. వృద్ధులపై ఫ్రింజ్ బెనిఫిట్ టాక్స్‌లో భాగంగా ఉద్యోగుల స్టాక్ ఆప్షన్స్‌పై (ఇ.ఎస్.ఒ.పి.ఎస్) పన్ను విధించారు. పెట్టుబడిదారులూ, ఇతర సంపన్న వర్గాలు ఇప్పటికే పన్నుల మినహాయింపుతో విపరీతమైన లాభాలు పోగు చేసుకుంటున్న అనేక రంగాల్లో ఈసారి పెద్దగా మార్పులు చేయలేదు. ఇది ఇలా ఉంటే నూతనంగా పన్నుల విధానంపై పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని యోచిస్తున్న ఆర్థిక మంత్రి పన్నుల్లో తీవ్రమైన మార్పులకు సిద్ధం కాలేదు.

రక్షణ శాఖ వ్యయం ఏటా 7 వేల కోట్లకు పెంచుతున్నారు. ఈసారి 89 వేల కోట్ల నుండి 96 కోట్లకు పెరిగింది. యిది దేశ ప్రజలందరి విద్యా,

*(తరువాయి 25వ పేజీలో.....)*

# ప్రత్యేక ఆర్థిక మండలాలు - కొత్త రూపంలో వలస రాజ్య స్థాపన

తీవ్ర విమర్శలూ, రాజ్యాంగ వివాదాల మధ్య ప్రత్యేక మండలాలు (స్పెషల్ ఎకనామిక్ జోన్స్ - ఎస్.ఇ.జడ్‌ల) ఆవిర్భావం జరుగుతున్నది. వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఇవి వేదికలు కాబోతున్నాయి. విదేశీ పెట్టుబడుల్ని ఆకర్షించటం, ప్రపంచీకరణ, ఉదార ఆర్థిక విధానాలు, శాసనాల పట్టు సడలింపులూ, కార్మిక శ్రమను ఇష్టానుసారం దోచుకోవటంతో సహా అనేకానేక మినహాయింపులతో ప్రత్యేక సదుపాయాలతో విశేషాధికారులతో స్వదేశంలోనే విదేశీ సంస్థానాలుగా ఎస్.ఇ.జడ్‌లు ఈ దేశ స్వరూపాన్ని మార్చబోతున్నాయి. ఈ ప్రత్యేక ఆర్థిక మండలాలు ఒక్కొక్కటి వేలాది ఎకరాల భూముల్ని మింగేస్తాయి. ఈ భూముల సంతర్పణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద యెత్తున భూసేకరణకు పూనుకున్నాయి. వ్యవసాయ, పట్టణ ప్రాంత భూముల్ని బడా కార్పోరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తూ, ఇది అతిపెద్ద భూ కబ్జా దందాకే తెరలేపింది.

వాస్తవానికి, లాభాల వేటలో కార్పోరేట్ సంస్థలకూ, ప్రైవేట్ సంస్థల ప్రయోజనాలకు భూమిని బదలాయించే కార్యక్రమం మూడు ప్రక్రియల ద్వారా సాగుతున్నది. ఎస్.ఇ.జడ్‌లు, ఎన్.యు.ఆర్.ఎం(దేశీయ పట్టణ పునరుద్ధరణ పథకం)కు తోడు పట్టణ శివార్లలో, నగరపాలక సంస్థల పరిధిలోని భూములకు అవతల రియల్ ఎస్టేట్ కంపెనీలూ, భవన నిర్మాణ సంస్థలూ పెద్దయెత్తున భూ ఆక్రమణలు జరుపుతున్నాయి. పట్టణాభివృద్ధి సంస్థలే ఈ భూముల్ని అమ్ముతున్నాయి. పెద్ద పెద్ద నగరాలన్నింటిలో ఇప్పుడు ప్రజా ప్రయోజనాలేమీ లేకుండా, పూర్తి వ్యాపారమే పరమావధిగా అడ్డూ అదుపులేని భూసేకరణ కొనసాగుతోంది.

రాష్ట్రంలో కూడా బడా భూకుంభకోణాలు, భూకబ్జాలు అడ్డూ అదుపు లేకుండా యదేచ్ఛగా సాగిపోతున్నాయి. వ్యవసాయ భూములూ, ప్రభుత్వ బంజరూ, సీలింగు భూములూ, ఇనాం భూములూ, అడవి భూములూ, కొండలూ గుట్టలూ ఒకటేమిటి, ఎక్కడ కాసుల వర్షం కురుస్తుందనుకుంటే అక్కడల్లా భూముల్ని మింగేసే రాబందులు వాలిపోతున్నాయి. ఈ రాబందులు మింగేసే భూములన్నీ పేదలూ, దళితులకూ చెందినవేననేది బహిరంగమే. అదీకూడా మంత్రుల, ఎం.ఎల్.ఎల, రాజకీయుల, అధికారుల అండదండలతో ఈ భూముల కుంభకోణం నిరాఘాటంగా సాగుతున్నది. కొన్నిచోట్ల వీళ్ళే స్వయంగా కబ్జాదారులు. ఇక ప్రభుత్వం దీనికి లైసెన్స్ ఇస్తూ అసైన్డ్ భూముల చట్టానికి సవరణ కూడా తీసుకు రాబోతున్నది. ఈ రాబందులకు అడ్డంకులు లేకుండా భూములు సేకరించి అప్పగించడానికి ప్రభుత్వమే బ్రోకర్ అవతారమెత్తింది.

అసైన్డ్ భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకోవడానికి తెచ్చిన ఆర్డినెన్స్ హైదరాబాద్ నగరంలో రింగురోడ్డు, ఫ్యాబ్ సిటీ, హార్డ్‌వేర్ పార్క్, టెక్స్‌టైల్ పార్క్, ఫార్మాసిటీ, రిలయన్స్‌కు రెండున్నర వేల ఎకరాల భూమి మొదలైన వాటి కోసం సృష్టించిందని ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు అన్నీ ఆందోళన చేశాయి. దానికి నిదర్శనంగా, ప్రభుత్వం నోటీసులు జారీ చేసి, హైదరాబాద్ నగరం చుట్టూ పేదల నుంచి బలవంతంగా అసైన్డ్ భూముల సేకరణలు జరుపుతున్నది కూడా. యాచారం మండలం యాచారం, పిల్లిపల్లి, చేరకిపల్లి గ్రామాల్లో 1969 నుంచి 75 దాకా ఎస్సీలకు అసైన్ చేసిన 115 ఎకరాల భూమిని మైనింగ్ జోన్ కోసం వాపసు ఇవ్వాలని నోటీసు జారీ అయింది. నీళ్ళు, వనరులు లేక అక్కడి దళితులు, బడుగు వర్గాలు ఆ భూమిని సాగు చేసుకోలేకపోయారు. ఐదేళ్లుగా సాగు చేయడం లేదు గనుక వెనక్కు తీసుకుంటామని సెప్టెంబర్ 10న ప్రభుత్వం నోటీసు జారీ చేసింది. ఇదే సాకుతో బాట సింగారంలో వంద మంది ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీల నుంచి వంద ఎకరాల భూమి వెనక్కి తీసుకోవడానికి నోటీసు ఇచ్చారు. ఇక్కడ అంతర్జాతీయ విమానాశ్రయం వస్తున్న పరిసరాల్లో రిలయన్స్ కంపెనీ కోసం ప్రభుత్వం 2,500 ఎకరాల భూసేకరణ చేస్తున్నదని మీడియాలో చాలా ప్రచారం జరిగింది. బాటసింగారం ప్రజలు పెద్ద యెత్తున ఆందోళన చేస్తే అటువంటిదేమీ లేదని తాత్కాలికంగా అధికారులు హామీ ఇచ్చారుగానీ భూమి వెనక్కు తీసుకునే పనులు జరుగుతూనే వున్నాయి.

ఇంతకన్నా విడ్డూరమేమంటే, వినోభా భూదానోద్యమంలో ఎస్సీ, ఎస్టీ, బి.సి, ఒ.సి, మైనార్టీ ముస్లింలకు పంచిన రెండు వందల ఎకరాల భూమిని వాపసు ఇవ్వాలని అపరవినోభాగా భజనలందుకుంటున్న వై.ఎస్.ఆర్ హయాంలో ఆదిభట్ల గ్రామ పేద రైతులకు నోటీసులిచ్చారు. ఇక్కడ హార్డ్‌వేర్ పార్క్ వస్తుందని చెపుతున్నారు. ఇంకా జనహర్ష రియల్ ఎస్టేట్ పోర్కలపల్లి, రాపోలు

మొదలైన గ్రామాల్లో కొంత కొనుగోలు చేసి, ఎంతో కలుపుకున్న భూదానోద్యమ భూములు, బినామీ భూముల సంగతి ఇప్పటికే కొంత మీడియాలో బహిర్గతమైంది.

ఇవి కేవలం కొన్ని ఉదాహరణలే. ఇక రింగు రోడ్డు పేరుతో ప్రభుత్వమూ, రాజకీయులూ, వారికి కావాల్సిన వాళ్ళూ, రియల్ ఎస్టేట్ సంస్థలూ కలిసి ఎన్నెన్ని భూ కబ్జాలూ, భూకుంభకోణాలూ జరిపి హైదరాబాద్ చుట్టూ వున్న పేదల, దళితుల భూముల్ని ఏవిధంగా కాజేశారనే కథనాలు పుంఖాను పుంఖాలుగా మీడియాలో బయటికి వచ్చాయి. పేదలకు పంచిన భూముల్ని పెద్ద పెద్ద పరిశ్రమలు, ఎనిమిది లైన్ల రోడ్లు మొదలైన భారీ నిర్మాణాల కోసం వెనక్కి తీసుకోవడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను ప్రజలు, ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు అభ్యంతర పెట్టిన నేపథ్యంలో కేంద్రం చల్లగా ప్రత్యేక ఆర్థిక మండలాల (స్పెషల్ ఎకనమిక్ జోన్స్-ఎస్.ఇ.జడ్) నిర్ణయం తీసుకుంది. ఇప్పుడింక అసైన్డ్ భూములను, లేదా భూపరిమితి చట్టానికి మించి వున్న భూములను, చివరకు రైతుల పట్టా భూములను కూడా ప్రభుత్వం సేకరించాలని పూనుకున్న పట్టుదల వెనకనున్న అసలు ఉద్దేశం ఈ ప్రత్యేక ఆర్థిక మండలాల ఏర్పాటేననేది మనం అర్థం చేసుకోవాల్సిన అవసరం వుంది. ఇక భూఆక్రమణలకు పాల్పడుతున్న వారికి ఎస్.ఇ.జడ్ చట్టం వరంలా మారింది. ఇప్పుడు బయటికి వస్తున్న ఎస్.ఇ.జడ్‌ల కథల్ని బట్టి రాష్ట్రంలో, ముఖ్యంగా తెలంగాణాలో భూముల కొనుగోళ్ళ వెనుక వున్నది ఈ ఎస్.ఇ.జడ్ పథకమేననేది అర్థం అవుతుంది.

ప్రపంచీకరణ నేపథ్యంలో వ్యవసాయం నిర్లక్ష్యానికి గురై వ్యాపారం ప్రధానమైంది. ప్రపంచ మార్కెట్‌లో అభివృద్ధి చెందుతున్న దేశాల ఉత్పత్తులతో పోటీ పడటానికీ, వేగంగా అభివృద్ధి రేటు పెంచడానికీ, పారిశ్రామికాభివృద్ధి జరగాలనీ, ఇందుకు దేశ వ్యాప్తంగా మౌలిక సదుపాయాలు సమకూర్చడం చాలా ఖర్చుతో కూడుకున్నదీ, ఎక్కువ సమయం తీసుకునేది కాబట్టి, ప్రత్యేక ఆర్థిక మండలాల ఏర్పాటు ఒక వ్యూహమని ప్రభుత్వ వాదన. ఇందుకోసం కావలసిన మౌలిక సౌకర్యాలనూ, స్థలం, విద్యుత్, నీరు తదితర అవసరాలనూ కల్పించటం, పన్ను మినహాయింపులు ఇవ్వటం, సింగిల్ విండో అనుమతులివ్వటం, సులభతరమైన పద్ధతులు, చట్టాల సరళీకరణ వంటి చర్యలు చేపట్టడానికి ప్రభుత్వం పూనుకుంది. ఎన్.డి.ఎ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో వుండగా ప్రత్యేక ఆర్థిక మండళ్ల కోసం బిల్లు తయారు చేసింది. 2005 జూన్ 23న యు.పి.ఎ ప్రభుత్వం ఆ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింపజేసింది.

సమాచార హక్కు బిల్లునూ, మహిళా రిజర్వేషన్ బిల్లునూ ప్రవేశపెట్టి, చట్టం చేయడానికి ఏళ్ళకు ఏళ్ళు గడిపి మళ్ళీ వాటికి సవరణల పేరుతో తూట్లు పొడవడానికి ప్రయత్నించారు గానీ ప్రత్యేక ఆర్థిక మండలాల చట్టం మీద చాప కింద నీరులా ఏ చర్చా లేకుండా చట్టం తెచ్చారు. దీన్ని ఆపడానికి ప్రతిపక్షాలు ప్రయత్నించకుండా దాదాపు మౌనాంగీకారాంతో చట్టాన్ని కానిచ్చాయి.

ప్రత్యేక ఆర్థిక మండళ్ల పేరుతో భూసేకరణ చేసి బహుళ జాతి కంపెనీల, కార్పోరేట్ సెక్టర్లకు ఏజెంటుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేయడానికే ప్రజా ప్రతినిధుల సభలు చట్టం చేస్తున్నాయి. దేశాన్ని పారిశ్రామికీకరించడానికి గత అరవై ఏళ్ళలో లేని ఉత్సాహం హఠాత్తుగా ఈ ఆరు నెలల్లోనే వచ్చిందంటే, ఇదంతా పారిశ్రామికీకరణ కాదనీ, ఈ పేరుతో కారుచౌకగా వేల ఎకరాల భూమిని ఆక్రమించుకోగల భూదాహం మాత్రమేననేది స్పష్టమవుతున్నది.

దేశం మొత్తం మీద ఒక లక్ష హెక్టార్లలో ప్రత్యేక ఆర్థిక మండళ్లు వెలుస్తాయని ప్రస్తుత అంచనా. ఇప్పటికి అనుమతులు పొందిన ఎస్.ఇ.జడ్‌లు 263. ఇంకా 226 అనుమతి కోసం ఎదురు చూస్తున్నాయి. ఈ ఆర్థిక మండలాల్లో చేరడానికి దేశంలోని బడా కార్పోరేట్ సంస్థలైన రిలయన్స్, టాటా, బిర్లా మహేంద్ర, బజాజ్, ఎస్సార్, భారత్ ఫోర్జ్‌తో పాటు ఇన్ఫోటెక్ - బయోటెక్ రంగాల్లో ప్రముఖులైన సహారా, సత్యం, విప్రో, ఇన్ఫోసిస్, బయోకాన్, డి.ఎల్.ఎఫ్ వంటి కంపెనీలూ, నోకియా, ఫ్లెక్స్ ట్రానిక్స్, పోస్కో వంటి విదేశీ కంపెనీలు కూడా ముందుకు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రాంతాల వారీగా ఇప్పటికే సుమారుగా 49 ఎస్.ఇ.జడ్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఎ.పి, ఐ.ఐ.సి (మౌలిక సౌకర్యాల కల్పనా శాఖ) ఇప్పటికే సొంతంగా 10 ఎస్.ఇ.జడ్‌లకు అనుమతి సాధించింది. ఇందులో అధిక శాతం ఐ.టి సెజ్‌లు కాగా, మిగిలినవి బహుళ ఉత్పత్తుల రంగానికి చెందినవి. విశాఖ ఎ.పిసెజ్ (ఎస్.ఇ.జడ్)లో 50 వేల ఎకరాల స్థలాన్ని డి.వి.ఎస్ రాజు కంపెనీకి అప్పగించేందుకు సిద్ధమైంది. చిత్తూరులో 6000 ఎకరాల్లో సత్యవేడు రిజర్వ్ ఇన్‌ఫ్రా సిటీపై వేట్ లిమిటెడ్ సెజ్‌ల అనుమతి పొందింది. సత్యవేడు సెజ్ ప్రమోటర్లకే ఇప్పుడు ఫ్యాబ్ సిటీకి చెందిన 1100 ఎకరాల భూమి అప్పగింతకు రంగం సిద్ధమైంది. వీటికింద తొలి దశలో దాదాపు లక్ష ఎకరాలు, మలి దశలో అంతకన్న ఎక్కువే భూమిని రైతుల నుంచి సేకరించి ఇవ్వడానికి ప్రభుత్వం తయారుగా వుంది. ఇవన్నీ సస్యశ్యామలమైన వ్యవసాయ భూములే.

### చట్టాలకు అతీతంగా ఎస్.ఇ.జడ్‌లు

ఎస్.ఇ.జడ్‌ల చట్టం 2005లో సెక్షన్ 49 ప్రకారం వీటికి ఏ కేంద్ర చట్టం కూడా వర్తించదు. పర్యావరణ, కార్మిక శాసనాల నుంచి వీటికి మినహాయింపు వుంది. విద్యుచ్ఛక్తి ఇతర అంశాలపై రాష్ట్రాలే శాసనాలు చేసుకోవచ్చు. ఇంకా ఎక్కువ మినహాయింపులు కావాలన్నా రాష్ట్రాలు శాసనాలు చేసుకోవచ్చు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు తమకు అనుకూలమైన నియమాలు చేసుకున్నాయి. కార్మిక చట్టాల నుంచి మినహాయింపుల వల్ల శాశ్వతంగా తాత్కాలిక కార్మికులను నియమించి వారిని శ్రమ దోపిడీకి గురిచేసే సర్వాధికారాలు వీటికుంటాయి. సమ్మెల పైన లాయర్ శిఖామణులు వాదించే అవకాశాలూ లేకపోలేదు. కార్పోరేట్ ప్రభువుల సొంత నియంతృత్వ పాలనకు ఈ ఎస్.ఇ.జడ్ చట్టం ఒక పూల బాట, ఎర్ర తివాచీ. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ఎస్.ఇ.జడ్‌లు స్వదేశంలో ఏర్పాటయ్యే విదేశీ 'సంస్థానాలు'. ఇవి భారత రాజ్యానికి లోబడి వుండవు. చట్టాల కింద బాధ్యతలేమీ ఉండవు.

### ప్రత్యేక ఆర్థిక మండలాలకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు

వీటిలో లభించే రాయితీలు గమనిస్తే వీటి కోసం ఇంతగా ఎందుకు ఎగబడుతున్నారో అర్థమవుతుంది.

పరిశ్రమలు బయట కూడా ప్రోత్సాహకాలు అనుభవిస్తున్నాయి. అవికాక ఈ ప్రోత్సాహకాలు అదనం. ఏ ప్రోత్సాహకాలు లేకుండానే ఈ సేవా పరిశ్రమ ముప్పై శాతం వార్షికాభివృద్ధి సాధిస్తోంది. ఇప్పుడు రెండు చేతుల్తో లాభాలు పోగేసుకుంటాయి.

### పారిశ్రామికాభివృద్ధి పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం

ప్రత్యేక ఆర్థిక మండళ్లకు ప్రభుత్వం కేటాయించే వేలాది ఎకరాల భూమిలో కేవలం 25 శాతం మాత్రమే పరిశ్రమల వినియోగానికి, మిగతాది నివాసాలు, ఇతర సదుపాయలు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతిస్తుంది. భవనాలు, మాల్స్, గృహాలు, రహదారులు, ఎంటర్ టైన్‌మెంట్ (అంటే సినిమాలు, నైట్ క్లబ్‌లు) లాంటి వాటికోసం ఇలా చేయాల్సి వచ్చిందని అధికారులు అంటున్నారు. కనీసం 50 శాతం భూమి పారిశ్రామిక ప్రయోజనాల కోసం ఉపయోగించాలనే సవరణకు తను సిఫారసు చేసినట్లు సి.పి.ఎం సిగ్గు లేకుండా చెప్పుకుంటోంది. ఎస్.ఇ.జడ్‌లలో ఏర్పాటయ్యే సంస్థలకు బ్యాంకులు రుణాలు ఇస్తే, అది రియల్ ఎస్టేట్‌కు రుణం ఇచ్చినట్లు భావించాలని రిజర్వ్ బ్యాంకు ఆదేశించింది. ఈ ప్రత్యేక మండలాల ఏర్పాటు కోసం అభ్యర్థనలు పెట్టుకున్న వారందరూ ప్రధాన నగరాల చుట్టుపట్ల వున్న భూమి కోసమే ధరఖాస్తు చేసుకున్నారంటే వాళ్ళకు పారిశ్రామిక ఆసక్తికన్న రియల్ ఎస్టేట్ ఆసక్తే ఎక్కువని

| డెవలపర్స్‌కు ప్రోత్సాహకాలు | |
|---|---|
| ★ సెజ్‌లో నిర్మాణ, అభివృద్ధికి కావాల్సినవన్నీ విదేశాల నుంచి సుంకాలు లేకుండా దిగుమతి చేసుకోవచ్చు. | ★ 10-15 సంవత్సరాలు ఆదాయ పన్ను మినహాయింపు |
| ★ వ్యాపార సరళిలో ప్లాట్లు కేటాయింపు చేసే స్వతంత్రం | ★ అయిదేళ్లకు నూరు శాతం ఆదాయపు పన్ను రాయితీ, రెండేళ్లయితే యాభై శాతం, మరో మూడేళ్ల పాటు వచ్చిన లాభాలను తిరిగి పెట్టుబడి పెడితే యాభై శాతం వరకూ. |
| ★ నివాస ప్రాంతాన్ని అభివృద్ధి చేయటానికి విదేశీ నిధులు సెజ్‌లో స్థాపించే యూనిట్లకు ప్రోత్సాహకాలు | ★ ఆఫ్‌షోర్ బ్యాంకింగ్ యూనిట్లకు మూడేళ్ల వరకూ ఆదాయపు పన్ను మినహాయింపు, మరో రెండేళ్లకు యాభై శాతం వరకు. |
| ★ లైసెన్స్ లేకుండా దిగుమతులు | ★ సెజ్ ఏర్పాటులో విదేశాలకు సబ్ కాంట్రాక్టు ఇవ్వవచ్చు. |
| ★ దిగుమతుల మీద కస్టమ్స్ సుంకం రద్దు | ★ కొన్ని సెక్టార్లను మినహాయించి మిగతా తయారీ కాగా అన్నింటిలో నూరు శాతం విదేశీ పెట్టుబడులకు ఆటోమెటిక్ అనుమతి. |
| ★ వ్యాపార లావాదేవీలకు సంబంధించినంత వరకూ విదేశీ భూ భాగంగా పరిగణించబడుతుంది. | ★ చిన్న పరిశ్రమలకు కేటాయించిన ఉత్పత్తుల తయారికి నూరు శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి. |
| ★ దేశంలో తయారయ్యే యంత్ర సామాగ్రి, ముడిసరుకుల మీద ఎక్సైజ్ డ్యూటి ఉండదు. | ★ చిన్న పరిశ్రమలకు లైసెన్స్‌లు అవసరం లేదు. |
| ★ సెజ్‌కు సరఫరా చేసే వాటన్నింటికి ఎగుమతులకు వర్తించే నియమనింబధనలన్నీ వర్తిస్తాయి. | |

తెలిసిపోతున్నది. అలాగే మొత్తం దరఖాస్తులలో 65 శాతం కేవలం ఐదు రాష్ట్రాలలోనే వున్నాయంటే ఇది అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో మరింతగా రియల్ ఎస్టేట్ అభివృద్ధి తప్ప నిజమైన వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కాదని తేలిపోతుంది. దరఖాస్తు చేసుకున్న సంస్థలైతే స్పష్టంగానే రియల్ ఎస్టేట్, వినోద, విలాస సంస్థలుగా తెలిసిపోతున్నాయి. అవి ఎటువంటి పారిశ్రామికాభివృద్ధికి దోహదం చేయగలవో అర్థమవుతూనే వుంది. ఇటువంటి సంస్థలకు కారు చౌకగా రైతుల నుండి గుంజుకున్న వేలాది ఎకరాల భూమి ఇవ్వాలన్నమాట.

## ఎగుమతుల ప్రోత్సాహం, పరిశ్రమ అభివృద్ధి అనేది కల్పన

ఎగుమతులను ప్రోత్సహించడం ఎస్.ఇ.జడ్‌ల ప్రధాన లక్ష్యాల్లో ఒకటి అని ప్రభుత్వం చెప్పుకుంటున్నది. ఒక యూనిట్‌ను ప్రత్యేక రాయితీలు అవసరమైన ఎగుమతిదారుగా పరిగణించడానికి కావలసిన అర్హతలను ప్రభుత్వం సడలించడం జరిగింది. వాస్తవానికి వీటికి ఇచ్చిన సడలింపు ప్రకారం ఎంత ఎగుమతులయినా చేయవచ్చు, స్వదేశంలో ఎంత అమ్మకాలయినా చేయవచ్చు. ఎగుమతిదారుగా పరిగణించడానికి కావల్సింది నిర్ణీత, నికర విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించటం ఒక్కటే. భారత విదేశీ మారక నిలువలను ఖాళీ చేయదని హామీ వుంటేచాలు. ఎగుమతులకు పునాదిగా కంటే పెద్దదయిన భారత స్వదేశీ మార్కెట్‌లోకి అదనపు హక్కులతో ప్రవేశించడానికి సాధనంగా, ఎస్.ఇ.జడ్‌లు మరింత ఆకర్షణీయంగా తయారుకానున్నాయి. ఒక అధ్యయనం ప్రకారం 2003-04 కాలంలో, ఎనిమిది ఎస్.ఇ.జడ్‌ల ఎగుమతులు రూ. 13,853.8 కోట్లు లేదా మొత్తం ఎగుమతుల్లో 0.047 శాతం. 2004-05లో 11 ఎస్.ఇ.జడ్‌ల ఎగుమతుల సంపాదన రూ. 18,309 కోట్లు లేదా మొత్తం ఎగుమతుల సంపాదనలో 0.05 శాతం మాత్రమే. ఈ ఎస్.ఇ.జడ్‌లు ఉపాధి కల్పించింది ఒక లక్ష మందికి. ఇంకోపక్క చిన్న తరహా పరిశ్రమల రంగం మొత్తం ప్రత్యక్ష ఎగుమతుల్లో 35 శాతం ఎగుమతులు సాధించి, 200 లక్షల మందికి ఉపాధి కల్పించింది. (ఎస్.ఎస్.ఐ మంత్రిత్వ శాఖ 2002-03 వార్షిక రిపోర్టు).

## ప్రజల నిర్వాసన, ఆహార అభద్రత

"ఆధునిక భారత చరిత్రలో అతి పెద్ద భూకబ్జా ఉద్యమం" అంటూ సుప్రసిద్ధ చరిత్రకారుడు సుమిత్ సర్కార్ ఎస్.ఇ.జడ్‌లను వర్ణించాడు. సారవంతమైన వ్యవసాయ భూములున్న పెద్ద భూఖండాలను ఎస్.ఇ.జడ్‌ల కోసం సేకరిస్తున్నారు. పెద్ద ఎత్తున ప్రజా నిరసనలు ఎదురుకావడంతో, వ్యవసాయ భూమి కుంచించుకుపోతున్నదని సోనియా గాంధీ ఆందోళన వెలిబుచ్చింది. ఈ ఆందోళన నోటి మాటకే పరిమితం అనేది స్పష్టమే. ఎందుకంటే, కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖా మంత్రి కమల్‌నాథ్ 2006 సెప్టెంబర్‌లో అన్ని రాష్ట్రాల ముఖ్య మంత్రులకూ లేఖ రాశాడు. అందులో *"కనీసంగా అవసరమైన భూమి దొరకనప్పుడే వ్యవసాయ భూమిని సేకరించడం జరుగుతుంది". "......అవసరమైతే ఒక పంట పండే భూమినే సేకరించడం జరుగుతుంది......", "తప్పనిసరైతే రెండు పంటలు పండే వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని సేకరించడం జరుగుతుంది ...... అది ఎస్.ఇ.జడ్‌కు అవసరమైన మొత్తం భూమిలో 10 శాతానికి మించకూడదు"* అని పేర్కొన్నాడు. ఎస్.ఇ.జడ్‌ల ప్రయోజనాల కోసం వ్యవసాయ భూమిని ఉపయోగించడాన్ని ఆపే ఉద్దేశమేమీ లేదనేది సుస్పష్టమే. పెద్దఎత్తున భూమి అవసరం వుండడం వల్లా, పెద్ద జన సాంద్రత కలిగిన రాష్ట్రం కావడం వల్లా, బహుళ పంటల భూమిని సేకరించకుండా వుండడం ఎల్లప్పుడూ సాధ్యం కాదని, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర పరిశ్రమల మంత్రి నిరుపమ్ సేన్ చాలా స్పష్టంగానే చెప్పాడు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే వ్యవసాయం క్షీణించి వున్న దేశంలో ఇది వ్యవసాయ రంగంలో మరింత క్షీణతకు దారితీసేదే. మన ఆహార ధాన్యాల ఉత్పత్తికీ, ఆహార భద్రతకూ ఇది శాపమే. హర్యానాలోని ఝజ్జర్‌లో ఎస్.ఇ.జడ్‌ల కోసం సేకరించిన 10 వేల హెక్టార్ల భూమికి సంబంధించిన ఒక కేసు అధ్యయనాన్ని పరిశీలించడం జరిగింది. ఎస్.ఇ.జడ్ తీసుకున్న భూమి ఎల్లప్పుడూ 2.4 లక్షల మంది ప్రజలకు సరిపోయే ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేస్తుంది. ఇటువంటి వంద ఎస్.ఇ.జడ్‌లు భూమిని మింగేస్తే, 2.4 కోట్ల ప్రజానీకం లేదా 2 శాతం జనాభా పూర్తిగా ఆకలితో అలమటించిపోతారు. జనాభాలోని చాలా పెద్ద భాగం అర్ధాకలితో బతుకులు వెళ్లదీయాల్సి వస్తుంది. ప్రపంచ తలసరి ఆహారా ధాన్యాల లభ్యత 309 కిలోలుండగా, భారత దేశంలో అది 200 కిలోలుగా వుంది. దీని అర్థం, ఈ ఎస్.ఇ.జడ్‌ల ఏర్పాటు వల్ల భారతదేశం ప్రత్యేక పరిస్థితుల్లో ఏర్పడే కరువుల నుంచి శాశ్వత కరువు రక్కసికి బలి అవుతుంది. ఇక భవిష్యత్‌లో నిరంతరంగా మనం ఆహారాన్ని దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. వాస్తవానికి అమెరికా అతిపెద్ద గోధుమ ఉత్పత్తిదారు. కాగా, భారతదేశం ఇక దాని దయా దాక్షిణ్యాల మీద బతకాలి.

ఎగుమతుల ప్రోత్సాహాన్ని వదిలేస్తే, మన ఆహార ధాన్యాల అవసరానికి సంబంధించి కూడా చాలా హానికరమైన పరిస్థితులను సృష్టిస్తాయి.

పెద్దఎత్తున జరుగుతున్న భూసేకరణ వల్ల, భూమి స్వంతదారులే గాక జీవనాధారం కోసం ఈ భూములపై ఆధారపడిన వాళ్లు కూడా పెద్దఎత్తున నిర్వాసితులు అవుతారు. దేశ వ్యాప్తంగా రైతులు ఈ ఎస్.ఇ.జడ్‌లను వ్యతిరేకించడంలో ఆశ్చర్యమేమీ లేదు. మహారాష్ట్రలోని రాయగడ్ జిల్లాకు చెందిన రైతు *"మాకు భూమి వుంది, మేము పునరావాస షెడ్లలో వుండం, ప్రభుత్వం మమ్మల్ని అక్కడ నుంచి కూడా గెంటేస్తుంది". "పూనా ఎక్స్‌ప్రెస్ మార్గం, పెట్రోల్ పైపులైనూ, 13 ఆనకట్టలు లాంటి అనేక ప్రాజెక్టుల కోసం ఇప్పటికే మా భూమిని త్యాగం చేశాం. ఇప్పుడు వాళ్లు ప్రతిదీ కావాలంటున్నారు. మాకు డబ్బులు వద్దు"* అని అన్నాడు. ఇక్కడ భూ స్వాధీనం, గెంటివేతను ఎదుర్కొంటున్న రైతులు "ఎస్.ఇ.జడ్‌లకు బదులు ప్రభుత్వం ఎస్.ఎ.జడ్‌లు (ప్రత్యేక వ్యవసాయ మండలాలు) ఎందుకు అభివృద్ధి చేయదని'' అడుగుతున్నారు. "భూమికి యజమానిగా, తన భూమికి సంబంధించిన షరతులను నిర్ణయించే అవకాశం కూడ రైతుకు లేదు'' అని వి.పి.సింగ్ అన్నాడు. దేశంలోని ఆత్మహత్యలు జరుగుతున్న ప్రాంతాల్లో భూముల ధరలు తీవ్రంగా పడిపోతున్నాయని కూడా వాస్తవాలు చెప్తున్నాయి. రైతులకు 'మార్కెట్ ధర' చెల్లించినా కూడ భూముల ధరలు పడిపోతున్న ఈ తరుణం రైతుల నుండి భూమిని చౌకగా కొట్టేసి, కార్పోరేట్ల ప్రయోజనాలకు మళ్లించడానికి కలిసొచ్చే అదునుగా మారుతుంది. దేశాభివృద్ధి అని చెప్పేదాని అర్థం మరోసారి రైతాంగపూ, విశాల ప్రజానీకపు పొట్టలు కొట్టి బడా పెట్టుబడికి లాభాల అభివృద్ధిగా మారుతుంది.

### ఖజానా ఖాళీ

ఎస్.ఇ.జడ్‌ల ఏర్పాటు వల్ల లక్ష కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడులు వస్తాయని కేంద్ర వాణిజ్య మంత్రి కమల్ నాథ్ చెప్తుంటే, ఇన్ని రకాల పన్ను మినహాయింపుల వల్ల కేంద్ర ఖజానాకు 2010 మార్చి నాటికి 1,75,487 కోట్ల రూపాయల నష్టం వస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం చెప్పాడు. అంటే ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం ఈ నాలుగేళ్లలో ఏటా 43 వేల 623 కోట్లు తగ్గుతుంది. విదేశీ బహుళజాతి, కార్పోరేట్ సంస్థల ప్రయోజనాలను నెరవేర్చడానికి ఎవరి అంచనాలు ఏమైనప్పటికీ విదేశీ బహుళజాతి, కార్పోరేట్ సంస్థల ప్రయోజనాలను నెరవేర్చడానికి చిదంబరాలూ, కమల్‌నాథ్‌లూ, సోనియాలూ, మన్మోహన్‌లూ తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తుండగా, ఇంతటి భారీ నష్టాన్ని భరించడానికి కూడా ప్రభుత్వం సిద్ధమవుతున్నది. ఇక్కడ తయారయ్యే ఉత్పత్తుల్ని అధిక ధరలకి మళ్లీ సమాజానికే అంటగడతారు.

ఒకపక్క ఆహారం, వ్యవసాయానికి పెద్దఎత్తున సబ్సిడీలు ఇస్తున్నామని ఏడుస్తున్న పాలకులు ఎగుమతుల ప్రోత్సాహానికీ, మరింత పెద్దమొత్తంలో ఎస్.ఇ.జడ్‌లకూ ఇస్తున్న అధికాధికమైన సబ్సిడీల గురించి నోరు మెదపరు. ఎకానమిక్ టైమ్స్ పత్రిక (2006 నవంబర్ సంచిక) చెప్పినదాని ప్రకారం, ''2005/06లో ఎస్.ఇ.జడ్‌లు గాక, ఎగుమతి ప్రోత్సాహక పథకాలు మొత్తం కలిపి ఖజానా నుంచి రూ. 34,430 కోట్లు ఖాళీ చేశాయి''. 2007/08లో ఎస్.ఇ.జడ్‌ల వల్ల ఖజానాకు రూ. 26 వేల కోట్ల పెద్ద బొక్కపడుతుంది.

వాస్తవంలో ఉనికిలో వున్న పరిశ్రమలు కూడా పెద్దయెత్తున రాయితీల ప్రయోజనాలను పొందడానికి ఎస్.ఇ.జడ్‌లకు వలస పోతాయి. దీనివల్ల పన్నుల ఆదాయాన్ని నష్టపోవడమే గాక, స్వదేశీ మార్కెట్‌కు ఉత్పత్తి చేసే ప్రదేశాలుగా (రిటైల్, నివాస, వినోద సంబంధమైనవి కలుపుకొని) ఎస్.ఇ.జడ్‌లు తయారవుతాయి. ఇది ఎస్.ఇ.జడ్‌లకు బయట వున్న యూనిట్ల మీద ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది.

### కార్మికులపై దాడి

ఎస్.ఇ.జడ్‌ల మీద తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ ఎలాంటి కార్మిక చట్టాలూ అమలుకావు. ఎస్.ఇ.జడ్‌లు "ప్రజోపయోగ సేవలు'' అనే హోదాను అనుభవిస్తున్నాయి. అందువల్ల కార్మికులు తమ డిమాండ్ల పరిష్కారానికి సమ్మెలకు దిగడం చట్టవిరుద్ధమవుతుంది. కార్మికులకు, యాజమాన్యానికీ రాజీ కుదిర్చే క్రమంలో సాంప్రదాయకంగా మొట్టమొదట జోక్యం చేసుకునే లేబర్ కమీషనర్ బాధ్యతలు అభివృద్ధి కమీషనర్ ప్రధాన బాధ్యతగా అతడి చేతిలోకి వెళ్లాయి. యాదృచ్ఛికంగా, ఇది పెట్టుబడికి అనుకూలంగా పరిశ్రమలను సంతోషపెడుతోంది. గ్రేటర్ నోయిడాలోని ఎస్.ఇ.జడ్‌లో మూత్రశాలకు పోవడానికి పాస్‌లు పెట్టి, అది లేకుండా వెళ్లినందుకు జరిమానా వేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అసలక్కడ కార్మికుల సంఖ్యకు సరిపోను పాస్‌లు కూడా లేవు. ఈ ఎస్.ఇ.జడ్‌లలో కాంట్రాక్టు కార్మికులను పెద్ద సంఖ్యలో ఉపయోగించుకోవడం జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ ఎస్.ఇ.జడ్‌లను ప్రోత్సహించడంలో ముందురుకుతున్నది. యూనియన్లలో బయటివారిని నిషేధించే నిబంధనలు తయారు చేసి, ఆ విధంగా కార్మికులు సంఘటితంగా తమ సమస్యల పరిష్కారం కోసం డిమాండ్ చేసే అవకాశాన్ని బాగా తగ్గించాలని చూస్తోంది.

బాధాకరమైన వాస్తవమేమిటంటే ఈ ఎస్.ఇ.జడ్‌లు దేశమంతా వీటిని అనుసరించవల్సిన 'నమూనాలు'గా తయారుకానున్నాయి.

మరోమాటలో చెప్పాలంటే త్వరలోనే ఈ సంస్థానాలు దేశమంతటా కార్మిక రక్షణా చట్టాలన్నింటినీ పీకి పారేయడానికి దారులేస్తాయి. గురుగావ్ హోండా కార్మికుల మీద అమానుష కాండలాంటివెన్నో ఈ ఎస్.ఇ.జడ్‌లలో చూడాల్సి వుంటుంది.

### ముగింపు

దీనంతటి సారాంశం చూస్తే, భారత ప్రభుత్వం సామ్రాజ్యవాదుల ముందూ, స్వదేశీ దళారీ నిరంకుశ పెట్టుబడి ముందూ సాష్టాంగపడుతున్న దానికి ఈ ఎస్.ఇ.జడ్‌లు స్పష్టమైన తాజా ఉదాహరణలు. అభివృద్ధి పేరుతో అతి ముఖ్య వనరైన భూమిని బడా పెట్టుబడికి ధారదత్తం చేయడం జరుగుతున్నది. దీనివల్ల మన జనాభాలోని విశాల ప్రజానీకపు జీవనాధారానికీ, భూమికీ ముప్పు ఏర్పడటమేకాదు, 'అభివృద్ధి' ప్రాజెక్టులన్నింటిలోలాగానే, ఈ 'అభివృద్ధి' భారాన్ని మోసే ప్రజలు ప్రాజెక్టు (ఇక్కడ ఎస్.ఇ.జడ్) ఫలాలని అందుకోలేరు. 65 శాతం జనాభా వ్యవసాయం మీద ఆధారపడి బతికే దేశంలో, వ్యవసాయ అభివృద్ధి లేకుండా ఏ అభివృద్దీ లేదు. వాస్తవానికి, ఇప్పటికే వ్యవసాయ భూములు కుంచించుకుపోగా ఈ ఎస్.ఇ.జడ్‌లు ఎటువంటి ఉపాధినీ నిరూపించకుండా, అన్యాయంగా భూముల్ని ఆక్రమిస్తున్నాయి. ఈ ఎస్.ఇ.జడ్‌లు బహిరంగంగా చెప్పుకుంటునటువంటి వాటి విధాన లక్ష్యమైన ఎగుమతుల ప్రోత్సాహానికి కూడా ఇది ప్రతికూలమే. ఇవి మౌలిక సదుపాయాల అభివృద్ధి పేరుతో, బహుళ అంతస్తుల భవనాలూ, దుకాణ సముదాయాలూ, వినోదాలందించే భవన సముదాయాలూ లేపుతున్నాయి. అనేక మంది ప్రజలకు జీవనాధారం, భూమీ లేకుండా చేస్తూ, ఉపాధికల్పన గురించి మాట్లాడడమంటే కుళ్లు జోకే. ఎస్.ఇ.జడ్‌లలో ఉపాధి పొందిన కార్మికులు ఎటువంటి రక్షణా పొందరు. ఈ ఎస్.ఇ.జడ్‌లలో స్థానం సంపాదించే సత్తాలేని చిన్న పెట్టుబడిదారులు కూడా వివక్షకు గురవుతారు.

దేశంలో విదేశీ భూభాగంగా భావించబడే (ఎస్.ఇ.జడ్ చట్టమే ఇలా చెప్తున్నది) సంస్థానాల్ని సృష్టించడమనేది దొడ్డి దారిన వలస పాలన ప్రవేశపెట్టడం తప్ప మరేమీకాదు. ఇది మన భూమి, మన వనరులూ, మన కార్మికుల్నీ సామ్రాజ్యవాదులకూ, బడా పెట్టుబడికీ బంగారు పళ్లెంలో పెట్టి అప్పజెప్పటమే. "ప్రజాభిప్రాయాన్ని తుంగలో తొక్కి సిగ్గులేకుండా ప్రైవేట్ కంపెనీలకు అనుకూలంగా పని చేయటం....ఎస్.ఇ.జడ్‌ల స్థాపన ప్రజల్ని తిరిగి లేవకుండా గోతిలోకి నెడుతుంది" అని మాజీ ప్రధాని వి.పి.సింగ్ అన్నాడు. ఆయన ఇంకా ఇలా అడుగుతున్నాడు "ఇంత ఘోరమైన పరిస్థితులుంటే, గ్రామీణ ప్రాంతాల్లో మావోయిస్టు సాయుధ పోరాటం జరగక ఏమవుతుంది?" హార్డ్ న్యూస్ అనే పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో "నేను కూడా మావోయిస్టు కావాలనుకుంటున్నా, కాకపోతే, నా వయసుడిగిపోయిందంతే" అని కూడా ఆయనన్నాడు.

**ఎస్.ఇ.జడ్‌లు భారతదేశం లోపలే ఏర్పాటు చేస్తున్న విదేశీ 'సంస్థానాలు' తప్ప మరేమీకాదు. వీటికి అనేక భారత చట్టాలు వర్తించవు. పన్ను వసూళ్ళు విపరీతంగా తగ్గించడం జరిగింది. దేశంలోని భూమినీ, ప్రజల్నీ కొల్లగొట్టుకొని దళారీ బడా వ్యాపార సంస్థలూ, సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలూ తమ లాభాల్ని పదింతలు పెంచుకోవడానికి రాచబాటలేసేవే ఇవి. నందిగ్రామ్ అమానుషకాండ సాక్షిగా ఈ దేశంలో లక్షలాది రైతుల్నీ, పేదల్నీ, దళితుల్నీ వారి జీవనాధారమైన భూముల్లో నుంచి తరిమేసి, గ్రామీణ వ్యవసాయ భూమిని దౌర్జన్యంగా, ప్రభుత్వ అండదండలతోనే ఆక్రమించుకునే భూ కుంభకోణం ఇది. వీటికి ఏ కార్మిక చట్టాలూ వర్తించవు. విపరీత లాభాల సంపాదనకు, భారత కార్మికుల్ని అతి తక్కువ కూలికి ఉపయోగించుకుంటారు. ఈ లాభాలన్నీ పన్నులు లేనివే, ఇంకా ఎక్కువగా దేశ సంపదను (ఖజానాను) ఖాళీ చేసేవి. ఇంతటి పెద్ద ప్రోత్సాహకాలతో, భారత బడా వ్యాపారం (దళారులూ, బహుళజాతి సంస్థలు నడిపే) ఈ సిసలైన విదేశీ సంస్థానాల్లోకి అడుగుపెడుతున్న దాని ఫలితం, కొత్త రూపంలో 'వలసరాజ్య స్థాపన.'**

ఇంతటి భారీ స్థాయిలో సాగుతున్న 'వలస రాజ్యాల స్థాపన' (ప్రత్యేక ఆర్థిక మండలాల ఏర్పాటు)ను అడ్డుకోవడం మామూలు మాటలతో అయ్యే పనికాదు. ప్రజలు స్వతస్సిద్ధంగా పోరాటాలకు దిగినా కాల్పులతో అణచివేయడానికి కూడా వెనుకాడేది లేదని నందిగ్రామ్ సంఘటనతో పాలకవర్గాలు రుజువు చేశాయి.

ఒరిస్సాలో ఎస్.ఇ.జడ్‌ల ఏర్పాటుకు ఒక లక్షా 31 వేల ఎకరాల భూమిని అప్పగించడానికి సిద్ధమైన నవీన్ పట్నాయక్ ప్రభుత్వం ప్రతిఘటించిన ప్రజలపై తానెంత దమనకాండకు తెగబడగలదో కళింగనగర్ ఘటనలోనే నిరూపించింది. పెప్సీ కంపెనీకి భూములు అప్పగించడాన్ని వ్యతిరేకించిన ప్రజలపై పంజాబ్ ప్రభుత్వం తీవ్రమైన అణచివేతనే ప్రయోగించింది. ఎస్.ఇ.జడ్‌ల ఏర్పాటుకు ముందురుకుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటువంటి అణచివేతలూ, హత్యాకాండల్లో ఆరితేరింది.

*(తరువాయి 27వ పేజీలో...)*

# రానిబోదిలి - ప్రతిఘటనా చరిత్రలో ఒక మైలురాయి

(రానిబోదిలి విజయానికి సంబంధించిన రాజకీయ మిలటరీ ప్రాధాన్యతలను వివరిస్తూ 'క్రాంతి'తో కామ్రేడ్ దేవ్‌జీ మాట్లాడిన దాన్ని యథాతథంగా ప్రచురిస్తున్నాం.)

రానిబోదిలీ విజయానికి సంబంధించిన రాజకీయ మిలటరీ ప్రాధాన్యత ఏమిటనేది నాలుగు అయిదు విషయాలను చెప్పదల్చుకున్నా. ఈ దాడి నేషనల్ పార్క్ ఏరియాలో జరిగింది. నేషనల్ పార్క్ ఏరియాలో ముఖ్యంగా ప్రజా వ్యతిరేకులందరూ భూస్వాములు, కర్మ అనుయాయులు ఉన్నటువంటి ప్రాంతం ఇది. వాళ్ళందరికి బలమైన ప్రాంతం కూడా ఇది. ఈ ప్రాంతంలోనే 2005, జూన్ 5న అంబేలిలో సంఘనాయకుల్ని పట్టుకొని కొట్టిన సంఘటన జరిగింది. అప్పటినుంచి సల్వాజుడుం ప్రారంభమయింది. అప్పటినుంచి మిగతా ప్రాంతాలతో చూసుకున్నట్టయితే అక్కడ మన నుంచి పెద్ద దాడులు జరగలేదు. ఎన్.ఎం.డి.సిపై దాడి చేసినం. గంగలూరు, భైరంగఢ్ ప్రాంతాల్లో, దక్షిణ బస్తర్‌లో కొన్ని దాడులు చేసినం. కాని ఈ ప్రాంతంలో చేయలేదు. ఈ పరిస్థితిలో నేషనల్ పార్క్‌లో దాడి చేయాలనుకున్నం, చేసినం. ఈ రెయిడ్ సక్సెస్ కావడంతోటి మనం ఆశించినది నెరవేరింది. అంటే జుడుంకు బలమైన ప్రాంతం కాబట్టి ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున శత్రువును నిర్మూలించాలనుకున్నం, ఎస్.పి.ఒలను నిర్మూలించాలనుకున్నం అనుకున్నట్టుగనే నిర్మూలించినం. ఆ ఎన్.పి.ఒలు ఈ ప్రాంతంవాళ్లే వాళ్లు సల్వాజుడూంకు కళ్లూ, చెవులుగా వ్యవహరిస్తున్నారు. కాబట్టి వారిమీద గట్టి దెబ్బ పడ్డం వల్ల ఈ ప్రాంతంలో జుడూం బలహీనపడడానికి ఉపయోగపడ్డది. ఆ విజయంతోటి నేషనల్ పార్క్‌లో మన విప్లవ ప్రాంతానికి సంబంధించినటువంటి ప్రజలూ, ప్రజాసంఘాలు, మిలీషియా..... ఇలా మొత్తం పార్టీలో పెద్ద ఉత్సాహం కలిగింది. అంతేగాక ఈ ప్రాంతంలో ఉన్నటువంటి ప్రజా వ్యతిరేకులకు, జుడూం నాయకులకు భయాందోళనలు కలిగినయి. స్థానికంగనేమో జుడూం బాగానే బలహీనపడ్డది. బలహీనపడ్డానికి మంచి ప్రాతిపదిక ఏర్పడింది. అలాగే మిగతా బస్తర్ ప్రాంతంలో సల్వాజుడూంలో వున్న ఎస్.పి.ఒలలో ఆందోళన కలిగించింది. జుడూం గూండాలకు కూడా భయం పుట్టించింది. ఆ రకంగా ఈ విజయం జుడూం బలహీనపడ్డానికి తోడ్పడ్డది అదే సమయంలో జుడూంలో ముందుభాగానున్నటువంటి ఎస్.పి.ఒ, గూండాల్లో పార్టీతోని, ప్రజలతోని తలపడి గెలవలేము అనేటటువంటిదాన్ని సృష్టించింది. ఇది మనకు రాజకీయంగా విజయం. మిలిటరీ చర్యల ద్వారా ఒక రాజకీయ వాతావరణం క్రియేట్ అవుతుంది. అలాగే మనం చేపట్టేటటువంటి రాజకీయ ఆందోళనలు మన మిలిటరీ చర్యలకు సాధికారతను కల్పిస్తయి. అట్ల చూసుకుంటే ఈ మిలిటరీ చర్య ద్వారా జుడూం మొరేల్ బలహీనపడి ఒక రాజకీయ వాతావరణం ఏర్పడింది.

**దండకారణ్యం, పశ్చిమ బస్తర్ డివిజన్‌లోని నేషనల్ పార్క్ ఏరియా పరిధిలో వున్న రానిబోదిలి పోలీసు క్యాంపుపై 2007, మార్చి 14వ తేదిన అర్ధరాత్రి దాటిన తర్వాత పి.ఎల్.జి.ఎ దాడి చేసింది. ఈ దాడిలో 16 మంది పోలీసులనూ 39 మంది ప్రత్యేక పోలీసు అధికారుల (ఎస్.పి.ఒ)ను పి.ఎల్.జి.ఎ హతమార్చింది. 33 ఆయుధాలను స్వాధీనం చేసుకుంది. రెండున్నర గంటలపాటు అత్యంత సాహసంతో హోరా హోరిగా పోరాడి పార్టీకీ, ప్రజలకు ఒక గొప్ప విజయాన్ని అందించిన పి.ఎల్.జి.ఎకు విప్లవ జేజేలు చెబుదాం. ఈ పోరులో వీరోచితంగా పోరాడుతూ కామ్రేడ్స్ మోహన్, లింగన్న కైలాస్, భగత్, భీమాల్, చైతులు నేలకొరిగారు. ఒక గొప్ప విజయాన్ని అందించడం కోసం తమ ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పించిన ఈ కామ్రేడ్స్‌కు విప్లవ జోహార్లు అర్పిద్దాం. వారి త్యాగాలను ఎత్తిపడదాం.**

రెండవ విషయానికొస్తే అదంతా కార్పెట్ సెక్యూరిటీ ఏర్పాటు చేసిన ప్రాంతం. కార్పెట్ సెక్యూరిటీ అంటే 5 నుండి 10 కిలోమీటర్ల పరిధిలో ఒక పోలీస్ స్టేషన్ లేదా క్యాంపు ఏర్పాటు చేస్తరు. తిరుగుబాట్లు, విప్లవ కార్యకలాపాలు కొనసాగుతున్న ప్రాంతంలో దాన్ని అణచివేయడానికి సంబంధించి సైనిక పథకం ప్రకారం ఏరియా డామినేషన్, అంటే ఏరియా మొత్తం తన అదుపులో ఉంచుకోవడానికి కార్పెట్ సెక్యూరిటి అనేదాన్ని ఏర్పాటు చేస్తుండ్రు. డికె వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని అనుకుంటున్నప్పటికీ బలగాల కొరతవల్ల చేయలేకపోయిండ్రు. పశ్చిమ్ బస్తర్ ప్రాంతంలో చేసిండ్రు. 5 నుంచి 10 కి.మీ పరిధిలో పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసి మొత్తం వాళ్లకు అనుకూలంగా ఉంచుకుండ్రు. ఇంత లోపలికి వచ్చి నక్సల్స్ మమ్మల్నేం చెయ్యలేరని వాళ్లనుకుండ్రు. ఒకటి అది ప్రజా వ్యతిరేకులకు అనుకూల ప్రాంతం కావడం, రెండవది మన ఆర్గనైజేషన్ బలహీనంగా ఉన్న ప్రాంతం కావడం దీనికి తోడు అక్కడ కార్పెట్ సెక్యూరిటి ఏర్పాటు చేసిండ్రు కాబట్టి మనం ఛేదించలేం అని

# కామ్రేడ్ మోహన్ అమర్ రహే!

కామ్రేడ్ మోహన్ (చాప గుజ్జా) 29 సంవత్సరాల క్రితం పశ్చిమ బస్తర్ డివిజన్‌లోని బండారుపల్లి గ్రామంలో పుట్టాడు. 10వ తరగతి వరకు చదువుకున్నాడు. విప్లవ ప్రభావం బలంగా వున్న ప్రాంతం కావడం వల్ల సహజంగానే అతని విద్యార్థి దశంతా విప్లవ రాజకీయాల మధ్యనే గడిచింది. చదువును ముగించిన తర్వాత కొన్నాళ్ళు డి.ఎ.కె.ఎం.ఎస్‌లో పని చేసి 1996లో మద్దేడు దళ సభ్యుడిగా చేరాడు. ఆనాడు ఆ ఏరియాలో కొనసాగిన తీవ్ర నిర్బంధం మధ్యనే దృఢంగా నిలదొక్కుకొని 1999లో భోపాల్ పట్నం ఎల్.ఒ.ఎస్ కమాండర్ బాధ్యతల్ని చేపట్టాడు. ప్రజలను వివిధ పోరాటాల్లోకి కదిలిస్తూ సంఘ నిర్మాణాలను బలోపేతం చేస్తూ తాను రాజకీయంగా అభివృద్ధి అయ్యాడు. ఈ క్రమంలో శత్రు నిర్బంధాన్ని తిప్పికొట్టడంలో దృఢంగా నిలబడ్డాడు. అట్లా కామ్రేడ్ మోహన్‌లోని చురుకైన అభివృద్ధిని చూసిన పార్టీ 2002లో అతనికి మద్దేడు ఏరియా కార్యదర్శి బాధ్యతలను ఇచ్చింది. ఆ సమయంలో ప్రత్యేక ప్రజాస్వామిక బస్తర్ రాష్ట్రం కోసం పార్టీ పలు ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించింది. కా. మోహన్ ఆ ఆందోళనా కార్యక్రమాలలోకి ప్రజలను చురుగ్గా కదిలించాడు. పలు మిలిటరీ కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొన్నాడు. 2003లో అతను పశ్చిమ బస్తర్ డివిసి సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 2004లో డివిజనల్ కమాండర్ ఇన్ ఛీఫ్‌గా, సబ్ జోనల్ కమాండ్ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించాడు. కమాండర్ ఇన్ చీఫ్‌గా డివిజన్‌లో సల్వాజుడుంను ఎదుర్కోవడంలో కీలకపాత్రను వహించాడు. అందులో భాగంగా రానిబోదిలి ఘటనలో ఒక అసాల్ట్ టీంకు కమాండర్‌గా వుండి తమ టీం అంతా శత్రు దుర్గంలోకి దూసుకుపోయి టార్గెట్‌ను విజయవంతంగా ఛేదించడంలో కీలకపాత్రను వహించాడు. అయితే ప్రధాన అసాల్ట్ టీం ఛేదించ వలసిన లక్ష్యంలో శత్రు బలగాలు ఎక్కువ సంఖ్యలో వుండి విపరీతంగా కాల్పులు జరపడం వల్ల అది అనుకున్న సమయంలో అదుపులోకి రాలేదు. తన కర్తవ్యం పరిపూర్తి అయిన తర్వాత కమాండర్ ఆదేశానుసారం కా. మోహన్ ప్రధాన అసాల్ట్ టీంకు సహాయకుడిగా వెళ్ళాడు. శత్రు బలగాలను లొంగదీసుకోవడంలో భాగంగా వీరోచితంగా కాల్పులు జరుపుతూ వారి మీదికి దూసుకుపోయాడు. ఆ క్రమంలో శత్రువు జరిపిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే నేలకొరిగాడు. అట్లా తన నెత్తురు ధారపోసి దాడి విజయానికి మార్గం వేసాడు.




శత్రువు విశ్వసిస్తున్న పరిస్థితిలో మనకున్నటువంటి ప్రజా పునాదిని ఆధారం చేసుకుని ఈ దాడిని చేసినం. ఇంతకాలం జుడూం కొనసాగింది కనుక సంఘాలు దెబ్బతినిపోయినయ్. ఇక ఇదంతా మనచేతుల వున్న ప్రాంతం అని శత్రువు విర్రవీగిండు. అయితే అక్కడ కొంతమంది సంఘ నాయకత్వం వెనక్కి తగ్గినా ప్రజలు ఇప్పటికీ వేరు వేరు రూపాల్లో మనకు మద్దతు ఇస్తున్నారు కాబట్టి వాళ్ళనాధారం చేసుకొని ఆ క్యాంపుకు సంబంధించినటువంటి మొత్తం సమాచారం సేకరించగల్గినం. ఆ క్యాంపు బాలికాశ్రమంలో వుంది. కాబట్టి దేంట్లో పోలీసులుంటరూ, దేంట్లో అమ్మాయిలుంటరు ఎట్లా ప్రవేశించవచ్చు, ఎట్లా దాడి చేయవచ్చు అనేటువంటి చాలా వివరమైన సమాచారాన్ని విప్లవ ప్రజానీకం మనకందించారు. కార్పెట్ సెక్యూరిటీ వల్ల మనం ప్రత్యక్షంగా వెళ్ళి చూడ్డానికి అవకాశం లేని పరిస్థితి ఉన్నప్పటికీ కూడా ప్రజా పునాది వుంటే ప్రతికూల పరిస్థితుల్లోనైనా మనకెటువంటి సమాచారమైనా వస్తదనేదానికి ఈ రెయిడ్ ఒక ఉదాహరణగా నిలుస్తది. ప్రజలు ఇచ్చిన సమాచారాన్ని ఆధారం చేసుకొనే విజయానికి గ్యారంటీ ఇవ్వగలిగేటటువంటి పథకాన్ని తయారుచేసుకోగలిగినం. దానిమీద ఆధారపడే మన కామ్రేడ్స్ చాలా సాహసంగా పోరాడిండ్రు. కార్పెట్ సెక్యూరిటీని ఛేదించి శత్రువు పెట్టుకున్నటువంటి ఆశలన్నింటినీ వమ్ముచేసి శత్రువు విశ్వాసాన్ని దెబ్బతీయగలిగాం. అంటే పి.ఎల్.జి.ఎ కార్పెట్ సెక్యూరిటీని కూడా ఛేధించగలుగుతుంది. ఎంత దగ్గర దగ్గర క్యాంపులు వేసుకున్నప్పటికి కూడా మనకు భద్రతంటూ వుండదు అనే అభద్రతను శత్రువులో కల్పించినం. దాడి జరిగేటప్పుడు శత్రువుకు భద్రత లేకపోవడం ఒకటైతే దాడి జరిగిన తర్వాత కూడా చుట్టుపక్కల పోలీస్ స్టేషన్లు ఉన్నప్పటికీ కూడా ప్రజల మద్దతు మన వేగవంతమైన కదలికలతోటి శత్రువు వలలో చిక్కకుండ మనం బయటకు రాగలిగినం. అటు ఉత్తరం వైపు కుట్రు పోలీస్ స్టేషన్ వుంది, దక్షిణం వైపు మరత్వాడ పోలీస్ స్టేషను వుంది, ఇంకా చుట్టుపక్కల రెండు మూడు పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. రెయిడ్ జరిగిన తర్వాత ఐదు, ఐదున్నర గంటల ప్రాంతానికి కొత్త బలగాలు రానిబోదిలికి చేరుకున్నాయి. ఆ

బలగాలను చేధించుకొని రాగలిగినం. కార్పొరేట్ సెక్యూరిటీని దెబ్బతీయడం రెండవ విజయం.

మూడవ విజయం ఏందంటే డికె కాన్ఫరెన్స్, డికె గత ఉద్యమాన్నీ ఇక్కడ కొనసాగుతున్న యుద్ధాన్నీ మొత్తం విశ్లేషించి ఈ యుద్ధాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్ళడానికి ప్రాతిపదిక ఏర్పడివుంది, దీన్నాధారం చేసుకొని మనం చైతన్యయుతంగా చొరవ కోల్పోకుండా దీన్ని మొబైల్ యుద్ధంగా అభివృద్ధి చేయాలి, మొబైల్ యుద్ధంగా అభివృద్ధి చేయడం ద్వారానే డికెను విముక్తి ప్రాంతం చేయగల్గుతమని రానున్న ఐదేండ్ల కాలానికి ఉన్నత కర్తవ్యాలను చేపట్టింది. వెంటనే జరిగిన 9వ ఐక్యతా కాంగ్రెస్ కూడా డికెను విముక్తి ప్రాంతం చేయాలనే కేంద్ర, ప్రధాన కర్తవ్యాన్ని మనముందుంచింది. ఈ పరిస్థితిలో ఈ చర్య జరగడం అనేటటువంటిది ఒక ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన అంశం. ఈ దాడిలో పెద్ద ఎత్తున శత్రువును నిర్మూలించినం. ఒకే చర్యలో 55 మందిని నిర్మూలించడం అనేది దాదాపు మన పార్టీ చరిత్రలో మునుపెన్నడూ జరగలేదు. ఇలా నిర్మూలించడం ద్వారా డికె పార్టీ ఏ కర్తవ్యాన్ని నిర్దేశించుకుందో ఆ కర్తవ్య సాధనలో అంటే మొబైల్ యుద్ధం దిశగా మన పి.ఎల్.జి.ఎ ఒక స్పష్టమైన ముందడుగు వేసిందని చెప్పవచ్చు. ఒక కర్తవ్యాన్ని నిర్దేశించుకొన్న తర్వాత వెంటనే చాలా సమయం తీసుకోకుండా ఒక పెద్ద నిర్మూలనా చర్య చేయడం ద్వారా మనకు రాజకీయంగా, మిలటరీ పరంగా రెండు రకాల అనుకూలతలు చేకూరినయ్. ఇప్పటి వరకు మనం మొబైల్ యుద్ధం అంటే ఏంటిది? ఎట్లా వుంటది? అనే విషయాన్ని సైద్ధాంతికంగా చెప్పడానికి ప్రయత్నం చేసినం. ఇప్పుడు ఆచరణలో ఒక ఉదాహరణగా మొబైల్ యుద్ధంలో శత్రువును పెద్ద ఎత్తున నిర్మూలించడం అంటే ఎట్లా ఉంటుంది అనడానికి కింది స్థాయి కామ్రేడ్స్‌కు, కొత్తగా వచ్చిన కామ్రేడ్స్‌కు, ప్రజలకు, మిలీషియాకు అర్థం చేయించడానికి మొబైల్ యుద్ధం అంటే రానిబోదిలి లాంటి దాడులు చేయడం ద్వారా శత్రువును పెద్దఎత్తున నిర్మూలించడం, ఇలాంటి చర్యలు అడపాదడపగా కాకుండా ఒక నిర్దిష్ట ప్రాంతంలో వరుసగా చేయడం ద్వారా శత్రువును పెద్దఎత్తున నిర్మూలించడం ద్వారా బలాబలాల్లో మార్పులొస్తయి, అట్ల యుద్ధం ఒక ఉన్నతస్థాయికి అభివృద్ధవుతది, యుద్ధాన్ని ఆత్మరక్షణ స్థాయినుంచి ప్రతిష్టంభన స్థాయిలోకి తీసుకురావచ్చు అని చెప్పుకోవడానికి ఒక నమూనాగా, ఒక ఉదాహరణగా నిలిచేటటువంటి చర్య యిది.

నాల్గవ మాటకొస్తే ఇది ఒక స్థానిక విజయం మాత్రమేకాదు. అంటే కేవలం డికెకు సంబంధించిన ప్రాదాన్యత కలిగినటువంటి విషయం మాత్రమేకాదు. దేశవ్యాప్తంగా కూడా ఇది చాలా చర్చనీయాంశంగా మారింది. దేశంలో ఉన్నటువంటి కౌంటర్ ఇన్‌సర్జెన్సీ నిపుణులు అందరూ కూర్చొని ఈ దాడికి సంబంధించిన సమాచార సేకరణ చేసారు, విశ్లేషించారు. రానిబోదిలి పిడి ఘటనే కావచ్చు కాని ఇది మొత్తం వ్యవస్థకే చాలా ప్రమాదకరమైన సంకేతాన్ని ఇస్తున్నది, కాబట్టి దీన్ని చాలా సీరియస్‌గా పరిగణించాలి, రాష్ట్రానికి సంబంధించిన సమస్యగా చూడొద్దు, కేంద్రం చొరవచేసి మొత్తం కమాండ్‌ను తన చేతిలోకి తీసుకుని, సకాలంలో అణచివేయకుంటే ఇది చాలా ప్రమాదకరంగా మారుద్ది అని చెప్పి కె.పి.ఎస్ గిల్ గానీ, ప్రకాశ్‌సింగ్ గానీ, ఆర్.కె రాఘవన్‌గాని ఇంకా ఇటువంటి చాలా మంది పత్రికలల్లో రాసిండ్రు. విశ్లేషిండ్రు. కొంత మంది అణచివేతను కోరుకుంటూ ఇంకా ఎట్ల ప్లాన్ చేయాలనే సూచనలు కూడా చేసిండ్రు. కాబట్టి ఇది దేశవ్యాప్తంగా ప్రాధాన్యతగల అంశం. ఇది దేశ వ్యాప్తంగా కూడా మొత్తం విప్లవ శిబిరాన్ని ఉత్సాహపరిచింది. దేశ వ్యాప్త పి.ఎల్.జి.ఎకు ప్రేరణగా, ఒక నమూనగా నిలిచింది. దేశవ్యాప్తంగా పాలకవర్గాలను భయకంపితులను చేసింది.

ముఖ్యంగా ఐదవ విషయానికి వస్తే మనం చేస్తున్నటువంటి యుద్ధం ప్రజారాజ్యాధికారాన్ని నెలకొల్పడానికి, తర్వాత దాన్ని సంఘటితం చేసుకోవడానికి, విస్తరించడానికి, మరింత ఉన్నత స్థితికి తీసుకెళ్లడానికి ఇదే యుద్ధానికి మనం నిర్దేశించుకున్నటువంటి కర్తవ్యం. డికెలో ఇప్పటిదాకా స్థానిక, ఏరియా స్థాయిల్లో నిర్మాణం అయిన ప్రజారాజ్యాధికారాన్ని కాపాడ్డానికి ఈ చర్య దోహదపడుతుంది. దీని ద్వారా ఏందంటే మొత్తం విప్లవ శిబిరానికి నిర్బంధాన్ని ఓడించగలుగుతం, ఇలాంటి చర్యలు రానున్న కాలంలో పార్టీ నాయకత్వంలో మన పి.ఎల్.జి.ఎ అనేకం చేయగలుగుతది, చేస్తది, అనేటటువంటి విశ్వాసాన్ని పెంచుతుంది. దాని ద్వారా ఏందంటే ప్రజలు ఈరోజు నడిపిస్తున్న స్థానిక, ఏరియా స్థాయి రాజ్యాధికారాన్ని మరింత పట్టుదలగ కొనసాగించడానికి ఈ చర్య ఒక దన్నుగా నిలబడుతది. ఈ చర్య మనం ఉన్నత శ్రేణి ప్రజారాజ్యాధికారాన్ని నెలకొల్పడానికి మంచి ప్రాతిపదికను వేసింది. అట్ల చూసుకున్నప్పుడు ఈ ఐదు అంశాలు రాజకీయంగా, మిలటరీ పరంగా ప్రాధాన్యత కలిగినటువంటివి. ఈ చర్య నిర్వహించడానికి మన కామ్రేడ్స్ ప్రధానంగా సాహసించి పోరాడటం అనేటటువంటిది చాలా ముఖ్యమైన విషయం. ప్రాణ త్యాగం చేయడానికి వెనకాడకుండా అసాల్ట్ చేస్తున్న క్రమంలో, కమాండర్ ఆదేశాలు పాటిస్తూ అడ్వాన్స్ అయితున్న క్రమంలో కొంత మంది గాయపడ్డాగానీ, కొంత మంది కళ్లముందే అమరులయినా కాని వెనుకాముందాడకుండా దీన్ని సక్సెస్ చేయాలి అనే పట్టుదలను

మార్చి 8 పిలుపు

# ప్రజల్ని నిర్వాసితుల్ని చేయడానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రజాయుద్ధంలో చేరండి!

# సామ్రాజ్యవాదులకూ, దేశంలోని వారి ఏజెంట్లకూ వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రం చేయండి!!

బహుళజాతి కంపెనీలూ, భారత దళారీ నిరంకుశ బూర్జువాలు చేపడుతున్న పెద్ద ప్రాజెక్టులు ప్రజల్ని భూముల్నించీ, గ్రామాల్నించీ, ఇండ్ల నుంచి వెళ్ళగొట్టి, నిర్వాసితులుగా పోగేస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా, దేశవాప్తంగా మహిళలు పురుషులతో కలిసి పోరాడుతున్నారు. దేశంలోని భూములూ, వనరులపై తమ హక్కులకై డిమాండ్ చేస్తూ పోరాడుతున్నారు. ఈ పోరాటంలో మహిళలు ముందు పీఠిన నిలిచి, క్రూర పెట్టుబడిదారుల సేవచేసే కిరాయి పోలీసు మూకల తూటాలనూ, అరాచక శక్తులా, రాజకీయ నాయకుల దాడులనూ ఎదుర్కొంటున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని సింగూర్‌లో పోరాడుతున్న రైతాంగ నాయకురాలు తపసి మాలిక్‌పై సి.పి.ఎం ప్రభుత్వ గూండాలు జరిపిన అత్యాచారం, హత్యలు మన దేశంలోని భూమీ, వనరులను చేజిక్కించుకోవడానికి ఈ దోపిడీ దొంగలు ఎంతకు తెగబడుతున్నారో చూపిస్తాయి. కళింగనగర్‌లో మహిళల్ని క్రూరంగా హత్య చేసి, మృతదేహాల్ని కన్పించకుండ మాయం చేయటమనేది భారత పాలకవర్గాల పాశవికత ఏ స్థాయిలో వుందో చూపిస్తుంది. ఏ పార్టీ అధికారంలో వున్నా ప్రజా ఉద్యమాలను క్రూరంగా అణచివేసి, సామ్రాజ్యవాదులా, దళారులా ప్రయోజనాలను నెరవేర్చుతున్నాయి.

ఒరిస్సాలోని కళింగనగర్ లాంటి గ్రామం కావచ్చు, పెద్ద ప్రాజెక్టులు ఏర్పాటవుతున్న ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ కావచ్చు, బెంగాల్‌లోని నందిగ్రామ్, సింగూరు గావచ్చు, ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం డ్యాం, బాక్సైట్ గనులకు వ్యతిరేకంగా కావచ్చు లేదా మహారాష్ట్రలో ఏర్పాటవుతున్న ప్రత్యేక ఆర్థిక మండలాలకు వ్యతిరేకంగా కావచ్చు, ఎక్కడైనా మహిళలు పోరాటాల్లో పెద్దయెత్తున భాగస్వాములౌతున్నారు. వారిలో ఎంతో మంది అరెస్టులు అవుతున్నారు, పోలీసు కాల్పుల్లో కూడా చనిపోతున్నారు. వారి జీవనాధారాన్నీ, భూముల్నీ, వారి కుటుంబాల, గ్రామాల భవిష్యత్తునూ కాపాడుకోవడానికి పోరాడుతున్నారు. గత దశాబ్దానికి పైగా కొనసాగుతున్న ప్రపంచీకరణ ప్రస్తుత దశ ప్రజల్నీ, ప్రత్యేకించి నిర్వాసితులైన మహిళల్ని పూర్తిగా కష్టాలూ, కడగండ్లలో ముంచేసింది. ప్రాజెక్టు నిర్వాసితులు సమాజానికి, తోటి ప్రజల అండదండలకూ ఎడబాసి ఎలాంటి వసతులు లేని, ఇబ్బందికరమైన పునరావాస శిబిరాల్లో కొత్తగా కట్టిన గ్రామాల్లో యాతనలు అనుభవిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల పరిసరాల్లో తప్పనిసరి పరిస్థితుల్లో స్థిరపడి బతుకుదెరువు కోసం రోజుకూలీ కార్మికులుగా దుర్భరమైన చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్నారు. కూడు, గుడ్డ, నీడ కోసం పనిని వెతుక్కుంటూ తిరిగే గుంపుల్లో కలిసి, జన కీకారణ్యాల్లాంటి నగరాలకూ, పట్టణాలకూ వలసలు పోతున్నారు. ఇవీ ఈ ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులవుతున్న అనేక మంది ప్రజల కడగండ్లు. మహిళలు ఈ ప్రదేశాల్లో తీవ్ర అనారోగ్యాన్నీ, మానసిక వత్తిడినీ, ఆర్థికంగా దుర్భరస్థితినీ, శారీరకంగా విపరీతమైన శ్రమనూ, లైంగిక దోపిడినీ ఎదుర్కొంటున్నారు. ఎంతో మంది కుటుంబం కోసం బలవంతంగా వేశ్యా వృత్తిలోకి దిగుతున్నారు. నష్టపరిహారం ఇస్తామని చెప్పేవన్నీ కంటి తుడుపు మాటలుగానే

---

కామ్రేడ్సందరూ చర్య చివరిదాకా ప్రదర్శించారు. అక్కడి స్థానిక కామ్రేడ్స్ కుటుంబాలు సల్వాజుడూం వల్ల ఛిన్నాభిన్నం అయినాయి. వాళ్ల అక్కాచెల్లెల్లు అత్యాచారాలకు గురికావడం, తల్లి తండ్రుల్ని కోల్పోవడం, అన్నదమ్ములను కోల్పోవడం వంటి స్థానిక కామ్రేడ్స్‌లో తీవ్రమైన కసి ఉంది. ఆ వర్గ కసి ఫలితంగా కామ్రేడ్స్ సాహసించి పోరాడగలిగింద్రు. జుడూం గూండాలను ఆ రకంగా నరికి చంపడం అనేది ఆ కసికి వ్యక్తీకరణ. అట్లా సాహసించి పోరాడడం ద్వారానే మనం ఈ రెయిడ్‌ను సక్సెస్ చేసినం. దాంట్లో ముఖ్యంగా డివిజనల్ కమాండ్ ఇన్‌చార్జ్ కా. మోహన్, సెక్షన్ కమాండర్ లింగన్న, జనమిలీషియా కమాండర్ భగత్, ఇంకా కైలాస్, భీమాల్, చైతు ఇట్లా ఆరుగురు కామ్రేడ్స్ అమరులయింద్రు. వాళ్లు అమరులై రెయిడ్ విజయవంతం చేయడానికి తోడ్పడ్డరు. కాబట్టి ఈ సందర్భంగా మనం వాళ్ళ అమరత్వాన్ని దేశవ్యాప్తంగా ప్రచారం చేయాలి. ఈ సందర్భంగా అమరులకు జోహార్లు చెప్తూ ముగిస్తున్నాను.

★

మిగిలిపోతున్నాయి. వారు కోల్పోయిన జీవనాధారానికంతటికీ డబ్బు నష్టపరిహారం కాదు. దీనికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాన్ని విప్లవ మహిళా ఉద్యమం సమర్థించటమే గాక, అందులో పూర్తిగా పాల్గొంటుంది.

ఆవిధంగా, టాటాలు, అంబానీలు, జిందాల్‌లు, రుయాలూ లాంటి దళారీ నిరంకుశ బూర్జువాల, బహుళజాతి కంపెనీల ప్రాజెక్టులు కారుచౌకగా కొట్టేసిన ప్రజల భూముల్నించి లాభాలు దండుకుంటుంటే, ఈ ప్రాజెక్టుల వల్ల ప్రజల జీవితాలు ఛిద్రమై, జీవనాధారం లేని పరిస్థితి నెదుర్కొంటున్నారు. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమూ, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలూ ఏ పార్టీ అధికారంలో వున్నా, సామ్రాజ్యవాదులా, దళారీ నిరంకుశ బూర్జువాల అంతులేని దోపిడీకి అనుకూలంగా, భూములూ, అడవులూ, ఖనిజాలూ, ఇతరవనరుల్ని బంగారు పళ్ళెంలో పెట్టి అప్పగిస్తున్నారు. ఈ సామ్రాజ్యవాద అనుకూల, దళారీ నిరంకుశ బూర్జువా అనుకూల ప్రభుత్వ విధానాలూ, దురాశాపరులైన రాజకీయ నాయకులూ దేశ సార్వభౌమత్వాన్నీ, ప్రజలకు చెందిన వనరుల్నీ లాభాల మీద లాభాలను దండుకోగోరే తమ యజమానుల కాళ్ళ ముందు పెడుతున్నాయి. మన యావత్తు దేశ, ప్రజల విధ్వంసం, వినాశనాలకు ఇదే కారణం. స్థానిక పాలకవర్గాల పూర్తి లొంగుబాటుతో సామ్రాజ్యవాదుల పట్టూ, దోపిడీ మరింత దుర్మార్గమైన, ప్రమాదకర రూపాలు తీసుకుంటుంది. సామ్రాజ్యవాదులా, దళారీల పట్టుకు వ్యతిరేకంగా తప్పక పోరాడాలి. ఈ వర్గాల విధానాల్ని వ్యతిరేకించాలి.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ డివిజన్‌లో, నిర్బంధం కూడా ఆదివాసుల్ని పెద్దయెత్తున నిర్వాసితుల్ని చేస్తున్నది. ఇక్కడ విప్లవోద్యమాన్ని అణచివేయడానికి ప్రభుత్వం సల్వాజుడూం క్యాంపెయిన్ ప్రారంభించి ప్రజల్ని గ్రామాల నుంచి సహాయ శిబిరాలని చెపుతున్న నిర్బంధ శిబిరాలకు తరలిస్తోంది. ఇది ప్రజల్ని బలవంతంగా గ్రామాల నుంచి లేపి వెళ్ళగొట్టటం తప్ప మరొకటి కాదు. 24 గంటలూ ప్రత్యేక పోలీసు బలగాలూ, స్థానిక ప్రత్యేక పోలీసు అధికారులూ (ఎస్.పి.ఒ) కాపలా వుండే ఈ శిబిరాల్లోకి స్త్రీలూ, పిల్లలూ, వృద్ధులతో పాటు వేలకు వేలుగా గ్రామస్తుల్ని తీసుకొచ్చి మందవేస్తున్నారు. వాళ్ళ ఇండ్లు తగులబెట్టి, పంటల్నీ, ధాన్యాన్ని నాశనం చేసి, పశువుల్ని చంపి, లూటీ చేసి, భూముల్ని సాగు చేయనీయకుండా చేస్తున్నారు. ఇప్పుడు ప్రజల్ని తిరిగి ఇళ్ళకు వెళ్ళనీయడానికి బదులు, ఈ శిబిరాల్ని శాశ్వతంగా కొత్త గ్రామాల కింద తయారు చేస్తున్నారు. మహిళా బృందాలు ఈ శిబిరాల్ని సందర్శించి, ఇక్కడి నికృష్ట పరిస్థితుల్ని ప్రపంచానికి వెల్లడించాయి. స్థానిక ఆదివాసీ ప్రజాసమూహాన్నంతటినీ బలవంతంగా లేపేశారు. ఈ పరిస్థితుల్లో స్త్రీలు ఘోరమైన బాధలకు గురయ్యారు. వారి శారీరక, మానసిక ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతిన్నది. వాళ్ళ కళ్ళ ముందే కొడుకుల్నీ, భర్తల్నీ, అన్నదమ్ముల్ని ప్రత్యేక సాయుధ పోలీసులూ, సల్వాజుడూం గూండాలూ చంపటాన్ని చూశారు. ప్రతీఘాతుక ప్రభుత్వ బలగాలకు సహకరించనందుకు వాళ్ళను కూడా కొట్టి, అత్యాచారాలు చేసి, చంపటం కూడా చేశారు. ఈ నిర్బంధానికి కారణం, ఈ ప్రాంతంలో విప్లవ బలగాలుండటమూ, అపారమైన ఖనిజ సంపదల్నీ, ప్రకృతి వనరుల్నీ సామ్రాజ్యవాదులూ/దళారీ నిరంకుశ బూర్జువాలు నిరాటంకంగా దోపిడి చేసుకోవడానికి అడ్డంకిగా ఉండటమూనూ. సల్వాజుడూంనూ, దాని నిర్బంధ క్యాంపెయిన్‌నూ తీవ్రంగా వ్యతిరేకించాలి.

బ్రిటీష్ వలసపాలనకు వ్యతిరేకంగా జరిగిన ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం 150 వార్షికోత్సవ సంవత్సరమిది. ఆ సంగ్రామంలో దేశంలోని అనేక ప్రాంతాల్లో మహిళలు క్రియాశీలంగా పాల్గొన్నారు. అందులో కొందరు యుద్ధ రంగంలో సైనికులకు నాయకత్వం వహించి కూడా పోరాడారు. ఇది సామ్రాజ్యవాద పాలన నుండి మన దేశ విముక్తి కోసం తన సహచర కామ్రేడ్స్‌తో కలిసి ఉరికొయ్యనెక్కిన గొప్ప వీరుడు భగత్ సింగ్ శతజయంతోత్సవ సంవత్సరం కూడా. ఈ విప్లవ దేశ భక్తుల్లో మహిళలు కూడా వున్నారు. మరోసారి సామ్రాజ్యవాదులకూ, వారి స్థానిక ఏజెంట్లకూ వ్యతిరేకంగా దేశంలో పోరాటం కొనసాగుతోంది. ప్రపంచీకరణ పేరుతో అమలవుతున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు వ్యతిరేకంగా దేశమంతటా మిలిటెంట్ పోరాటాలు కొనసాగుతున్నాయి. పెద్ద పెద్ద ఖనిజాల ప్రాజెక్టులకూ, అభివృద్ధి పేరుతో ఏర్పాటవుతున్న ప్రత్యేక ఆర్థిక మండలాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడుతున్నారు. ఝార్ఖండ్, ఒరిస్సా, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, హర్యానా ఇంకా ఇతర ప్రాంతాల్లో టాటాలకూ, రుయాలకూ, మిట్టల్‌లకూ, సలీం గ్రూప్‌కూ, అంబానీలకూ ఇంకా ఇతర దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకూ, బహుళజాతి కంపెనీలకూ వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద పోలవరం డ్యాం వల్ల నిర్వాసితులవుతున్న ప్రజలు తమ గెంటివేతకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. స్వదేశంలో విదేశీ సంస్థానాలుగా చెలామణి అవుతూ ఇప్పటికీ పని చేస్తున్న ప్రత్యేక ఆర్థిక మండలాల్లో కార్మికులపై జరుగుతున్న అంతులేని దోపిడీకి వ్యతిరేకంగా, వారిలో భాగమైన మహిళా కార్మికులు కూడా పెద్దయెత్తున

# మొహమ్మద్ అఫ్జల్‌ను విడుదల చేయాలి: భారత జైళ్ళ నుంచి కాశ్మీరీ ప్రజల్ని విడుదల చేయాలి

మొహమ్మద్ అఫ్జల్ ఉరిశిక్ష కాశ్మీర్‌లోయ గుండెపైనా, అక్కడి ప్రజల స్వయం నిర్ణయాధికారంపైనా ఎక్కుపెట్టిన మరొక తూటా. అఫ్జల్ కథ, కాశ్మీర్ కథలానే భారత పాలకుల అవమానానికీ, క్రూరత్వానికీ, చిత్రహింసలకూ చివరిగా ఉరిశిక్షకూ విధ్వంసానికీ గురైన చరిత్రే. వాళ్ళు ఒకనాడు తమ సుందర, ప్రశాంత పరిసరాల్లో శాంతియుతంగా జీవించిన ప్రజలు; బ్రాహ్మణవాద భారత పాలకులూ, కరడుగట్టిన మతవాద పాకిస్తానీ పాలకుల మధ్య కపట క్రీడకు పావులుగా మారిన ప్రజలు. అఫ్జల్ మరొక బలిపశువు అంతే. భారత బడా జాతీయోన్మాద బలిపీఠంపై (మార్పుకు) బలిదానం (ప్రాణ త్యాగం) చేస్తున్న మరో కాశ్మీరీ; దేశంలో కాశ్మీరీ వ్యతిరేక, ముస్లిం వ్యతిరేక సెంటిమెంట్లు రెచ్చగొట్టడానికి బలిపశువయ్యాడు.

మొహమ్మద్ అఫ్జల్‌ను ఉరితీయొద్దు. తన భార్య, ఏడేండ్ల కొడుకుతో కలిసి మళ్ళీ తన సాధారణ జీవితాన్ని గడిపేందుకు అతన్ని బేషరతుగా విడిచిపెట్టాలి. అఫ్జల్ మీద చట్టబద్ధమైన లేదా నైతిక పరమైన కేసు వుందనేది వాస్తవాలు చూపిస్తున్నాయి. అఫ్జల్‌ను ఉరికంబానికెక్కించటమే గాక, ఢిల్లీలో లక్షలాది చిన్న వ్యాపారుల కుటుంబాలను ధ్వంసం చేసిన, దళితులూ, ఒ.బి.సిలకు వ్యతిరేకంగా ధనికవర్గ/అగ్రకుల నేపథ్యంతో అవమానకర తీర్పులిచ్చిన, తమ విలాసవంతమైన జీవితాన్ని కాపాడుకోడానికి లక్షలాది మురికి వాడల వాసుల జీవితాన్ని ధ్వంసం చేసినటువంటి అవమానకరమైన తీర్పులిచ్చిన అత్యంత ఉన్మాదపూరితమైన సుప్రీం కోర్టులో, మీడియా అబద్ధాలతో అఫ్జల్ విచారణ నెదుర్కొన్నాడు. ఇంకా వెనకటి చరిత్రకుపోతే, సైతాను వేషాల్లోని ఈ జడ్జీలు, మొన్న మొన్న ఇచ్చిన ఈ తీర్పులకంటే ఇంకా ఎక్కువగా, ప్రజల రక్తాన్ని పీల్చే వ్యవస్థను నిలబెట్టే రాక్షసుల్లా ప్రవర్తించారు. అఫ్జల్ కేసులోని చట్టబద్ధ అంశాల్ని చూద్దాం.

### చట్టబద్ధ కేసు

2001 డిసెంబర్ 13వ తేదీ ఉదయం 11.30 గంటలకు పార్లమెంటు మీద దాడి జరిగింది. దాడికి పాల్పడిన వారందరూ హతమయ్యారు. అఫ్జల్, గిలానీ తదితరులు వీరికి సహకరించారనేది అభియోగం. ఇందుకుగాను వీరికి మరణశిక్ష పడింది. అమెరికాలో జరిగిన సెప్టెంబర్ 11 సంఘటన పరంపరలో ఈ దాడి జరిగింది. భారతపాలకులు పాకిస్తాన్‌తో సంబంధాలు తెంచుకోవడానికి దీన్ని ఉపయోగించుకున్నారు. సరిహద్దులకు పెద్దయెత్తున సైన్యాన్ని తరలించడానికి 10 వేల కోట్ల రూపాయలు బూడిదలో పోశారు. విచారణ జరిపిన పోటా చట్టం కింద పనిచేసే స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు గిలానీ, షౌకత్ అఫ్జల్‌లకు ఉరిశిక్ష విధించింది. దరిమిలా హైకోర్టు గిలానీని విముక్తి చేయగా,

పోరాడుతున్నారు. ప్రజల్ని బికారులుగా తయారుచేస్తున్న ఈ సామ్రాజ్యవాద అనుకూల విధానాలన్నింటినీ ఆమూలాగ్రం వ్యతిరేకించాలి. దేశ వ్యాప్తంగా మహిళల్ని వినాశ, విధ్వంసాలకు గురిచేస్తున్న ఈ సామ్రాజ్యవాద అనుకూల విధానాలను కూడా మార్చి 8 సందర్భంగా వ్యతిరేకించండి. ఈ విధానాలకు వ్యతిరేకంగా, పెద్ద ప్రాజెక్టులకూ, వాటి వల్ల ప్రజలు నిర్వాసితులు కావడానికి వ్యతిరేకంగానూ దేశవ్యాప్తంగా కొనసాగుతున్న పోరాటాలను స్వాగతిద్దాం.

రైతులుగా, వ్యవసాయ కూలీలుగా, కార్మికులుగా శ్రామిక మహిళలు యుద్ధాల దాడుల్నీ గెంటివేతనూ, బలవంతపు వలసలనూ, పేదరికాన్నీ భరిస్తున్న సంగతి మనకు తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా వెనుకబడిన దేశాల్లో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఫలితంగా మహిళలు గెంటివేతకు గురౌతున్నారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, ప్రపంచవ్యాప్తంగా మహిళల శ్రమను కారుచౌకగా దోచుకుంటోంది. మహిళలను సెక్స్ వ్యాపారంలోకి సహితం నెడుతోంది. పాలస్తీనాలో, అఫ్ఘనిస్తాన్‌లో, ఫిలిప్పైన్స్‌లో, ఇరాక్‌లో ఇంకా ప్రపంచవ్యాప్తంగా దురాక్రమణ యుద్ధాల్లో మహిళలు గెంటివేతకూ, అత్యాచారాలకూ, మరణాలకూ గురవుతున్నారు. సామ్రాజ్యవాదులా, దేశంలోని వారి ఏజెంట్లైన పాలకవర్గాల నాయకత్వంలోని సామ్రాజ్యవాద వ్యవస్థను కూలదోయడానికి మహిళలు సంఘటితమై పోరాడుతున్నారు. ఈ రకమైన దోపిడీని అంతం చేయడానికి, ఈ రాజీలేని పోరాటమొక్కటే తుది పరిష్కారం. ఈ పోరాటంలో భాగంగా, ఈ లూటీనీ, దోపిడీనీ అడ్డుకోవడానికి దేశవ్యాప్తంగా ప్రారంభమైన పోరాటాలకు మద్దతిచ్చి వాటిలో పాల్గొనాల్సిందిగా మహిళలందరికీ పిలుపునిస్తున్నాం. ★

సుప్రీంకోర్టు షౌకత్ ఉరిశిక్షను 10 సంవత్సరాల జైలు శిక్షగా తగ్గించింది. సుప్రీంకోర్టు 2005 ఆగస్టు 4న వెలువరించిన తీర్పులో, అఫ్జల్ ఏ ఉగ్రవాద సంస్థకు చెందిన వాడన్న ఆధారాలు లేవు అని స్పష్టంగా చెప్పింది. ఇక అతడికి ఉరిశిక్ష విధిస్తూ, న్యాయపరంగా కంటే రాజకీయపరంగానే ఎక్కువగా వ్యాఖ్యానిస్తూ తీర్పు ఈ విధంగా చెప్పింది: *"సమాజ అంతరాత్మను ఎక్కువగా వణికించింది ఈ సంఘటన. దోషికి మరణదండన విధించడమే సరైనది.... లొంగిపోయిన మిలిటెంట్ అయిన ఈ అప్పీలుదారుడు మళ్ళీ జాతి వ్యతిరేక దేశద్రోహానికి పాల్పడి సమాజాన్ని బెదిరించాడు. అతని జీవితం నశించాలి".*

అందువల్ల, అఫ్జల్ *'జీవితం నశించాలి!'* కానీ, ఏ సాక్ష్యం ఆధారంగా? అరెస్ట్ చేసిన నాటి నుండి అతని మీద ఛార్జిషీటు వేసే వరకు 5 నెలలు పట్టింది. అత్యున్నత రక్షణ కలిగిన జైల్లో అఫ్జల్‌ను వుంచారు. చట్టబద్ధంగా ప్రతివాదన చేసుకోవడానికీ, సలహా తీసుకోవడానికీ అవకాశమివ్వలేదు. క్రూరంగా చిత్రహింసలు పెట్టిన తర్వాత, 2001 డిసెంబర్ 10న అఫ్జల్ నుంచి పోలీసులు నేరాంగీకారాన్ని రాబట్టారు. దీన్ని మీడియా ముందు చెప్పించగా, మీడియా దాన్ని విస్తృతంగా ప్రచారం చేసింది. ఈ బూటకపు నేరా'ంగీకారాన్ని' కూడా హైకోర్టు, సుప్రీంకోర్టులు పక్కన పెట్టేశాయి. అందువల్ల అఫ్జల్ నేరాంగీకరణను తోసివేయటం జరిగింది. కాశ్మీర్ తీవ్రవాద సంస్థలతో అతడి సంబంధాలు నిరూపణ కాలేదు. పోలీసులు తయారు చేసిన అనేక సాక్ష్యాలు కోర్టులో తప్పని తేలింది. పార్లమెంటు మీద దాడి చేసిన 'ఉగ్రవాదుల'తో అతనికి సంబంధాలున్నాయని ఆరోపిస్తున్నవి మాత్రమే నిరూపించబడ్డాయి. కానీ, ఈ నాటికి కూడా వాళ్లెవరనేది తెలియదు!!! వాళ్ళ పేర్లెందుకు బయటపెట్టలేదు? ఏమైతేనేమి అఫ్జల్ *జీవితం నశిస్తుంది.* వాస్తవం ఇదికాగా,అతని తరపున వాదించడానికి న్యాయవాది కూడా లేరు. అతనికి వ్యతిరేకంగా కోర్టు ఒక న్యాయవాదిని నియమించింది. ఎనభై అభియోగాలకు సంబంధించిన 'సాక్ష్యాలు' ఏవీ నిలువలేదు. ఇక సరైన ఆధారమేమీ లేని ఈ కేసు పూర్తిగా లొసుగులతో కూడుకుని వుంది.

## అఫ్జల్ గాథ

అతనికి 20 సంవత్సరాల వయసున్నప్పుడు, అనేకమంది కాశ్మీరీ యువకుల్లానే మిలిటెంట్ శిక్షణ పొందటానికి 1989లో అఫ్జల్ సరిహద్దు దాటాడు. ట్రైనింగ్‌లో కల్పించిన భ్రమలేమీ లేకుండానే తిరిగొచ్చాడు. తుపాకీ విడిచి, చదువు కోసం ఢిల్లీ విశ్వవిద్యాలయంలో చేరాడు. 1993లో, కాకుండా, అతడు బి.ఎస్.ఎఫ్ ముందు లొంగిపోయాడు. కానీ పని చేస్తున్న మిలిటెంట్‌గా కాదు. ఈ లొంగుబాటుతో, జె.కె.ఎల్.ఎఫ్ సభ్యులుగా పేరున్న అతని బంధువులంతా అతన్ని వెలివేశారు. లొంగుబాటు తర్వాతనే అతని పీడకల మొదలైంది. ఒక వ్యాపారం మొదలుపెట్టాడు. కానీ, 2000 నుంచి, ఇన్‌ఫార్మర్‌గా మారమని సైన్యం రోజూ అతన్ని బెదిరిస్తూ వచ్చింది. 2001లో ఎస్.టి.ఎఫ్ పోలీసులు పట్టుకుపోయి, విడిచిపెట్టడానికి లక్ష రూపాయలు ఇచ్చేదాక చిత్రహింసలు పెట్టి, ఎస్.పి.ఓ (ప్రత్యేక పోలీసు అధికారి)గా తయారు చేశారు. పార్లమెంట్‌పై దాడిలో, పోలీసులు హతమార్చిన వాళ్లలో ఒకరైన మొహమ్మద్ కూడా ఎస్.టి.ఎఫ్ క్యాంపులో వున్నవాడే. మొహమ్మద్‌ను తమకు సహకరించడానికి ఢిల్లీకి తీసుకురమ్మని అఫ్జల్‌కు చెప్పి భయపెట్టింది కూడా ఎస్.టి.ఎఫ్ పోలీసులే. ఒకవేళ అతడా పని చేయకుంటే, మళ్ళీ అరెస్టయ్యే వాడే, చిత్రహింసలు పెట్టేవాళ్ళే. ఆ తర్వాత, మొహమ్మద్ పార్లమెంటుపై దాడిలో చంపబడగా, పోలీసులకు సహకరించడానికి అఫ్జల్‌ను కాశ్మీర్‌లో అరెస్ట్ చేశారు. అతన్ని క్రూరంగా చిత్రహింసలు పెట్టడమేకాదు, సహకరించకపోతే అతడి కుటుంబం మొత్తాన్నీ చంపుతామని కూడా బెదిరించారు.

## అఫ్జల్ విడుదల కోసం ప్రజా ఉద్యమం

అఫ్జల్ ఉరిశిక్ష వెనుక అటువంటి కుట్ర వుంది.

అఫ్జల్ ఉరిశిక్షకు వ్యతిరేకంగా ఆగ్రహావేశాలతో ప్రజాందోళనలు కాశ్మీర్‌ను ఊపేశాయి. కాశ్మీర్ ప్రజలు భారత కోర్టుల నుంచి న్యాయాన్ని ఆశించలేదు. ఆక్రమణదారుల అధికారంలోని కోర్టుల్లో విచారణ నెదుర్కొంటున్న యుద్ధ ఖైదీగా అఫ్జల్‌ను చూశారు. భారతదేశంలో కూడా పెద్ద సంఖ్యలో మేధావులూ, న్యాయవాదులూ, రచయితలూ తదితరులు అఫ్జల్‌ను ఉరితీయవద్దని డిమాండ్ చేయగా, అద్వానీ లాంటి వాళ్ళు అతడి రక్తం కళ్ళ జూడాలని పెడబొబ్బలు పెట్టారు. ఉరిశిక్షను దృఢంగా వ్యతిరేకిస్తూ సి.పి.ఐ(మావోయిస్టు) పత్రికా ప్రకటన విడుదల చేసింది.

అక్టోబర్ 7న విడుదల చేసిన పత్రికా ప్రకటనలో సి.పి.ఐ (మావోయిస్టు) ఈ విధంగా చెప్పింది:

*మొహమ్మద్ అఫ్జల్ గురు 2001 డిసెంబర్‌లో పార్లమెంటు మీద దాడి చేశాడని సుప్రీం కోర్టు నిర్ధారించి, ఉరిశిక్ష వేసి, అక్టోబర్ 20న ఉరిశిక్ష అమలుకు నిర్ణయించింది. ఇది అన్యాయమూ, అమానవీయమైనదేకాక, ముస్లిం వ్యతిరేకత నేపథ్యంలో చేసిన ద్రోహమూ, భారత పాలకుల ద్వేషమూ కూడా. నిష్పక్షపాత విచారణా, నేరుగా సాక్ష్యాలూ లేవు. నోటితో చెప్పిన సాక్ష్యం ఆధారంగానే ఉరిశిక్ష వేశారు. అఫ్జల్ ఉరిశిక్ష ఒక వ్యక్తికి*

విధించిన శిక్ష మాత్రమే కాదు, కాశ్మీర్ జాతి విమోచనా పోరాటకారుల మీదా, భారతదేశంలోని యావత్తు ముస్లిం సమాజం మీదా ఫాసిస్టు భారత రాజ్యం కొనసాగిస్తున్న యుద్ధాన్ని పునరుద్ఘాటించటమే. 'న్యాయపాలన' అనేది ఈ స్పష్టమైన వాస్తవాన్ని కప్పిపుచ్చలేదు.

హిందూ - అనుకూల, ముస్లిం వ్యతిరేక ఫాసిస్టు భారత పాలకుల నుంచి ఇంతకంటే తక్కువ ఆశించలేం. వాళ్ళు బి.జె.పి లేదా కాంగ్రెస్ లేదా ఇంకే పార్లమెంటరీ పార్టీ వేషంలో వున్నా, లేక శాసన, న్యాయ, పరిపాలనా, పోలీసు, ఇంకా యితర రక్షణ బలగాల రూపంలో వున్నా ముస్లిం సమాజ వ్యతిరేక పక్షపాతం సుస్పష్టంగానే కన్పిస్తోంది. అందుకే, గడచిన అనేక దశాబ్దాల్లో వందలాది మంది ముస్లింలనూ దళితుల్నీ, ఆదివాసీలనీ, మహిళల్నీ సజీవదహనాలు చేసినా, ఒక్క హిందూ మతోన్మాద ఉగ్రవాదికి కూడా ఇటువంటి కఠినశిక్ష పడలేదు. భారత రాజ్యాంగంలో చేర్చిన మౌలిక హక్కుకూ, ప్రతి చట్టానికీ వ్యతిరేకంగా ప్రజల్ని చంపుతున్నందుకు ఒక్క పోలీసు అధికారి కూడా ఉరికంబం ఎక్కలేదు. పైగా ముస్లింలపై సామూహిక హత్యాకాండలు జరిపిన బి.జె.పి నరేంద్ర మోడీలాంటి వాళ్ళకు, సిక్కుల్ని నిర్దాక్షిణ్యంగా చంపించిన కాంగ్రెస్, హెచ్.కె.ఎల్ భగత్ లాంటి వాళ్ళకూ గౌరవ బిరుదులు కూడా ఇచ్చి సన్మానిస్తున్నారు. బాబ్రీ మసీదు కూల్చివేతకూ, దరిమిలా దేశంలో మున్నెన్నడూ లేని స్థాయిలో జరిగిన మారణకాండలూ, విధ్వంసాలకు కారణమైన వాటికి నాయకత్వం వహించి మతోద్రేకాలను రెచ్చగొట్టిన నేరానికి వాజ్‌పేయ్, అద్వానీలను ఉరితీయాలి. విమోచనా పోరాటకారులూ, విప్లవకారులూ, ముస్లిం యువకులూ ప్రభుత్వం, ప్రభుత్వ ప్రోత్సాహక మూకల చేతిలో ప్రతిరోజు చనిపోతుంటే, మతోన్మాద లేదా ప్రభుత్వ ప్రోత్సాహక నిజమైన ఉగ్రవాదులు ఏ శిక్షా లేకుండా స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ఇదీ మనదేశ ప్రజాస్వామ్యపు నిజ స్వరూపం.

అసలు వాస్తవంగా, పార్లమెంటులోనే మన దేశపు అత్యంత క్రూర ఉగ్రవాదులూ, ముఠా నాయకులూ, నేరగాళ్ళూ, కుంభకోణాల ధూర్తులూ చాలా పెద్ద సంఖ్యలో వున్నారు. ఈ నేరగాళ్ళు ప్రతీ పార్లమెంటరీ పార్టీలో నాయకత్వ స్థానాల్లో వుండి, పార్లమెంట్, అసెంబ్లీల్లోకి ప్రవేశిస్తున్నారు. ఇప్పుడిది వాళ్ళకు ఈనామైపోయింది. ప్రజలు చెమటోడ్చి సంపాదించిన సొమ్మును లంచాలూ, కమీషన్ల ద్వారా మోసంతో వందల కోట్లు పోగేసుకుంటూ, ఈ కుంభకోణాల రాయుళ్ళు అధికార అందలాలెక్కుతున్నారు. ఈ దేశద్రోహులు ఎంగిలిమెతుకులకు ఆశించి మాతృభూమిని తమ విదేశీ యజమానులకు అమ్మటానికి కూడా వెనకాడడం లేదు. ఇక ఈ దేశ వ్యతిరేక, ప్రజావ్యతిరేక ధూర్తులంతా 'దేశ భద్రతకు గొప్ప ముప్పు' అని నటన చేస్తూ, దేశ ఆయువుపట్టు స్థానాల్లో కొనసాగుతున్నారు. వేలాది ముస్లింల రక్తంతో చేతులు కడిగిన బి.జె.పి, దాని పాశవికతా, హింసోన్మత్తతల అసలు రంగు గుజరాత్ మారణకాండలో బహిర్గతంకాగా, అది ఏ మాత్రం దయా దాక్షిణ్యాలు లేకుండా అఫ్జల్‌పై విధించిన ఉరిశిక్ష అమలు చేయాలంటూ సిగ్గులేకుండా పెడబొబ్బలు పెడుతోంది.

ప్రభుత్వ భద్రతా బలగాలు *1989* నుంచీ కాశ్మీర్‌లో వర్ణించనలవిగాని దురాగతాలకు పాల్పడ్డాయి. *80* వేల మందికి పైగా కాశ్మీరీ ప్రజల్ని మారణకాండల్లో హతమార్చారు. అనేక వేలమంది ప్రజల్ని చిత్రహింసలు పెట్టారు. వందలాది కాశ్మీరీ ముస్లిం మహిళలపై అత్యాచారాలు జరిపారు. ఇంకా మసీదుల్ని కూడా వదలకుండా కాశ్మీరీల ఆస్తుల్ని ధ్వంసం చేసారు. వందలాది ప్రజలు ఎలాంటి ఆనవాళ్ళు కూడా దొరక్కుండా 'మాయమయ్యారు'. దుఃఖంతో కాశ్మీరు రక్తమోడుతుంటే, పుండుమీద కారం జల్లినట్లు ప్రభుత్వం కుట్రతో అఫ్జల్‌ను ఉరికంబం ఎక్కిస్తోంది. క్షమాభిక్ష కోసం ప్రయత్నించకుండా, కాశ్మీరీ ప్రజల స్వాతంత్ర్యం కోసం అఫ్జల్ హుందాతనాన్నీ, ఉద్వేగాన్నీ ప్రదర్శించాడు. కాశ్మీరీల మీద క్రూరమైన పీడన కొనసాగినంతకాలం, యువకుల్ని చంపటం, మాయం చేయటం, మహిళలపై అత్యాచారాలు చేయటం కొనసాగినంతకాలం, ముస్లిం సమాజం మీద వివక్ష చూపి, మరింత అన్యాక్రాంతం కావడానికి దారి తీయించినంత కాలం పార్లమెంటు మీద దాడులూ, రాజకీయనాయకుల్నీ, క్రూరమైన పోలీసు అధికారుల్నీ, నిరంకుశాధికారుల్నీ హతమార్చటం అప్రతిహతంగా కొనసాగుతూనే వుంటాయి. ఉరిశిక్ష స్వాతంత్ర్య పోరాటకారుల సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తుంది. కాశ్మీర్ యువకులు ఇంకా ఇంకా ఎక్కువగా అఫ్జల్ మార్గంలో నడవడానికే స్ఫూర్తిని పొంది, కాశ్మీర్ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులుగా కీర్తించబడతారు.

అఫ్జల్ ఉరిశిక్ష రద్దుకేగాక, కాశ్మీర్‌లో అభద్రతను సృష్టిస్తున్న రక్షణ బలగాల ఉపసంహరణకూ, దురాగతాలకు బాధ్యులైన అధికారులందర్నీ శిక్షించేందుకూ పెద్దయెత్తున ప్రజా ఉద్యమాన్ని ప్రారంభిద్దాం. కాశ్మీరు ప్రజల మీదా, ముస్లింల మీదా అమలు చేస్తున్న క్రూర చట్టాలన్నింటినీ రద్దు చేయాలి. రాజకీయ ఖైదీలనూ, పోలీసు, పారా మిలటరీ, సాయుధ బలగాల చట్ట వ్యతిరేక నిర్బంధంలో వున్న 'మాయమైన' వారినందరినీ విడుదల చేయాలి. ఇంకా అన్నింటికంటే ముఖ్యంగా, కాశ్మీరీ జాతి స్వయం నిర్ణయాధికారాన్ని డిమాండ్ చేస్తూ, శక్తివంతమైన ప్రజా ఉద్యమాన్ని మనం తప్పక నిర్మించాలి.

★

# నిర్బంధం మధ్యనే నిలదొక్కుకున్న ఖమ్మం జిల్లా మావోయిస్టు ఉద్యమం

ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా రాష్ట్రాల సరిహద్దులలో గట్టి నిఘా ఉంచాలని 2006 అక్టోబర్‌లో జరిగిన ఉన్నతస్థాయి పోలీసు అధికారుల సమావేశం నిర్ణయించింది. ఈ రాష్ట్రాల సరిహద్దులోని పోలీసు అధికారులతో రెండు రోజులపాటు విశాఖలో జరిగిన ఈ సమావేశానికి ఖమ్మం జిల్లా నుంచి ఎస్.పి ఆర్.కె మీనా, ఎ.ఎస్.పి రమేష్‌బాబు, దంతేవాడ, బీజాపూర్ ఎస్.పిలు హాజరయ్యారు. మూడు రాష్ట్రాలను సంధానం చేసే ప్రధాన రహదారులపై నిఘా ఉంచాలని ఈ సమావేశంలో తీర్మానించారు. సరైన నిఘా లేకపోవడం వల్లనే ఛత్తీస్‌గఢ్ నుంచి నక్సలైట్లు వస్తున్నారని, దానిని అరికట్టాలని సమావేశం నిర్ణయించింది. నక్సలైట్ల రాకపోకలను నిరోధించేందుకు కొన్ని రోజులపాటు సరిహద్దులను మూసివేయాలని, గట్టి నిఘాను పెట్టాలని నిర్ణయించారు. సరిహద్దులో నక్సల్స్ కార్యకలాపాలు అధికమయిన రీత్యా, సరిహద్దు జిల్లాల్లోని పోలీసు అధికారులు సహకారం, సమన్వయంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలనే నిర్ణయం జరిగింది.

## నక్సల్స్ ఏరివేతకు పోలీసు "దారులు"

మారుమూల ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ఉద్దేశించిన రిమోట్ అండ్ ఇంటీరియర్ ఏరియా డెవలప్‌మెంట్ (ఆర్.ఐ.ఎ.డి) పథకం కింద సరిహద్దు ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారులు నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆఘమేఘాల మీద కోట్లాది రూపాయలను కేటాయించాయి. ఒరిస్సాలో నక్సల్స్ ప్రభావిత కోరాపుట్ జిల్లాను ఆనుకొని ఉన్న విశాఖ, తూర్పు గోదావరి, ఖమ్మం, దంతెవాడ జిల్లాల్లో మావోయిస్టు కార్యకలాపాలు వేళ్లూనుకున్న దశలో ప్రతిపాదిత రహదారి పోలీసులకు ఉపయుక్తంగా ఉండగలదని భావిస్తున్నారు.

ఖమ్మం జిల్లాలోని నక్సల్స్ ప్రభావిత ఏజెన్సీ మండలాల్లోని 653 మారుమూల గ్రామాల్లో 18.23 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు ఎస్.పి ఆర్.కె మీనా ప్రకటించాడు. జిల్లాలోని ఏజెన్సీలో గల 653 గ్రామాలూ 516 కుగ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలు ఏజెన్సీ ప్రాంతంలోని మణుగూరు, ఇల్లెందు, భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం డివిజన్‌ల పరిధిలోని గ్రామాల్లో ఉన్నాయి. ఈ గ్రామాల్లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో మొత్తం 145 కి.మీ మేర రహదారులు నిర్మిస్తున్నారు. యువతకు ఫ్యాషన్ డిజైనింగ్, మల్టీపర్పస్ మెకానిజమ్, హౌస్ వైరింగ్, డిటిపి, కంప్యూటర్స్, డ్రైవింగ్, వెదురు అల్లికలు తదితర అంశాలపై పోలీసులు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నక్సల్స్ ప్రభావం కలిగిన ఆయా రిమోట్ ప్రాంతాల్లో అభివృద్ధికి కృషి చేస్తామని ఎస్.పి ప్రకటిస్తున్నాడు.

రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కార్యకలాపాలను అడ్డుకోవడానికి పోలీసులు ముమ్మర చర్యలు చేపడుతున్నారు. చింతూరు మండలంలోని ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రహదారి జంక్షన్ వద్ద క్రమం తప్పకుండ వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. కలప స్మగ్లింగ్ జరుగుతున్నదనే పేరు మీద అటవీ శాఖాధికారులూ, పోలీసులు కలిసి ఖమ్మం, దంతెవాడ సరిహద్దులో నిఘా పెట్టారు. ఇటీవల భద్రాచలంలో ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖాధికారుల సమావేశం జరిగింది. పేరూర్ నుండి చింతూరు వరకూ నిఘాను తీవ్రతరం చేయాలని అటవీ శాఖాధికారులు, పోలీసులు కలిసి నిర్ణయించారు.

ఇప్పటికీ ఖాళీగా వున్న బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా ఆదివాసీ యువతకు ఉద్యోగాల పేరుతో ఆదివాసీలకు, ఆదివాసీలకు మధ్య గొడవలు సృష్టించే గిరిజన బెటాలియన్ ఏర్పాటు చేస్తున్నట్టు వై.ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ గిరిజన బెటాలియన్ ఏర్పాటును ఆదివాసీ సంఘాలు, హక్కుల సంఘాలు, విప్లవ పార్టీలు, ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించడంతో ఆ బెటాలియన్ పేరు మార్చి 15వ బెటాలియన్‌గా నామకరణం చేసి ఇటీవలే జి.ఓ జారీ చేసారు. ఈ జి.ఓను వెంటనే రద్దు చేయాలని సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నప్పటికీ ఈ బెటాలియన్‌ను ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఏర్పాటు చేస్తున్నారు. ఆదివాసీ పోరాటాలను, పోలవరం ప్రాజెక్టు వ్యతిరేక పోరాటాన్ని, దండకారణ్య ఉద్యమాన్ని అణచివేయడానికే ఈ బెటాలియన్ ఏర్పాటు అనేది స్పష్టం.

## ఖమ్మం జిల్లా దంతెవాడ సరిహద్దుల్లో గ్రేహౌండ్స్ పోలీసుల కూంబింగ్‌లు

ఏ.పి, ఛత్తీస్‌గఢ్ పోలీసులు సమన్వయంతోటి ఖమ్మం, దంతెవాడలలో కొనసాగుతున్న మావోయిస్టు ఉద్యమాన్ని దెబ్బతీయడానికి ఒక పథకం ప్రకారంగా దాడులను కొనసాగిస్తున్నారు.

ఎ.పి గ్రేహౌండ్స్ పోలీసులు భద్రాచలం డివిజన్ నుండి దండకారణ్యానికి చొచ్చుకుపోవడానికి అనేక పథకాలు రచిస్తున్నారు. ఇన్‌ఫార్మర్స్ నెట్‌వర్క్‌ను పెంచుకుంటున్నారు. సమాచారం అందిన వెంటనే పెద్ద ఎత్తున బలగాలను సరిహద్దుల వెంబడి మోహరిస్తున్నారు. దంతెవాడ గ్రామాలలోకి పోయే దారులను చెక్ చేస్తున్నారు. 2006 ఏప్రిల్ 2 నాడు వెంకటాపూర్, ముకునూర్ అడవులలో మకాం వేసిన దళం సమాచారం తెలుసుకొని దాడి చేశారు. ఈ ఎన్‌కౌంటర్లో 5 గురు కామ్రేడ్స్ అమరులయినారు. ఆ సమయంలో సరిహద్దు గ్రామాలలో పెద్దఎత్తున గ్రేహౌండ్స్ బలగాలను మోహరించారు.

మే నెలలో బత్తినపెల్లి అటవీ ప్రాంతానికి పెట్రోలింగుకు వచ్చిన పోలీసు బలగాలపై దళం కాల్పులు చేసింది. ఆ మరునాడు పోలీసులు నిమ్మలగూడెం (డి.కె) అడవిలో దాచిపెట్టిన ధాన్యంను కాలబెట్టి గ్రామానికి వచ్చారు. మిలీషియా బలగాలు కాల్పులు చేయడంతో వెనుతిరిగి పోయారు.

2006, జూన్ 12న ఖమ్మం జిల్లా వాజేడు దళం సమాచారం తెలుసుకొని అలువాక, ఊట్ల, తడపాల, పాములూర్, ముకునూర్ అటవీ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహించారు. ముకునూర్ అడవిలో పోలీసుల రాకను గమనించి దళం తప్పుకున్నది. ఈ క్రమంలోనే పేరూర్ అటవీ ప్రాంతంలో దంతెవాడ జిల్లాలోని మరిమల్ల, అన్నారం గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తోన్న గ్రేహౌండ్స్ దళాలు పనిమీద సైకిల్ మోటార్ మీద వెళ్తున్న కామ్రేడ్స్ మల్లేష్, రవిల మీద కాల్పులు జరపడంతో వారిద్దరూ అమరులైనారు.

జూలై మొదటి వారంలో చింతూరు మండలంలోని దొంగల జగ్గారం, మల్లంపేట, పావురులంక, దంతెవాడ జిల్లాలోని బైటి ఎడమ, హీరాపూర్, దోరమింగ అటవీ ప్రాంతంలో పెద్దఎత్తున గ్రేహౌండ్స్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. అడవి మీద, గ్రామాల మీద, పట్టు సాధించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు.

ఇదే వారంలో ఖమ్మం జిల్లా కమిటీ సభ్యుడు సూర్యం, ఎల్.ఒ.ఎస్ కమాండర్ శాంత దిగజారిపోయి ఇంటికి పోతున్న క్రమంలో చింతూరు దగ్గర పట్టుపడ్డారు. ఆ తరువాత పోలీసులు అతని నుంచి సమాచారం రాబట్టి శబరి, వెంకటాపూర్ ఏరియాలలో దాడులను కొనసాగించారు. అతను భద్రాచలం - కుంట హైవేపైన పెట్టిన మైన్స్‌ను చూపించాడు, ఆతర్వాత పోలీసులు వాటిని పేల్చివేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతున్న "సల్వాజుడుం" భయానికి చాలామంది ఆదివాసీ కుటుంబాలు ఎ.పికి తరలివస్తున్నారు. సరిహద్దులో వున్న చింతూరు, దుమ్ముగూడెం, భద్రాచలం, చర్ల, వెంకటాపూర్, వాజేడు, మంగపేట, తాడ్వాయ్ మండలాలకు వచ్చి స్థిరపడుతున్నారు. కానీ ఎ.పి పోలీసులు ఇక్కడికి రావద్దు అని ఆదివాసులను బెదిరించి వెళ్లగొడుతున్నారు. ఇక్కడ ఎవరూ సహకరించవద్దు అని సల్వాజుడూం గూండాలు ఎం.ఎల్.ఎ, సర్పంచ్‌ల ద్వారా ప్రచారం గావిస్తున్నారు. సల్వాజుడుం గూండాలు చింతూరు, భద్రాచలం, కూనవరం ప్రాంతానికి వచ్చి అరాచకాలు సృష్టిస్తున్నా పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. సల్వాజుడూం గుండాలకూ, ఛత్తీస్‌గఢ్ పోలీసులకు - ఎ.పి పోలీసులు అన్ని రకాలుగా సహకరిస్తున్నారు.

ఆగస్టు మొదటి వారంలో ఎ.పి గ్రేహౌండ్స్ బలగాలు పెద్ద ఎత్తున చర్ల, తిప్పాపూర్, చెన్నపురం అటవీ ప్రాంతంలో దంతెవాడ జిల్లాలోని పుట్టెం, చందం, రాసం అటవీ ప్రాంతంలో అయిదు, ఆరు రోజులు ఉండి అత్యంత రహస్యంగా పెట్రోలింగ్ నిర్వహించారు. అడవి మీద, గ్రామాలమీద పట్టు పెంచుకోవడానికి, ఇన్‌ఫార్మర్లను తయారుచేసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. మాజీలను వెంబడి తీసుకవచ్చారు. ఈ సందర్భంలో పి.ఎల్.జి.ఎ బలగాలు ప్రతిఘటించడంతో వెనుతిరిగారు.

ఛత్తీస్‌గఢ్ మావోయిస్టులకు ఎ.పి నుండి సామాన్లు చేరవేస్తున్నారనే నెపంతో 2006, సెప్టెంబర్‌లో దుమ్ముగూడెం, లక్ష్మీపూర్‌కు చెందిన వ్యాపారులను ఎ.పి పోలీసులు రెండుసార్లు అరెస్టు చేశారు. కేసులు పెట్టి ఎం.ఆర్.ఒ ముందు హాజరుపరిచి విడిచిపెట్టారు. వ్యాపారవర్గాలను లొంగదీసుకొని ఇన్‌ఫార్మర్స్‌గా మార్చుకోవడానికి ఎ.పి పోలీసులు - ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న సంతలకు పోవద్దని ఒత్తిడి చేస్తున్నారు. తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

2006 అక్టోబర్ నెలలో పేరూర్ అటవి ప్రాంతంలో గెరిల్లా దళం కదలికలు అర్థమై బలగాలను మోహరించారు. అన్నారం పరిసరాలలో కాల్పులు జరిపి కామ్రేడ్ ప్రశాంత్, కామ్రేడ్ అశోక్‌లను హత్య చేశారు.

ఎ.పి - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో 500 మంది గ్రేహౌండ్స్ బలగాలను మోహరించారు. 2006 నవంబర్ నెలలో 10 రోజులు దంతెవాడ జిల్లాలోని నిమ్మలగూడెం, డోకపాడు, కరిగుండం, తెట్టెం, జాటం, పుట్టెం, రాసం, ఇంకాల్ తదితర గ్రామాల్లో, ఖమ్మం జిల్లాలోని కుర్నపెల్లి, కోరుకుడుపాడు, బత్తినపెల్లి, ఎర్రపాడు, చెన్నపురం అటవీ ప్రాంతంలో బలగాలు పెట్రోలింగ్ నిర్వహించాయి. జాటం గ్రామం దగ్గర మకాం వేసిన పోలీసుల

***(తరువాయి 28వ పేజీలో.....)***

# ఫిలిప్పైన్స్ - ఆసియాలోని

అమెరికా చేపట్టిన "టెర్రరిజంపై యుద్ధం"లో అధ్యక్షురాలు గ్లోరియా అరయో ప్రభుత్వం భాగస్వామి అయింది. అప్పటి నుండీ ఫిలిప్పైన్స్‌లో కార్మిక కర్షక సంఘాల నాయకులపైనా, ప్రగతిశీల రాజకీయ అసమ్మతివాదులపైనా, మానవహక్కుల న్యాయవాదులూ, కార్యకర్తలూ, మహిళా సంఘాల నాయకులూ, ముఖ్యంగా పత్రికా, ప్రసారమాధ్యమాల విలేఖరులపైన అప్రకటిత యుద్ధం కొనసాగుతున్నది. అధికార యంత్రాంగం, సైన్యం, హంతక దళాల మధ్య సంబంధం వుండటంతో ఈ రాజకీయ హత్యాకాండ నిర్భయంగా కొనసాగుతున్నది. పెద్ద ఎత్తున జరుగుతున్న ఈ దాడులలో ఎక్కువ భాగం గ్రామీణ ప్రాంతంలోనూ, రాష్ట్రాల రాజధానులలోను చోటు చేసుకుంటున్నాయి. కొలంబియాలో ఎటువంటి భయానక స్థితి వుందో ఫిలిప్పైన్స్ లోనూ అటువంటి పరిస్థితే వుంది. అయితే అంతర్జాతీయ సమాజం కొలంబియాపై దృష్టిని సారించినంతగా ఫిలిప్పైన్స్‌లో పెద్ద ఎత్తున కొనసాగుతున్న ప్రభుత్వ హత్యాకాండపై దృష్టిని సారించడం లేదు.

### ప్రభుత్వ నిర్బంధం

కరాపతన్ (Karapatan) అనే స్వతంత్ర మానవ హక్కుల కేంద్రమూ, చర్చితో సంబంధమున్న కార్మిక, విద్యా, పరిశోధనా సంస్థలు 2001-2006 మధ్య జరిగిన వందలాది హత్యల, అదృశ్యాల, చిత్రహింసల, చంపుతామనే బెదిరింపుల సంఘటనలకు సంబంధించిన వివరాలను సేకరించాయి. 2001లో అరయో అధికారంలోకి వచ్చినప్పటి నుండి చట్ట విరుద్ధంగా 400 హత్యలు జరిగాయి. 2004లో 63 మంది, 2005లో 179 మంది హత్యకు గురయ్యారు. 46 మంది అదృశ్యమయ్యారు. 2006 మొదటి రెండున్నర నెలల్లో 26 రాజకీయ హత్యలు జరిగాయి.

ఒక పథకం ప్రకారం జరుగుతున్న ఈ ప్రభుత్వ బీభత్సకాండలో ప్రాణాలు కోల్పోతున్న వారిలో అత్యధికులు రైతులు-రైతాంగ నాయకులు. 2005లో ప్రాణాలు కోల్పోయిన వారిలో 70 మంది ఈ సామాజిక వర్గానికి చెందినవారే. వీరందరూ కూడా రైతుకూలీ-భూపోరాటాలలో పాల్గొంటున్నవారు. అయితే సైన్యం మాత్రం హత్యకు గురవుతున్న వారికీ, అదృశ్యమవుతున్న వారికీ కమ్యూనిస్టు గెరిల్లాలతోనూ, ముస్లిం వేర్పాటువాదులతోనూ సంబంధాలున్నాయని ఆరోపిస్తున్నది. ప్రాణాలు కోల్పోతున్న వాళ్లలో జాతీయ రైతు సంఘానికి చెందిన వాళ్ళతోపాటు, కిలూసంగ్ మగ్బుబుకిడ్ ఇంగ్ పిలిపినాస్ (కె.ఎం.పి) స్థానిక అల్పసంఖ్యాక ఇగోరత్, అగ్టా, మొరో రైతు నాయకులు కూడా వున్నారు. వీరందరూ కూడ తమ భూముల రక్షణ కోసం పోరాడుతున్నవాళ్లు. ప్రభుత్వం పెద్ద ఎత్తున అపఖ్యాతిపాలయిన ఘటనలలో నవంబర్ 2005లో జరిగిన 'పాలో హత్యాకాండ' ఒకటి. ఒక భూవివాదం పరిష్కరించుకోవడం కోసం విసాయస్‌లోని వీటోలోని పాలోలో 47 మంది రైతులు బహిరంగ సమావేశం ఏర్పాటు చేసుకోగా పెద్దఎత్తున సైన్యం చుట్టుముట్టి దాడి చేసింది. 9 మందిని అక్కడికక్కడే చంపివేయగా, 12 మందిని అరెస్టు చేశారు. 18 మందిని మాయం చేశారు. అయితే ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారు సాన్ అగస్టీన్ రైతు సహకార సంస్థ, అలంగ్ - అలంగ్ చిన్న రైతుల సంస్థలకు చెందిన వారు. చనిపోయినవారి పక్కన నాటు తుపాకులుంచి సైన్యంతో జరిగిన ఎదురుకాల్పులలో నూతన ప్రజాసైన్యం (ఎన్.పి.ఎ)కు చెందిన వారు చనిపోయారని నమ్మించడానికి మొదట ప్రభుత్వం ప్రయత్నించింది. అన్ని సంఘటనలలోలాగానే ఈ నేరానికి పాల్పడినవారిపై కూడా ఎటువంటి చర్య తీసుకోలేదు. కనీసం అధికారిక విచారణ కూడా జరపలేదు.

అత్యధికంగా హత్యాకాండకు గురవుతున్న మరో సామాజిక వర్గం కార్మికులూ, కార్మికనాయకులు. ఇప్పటివరకూ 18 మంది హత్యకు గురికాగా, చాలామందిని మాయం చేశారు. 2005లో జాతీయ కార్మిక సంఘానికీ, కిలూసన్‌మేయో (మే 1 ఉద్యమం), నెస్లే కంపెనీ కార్మిక సంఘానికీ, కేంద్ర అజూకరీరాడి తర్లాక్‌కూ, నెగ్రోస్ చక్కెర కార్మిక సంఘానికీ చెందిన సభ్యులనూ, వ్యవసాయ సంస్కరణ శాఖ ఉద్యోగస్తుల సంఘ నాయకున్నీ, ప్రాంతీయ కళాశాల ఉద్యోగుల సంఘ నాయకులనూ, విద్యుత్, రవాణా కార్మిక సంఘాలలోని మిలిటెంట్లనూ హత్య చేశారు.

2005 ప్రథమ భాగంలో విచారణలోని ఖైదీలుగా వున్న నిరాయుధులైన ముస్లింలను మనీలాలోని జైలులో కాల్చి చంపారు. ఎటువంటి విచారణా, వాయిదాలు లేకుండ అక్రమంగా నిర్బంధించడాన్ని వ్యతిరేకిస్తూ జైలులో దుర్భర పరిస్థితులను నిరసిస్తూ పోరాడినందుకే సైన్యం ఈఘాతుకానికి పాల్పడింది. చిన్న రైతులూ, చేపలు పట్టే కుటుంబాలకు చెందిన వారంతా మనీలాకు వలస వచ్చి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్న వాళ్లు. వారందరిని అబూసయాఫ్ కిడ్నాప్ గ్యాంగ్ సభ్యులు అని ఆరోపిస్తారు. కానీ ఆ ఆరోపణలు ఎప్పుడూ రుజువుకాలేదు.

# ఒక మృత్యు రంగం

ఒక్క 2005లోనే ఏడుగురు పత్రికా, రేడియో విలేఖరులు హత్యకు గురయ్యారు. మానవహక్కుల ఉల్లంఘన, కార్మికుల, భూవివాదాల కేసులతో సంబంధమున్న న్యాయవాదులూ, న్యాయమూర్తులు ఏడుగురు హత్యకు గురయినారు. ముగ్గురు క్రైస్తవ మతాధిపతులు, ఏడుగురు చర్చి కార్యకర్తలు హత్యకు గురయినారు. పేదల, రైతుల, కార్మికుల, మైనార్టీల పక్షాన నిలబడినందుకే వీరంతా ప్రాణాలు కోల్పోయారు.

2005లో జరిగిన మరణాల వివరాలు రూపొందించిన జాబితాలో హత్యాయత్నానికి గురయిన వారి, అదృశ్యమయి రిపోర్ట్ కాని వారి, అక్రమ నిర్బంధానికి, చిత్రహింసలకు గురయిన వారి వివరాలు చేర్చలేదు. కొద్దిమంది బడా భూస్వాముల, భూ ఆక్రమణదారుల, కలపపై, గనులపై గుత్తాధిపత్యం చెలాయించే పరిశ్రమాధిపతుల అధికారాన్ని కాపాడడం కోసమే సైన్యం అధీనంలోని హంతక దళాలు ఈ హత్యాకాండకు పాల్పడుతున్నాయి.

ఈ హత్యాకాండలో ప్రాణాలు కోల్పోతున్న మరో ముఖ్యమైన బృందం, కార్మిక కర్షక సంఘాలకు చెందినవారు. విస్తృత ప్రజాదరణగల వామపక్ష రాజకీయ పార్టీ బయాన్‌మున (ప్రజలేముందు), దాని అనుబంధ సంస్థలకూ చెందిన నాయకులు 83 మంది హత్యకు గురయ్యారు. మొట్టమొదట మనీలా నగరానికి వెలుపల (2001 నుండి 2005 వరకు) ఒక పద్ధతి ప్రకారం ఈ హత్యలు జరిగాయి. మహిళా పార్టీ గాబ్రియెలా (Gabriela), పట్టణ పేదప్రజల పార్టీ వంటి అనుబంధ సంస్థల నాయకులను, సమన్వయకర్తలను చంపడమో, మాయం చేయడమో లేదా గాయపరచడమో చేశారు. బయాన్‌మున అనే సంస్థ నుంచి పట్టణ కౌన్సిల్‌కు ఎన్నికయిన సభ్యులనూ అబెలార్డో లాడెరాను రాష్ట్రవ్యాప్త అమరుల అంత్యక్రియల ఊరేగింపులు జరుగుతుండగా, పట్టపగలే కాల్చిచంపారు. 2004లో హాసిండాలో జరిగిన కార్మిక నాయకుల హత్యాకాండకు ఇతడు ప్రత్యక్షసాక్షి. సాక్ష్యాధారాలు లేకుండా చేయడం కోసం ఇతన్ని చంపేశారు.

2005లో పెద్దఎత్తున జరిగిన హత్యాకాండలో ప్రగతిశీల పార్టీలకు చెందిన వారు, వారి మద్దతుదారులు 66 మంది చనిపోయారు. ఇందులో పట్టణ పేద ప్రజల పార్టీ, శ్రామిక ప్రజలకు చెందిన వారు 33 మంది, బయాన్‌మున అనే సంస్థకు చెందినవారు 30 మంది. 'శ్రామిక ప్రజలు'అనే సంస్థకు చెందిన వారు అయిదుగుర్నీ, బయాన్‌మునకు చెందిన ముగ్గుర్నీ 2005లో మాయం చేసి చంపేశారు.

2003 నుండి జర్నలిస్టులకు అత్యంత ప్రమాదకరమైన దేశాల జాబితాలో ఇరాక్ తరువాత రెండవ స్థానంలో ఫిలిప్పైన్స్ కొనసాగుతున్నది. ఎందుకంటే హంతకదళాల చేతిలో జర్నలిస్టులు పెద్దఎత్తున హత్యలకు గురికావడమో, అదృశ్యమవడమో జరుగుతున్నది. ఫిబ్రవరి 2006లో గనుల యజమానుల కోసం పని చేసే హంతక దళాలు ఒక రేడియో విలేకరిని మాయం చేసి చంపివేశాయి. ఇతను స్థానిక గని యజమాని కార్మికులపై పాల్పడుతున్న వేధింపులను బహిర్గతం చేశాడు.

ప్రభుత్వం సృష్టిస్తున్న ఈ భయోత్పాతం నియంత మార్కోస్ (1972-86) సైనిక పాలననాటి రోజులను తలపిస్తున్నాయి. మార్కోస్ పరిపాలనలో వున్న విధంగానే ప్రస్తుతం గ్రామీణ ప్రాంతమంతా సైన్యం అధీనంలోనే వుంది. పౌర పరిపాలనను పూర్తిగా కుదించి వేశారు. అరయో ప్రభుత్వం 'శత్రువును గుర్తించడం' పేరుతో ఒక నిబంధనల పుస్తకాన్ని ముద్రించింది. సైన్యం దీన్ని ఉపయోగించుకుంటూ, బహిరంగ ప్రజాసంఘాలను, పౌర హక్కుల సంస్థలను, న్యాయవాదుల సంఘాలను 'టెర్రరిస్టులు' అనే ముద్ర వేస్తున్నది.

అమెరికా రూపొందించిన 'తక్కువ స్థాయి తీవ్రత యుద్ధం' (ఎల్.ఐ.సి) వ్యూహాన్ని ప్రజానీకంపై అమలు చేయడం కోసమే ఈ 'హంతక దళాలు' ప్రత్యేకంగా రూపొందాయి. అణచివేతను వ్యతిరేకించటం, స్వయం నిర్ణయాధికారం కోసం పోరాటం అనే హక్కును నేరంగా చిత్రించే క్రమంలో, రహస్యంగా సమాచారాన్ని అందిస్తున్నారని వ్యక్తులపై, సంస్థలపై అసత్య ఆరోపణలు చేసి, 'టెర్రరిస్టులు'గా ముద్రవేసి సైన్యం ప్రచారం చేసి తను కొనసాగిస్తున్న హత్యాకాండను సమర్థించుకో చూస్తున్నది. చట్టాలకతీతంగా జాబితాలు రూపొందిస్తుండటంతో బాధితులకు చట్టాల ద్వారా రక్షణ పొందే అవకాశంకూడా లేదు. మానసిక యుద్ధంలో భాగంగా అసత్య ప్రచారంతో బాధితులను, వారి సంస్థలను 'టెర్రరిస్టు'లని బలంగా చిత్రీకరిస్తున్నారు.

## నేపథ్యం

1972లో మార్కోస్ సైనిక శాసనం ప్రకటించినప్పటి నుండీ 'పౌర-సైనిక కూటమే వాస్తవంగా ఫిలిప్పైన్స్‌ను పరిపాలిస్తున్నది.

1960లలో ఆగ్నేయ ఆసియాలో ఫిలిప్పైన్స్‌ను వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా చాలామంది ఆర్థికవేత్తలు భావించారు. ఆర్థిక వ్యవస్థలో ఒక్క వుదుటున 'సరళీకరణ' విధానాలు అమలు చేయడంతో పేద దేశంగా మారడమేగాక, ప్రస్తుతం ఆసియాలోనే సామాజిక అంతరం (పేదలకు, ధనికులకూ మధ్య) అత్యధికంగా వున్న దేశంగా కొనసాగుతున్నది. ఇక్కడి తలసరి స్థూలజాతీయ ఉత్పత్తి 950 డాలర్లు. ఇది థాయిలాండ్ తలసరి స్థూల జాతీయ ఉత్పత్తిలో సగం. దేశంలోని ప్రైవేట్ ఆస్తులలో 50 శాతం 15 అత్యంత సంపన్న కుటుంబాలకు చెందినవే. ప్రపంచంలోనే అత్యధికంగా సామాజిక అసమానతలున్న దేశాలలో ఫిలిప్పైన్స్ ఒకటి. మిగతా ఆసియా దేశాలతో పోలిస్తే ఫిలిప్పైన్స్ తీవ్ర ఆర్థిక వ్యత్యాసంతో వుంది. జనాభా 8 కోట్ల 50 లక్షలు. నిరుద్యోగం అత్యధికంగా 20 శాతం వుంది. అనిశ్చిత రంగంలో నిరుద్యోగం మరో 30 శాతం వుంది. 40 శాతం ప్రజలు సరిపోయేంత ఆహారాన్ని గానీ, గృహ వసతిని కాని సంపాదించుకోలేక పోతున్నారు. ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలవలంభిస్తూ సామాజిక పేద రంగాలకు నిధుల కేటాయింపును విపరీతంగా తగ్గించివేసింది. ఒకప్పుడు ఎంతో ఆదరణకు గురయిన విద్య, వైద్య రంగాలు ప్రస్తుతం క్షీణ దశలో వున్నాయి. ఒకప్పుడు దేశంలోని పరిశోధనా సంస్థలు ఎక్కువ దిగుబడినిచ్చే "అద్భుత వరి" వంగడాలను సృష్టించాయి. కానీ ఇప్పుడు బియ్యం ఇతర ఆహార ధాన్యాలను దేశం దిగుమతి చేసుకుంటున్నది. ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకారం, ఇక్కడ పౌష్ఠికాహార లోపం అధికంగా వుంది. తమ కుటుంబాలను పోషించుకోవడానికి తగిన పనులు దొరకకపోవడంతో 80 లక్షల మంది ఫిలిప్పైన్స్ ప్రజలు పనుల కోసం విదేశాలకు వలస వెళ్లారు. 'ఇక్కడ కుటుంబం పస్తులుండటాన్ని చూస్తూ వుండేకన్నా ఇరాక్‌లో చనిపోవడం నయమే కదా, కనీసం అక్కడ ఏదో ఒక పనైన దొరుకుతుంది' అనే దయనీయ స్థితిలో ఫిలిప్పైన్స్ దేశస్తులున్నారు. ఇరాక్‌లో ఆక్రమిత అమెరికా సైన్యంకు సహాయ పనులు చేయడానికి వీరు వీసాల కోసం బార్లు కడుతున్నారు. దాదాపు 4 వేల మంది ఫిలిప్పైన్స్ కార్మికులు ఇరాక్‌లో అమెరికా సైన్యానికి సహాయపడే పనులలో వున్నారు.

సైన్యం-చర్చి మద్దతుతో తిరుగుబాటు చేసి 1986, ఫిబ్రవరి 26న, నియంత మార్కోన్‌ను కూలదోసిన తదనంతరం ఎన్నికయిన అధ్యక్షులు క్షీణించిన ఆర్థిక వ్యవస్థను బాగుచేయడంలో విఫలమయ్యారు. కొత్త అధ్యక్షులు కొరాజాన్ ఆక్వినో(1986-92), జనరల్ ఫెడల్ రామోన్(1992-98) కొద్దిమంది సంపన్న కుటుంబాలకే అనుకూలంగా వ్యవహరించడంతో అవినీతిపరుడయిన ప్రజాకర్షణగల ఎస్ట్రోడా లాంటివాళ్ళు అధికారంలోకి వచ్చే పరిస్థితులు ఏర్పడినాయి. "కొద్దిమంది సంపన్నులకు వ్యతిరేకంగా" అనే అతని నినాదం అతన్ని అధ్యక్ష భవనంలోకి తీసుకువచ్చింది. చావెజ్‌ను ఆహ్వానించడం, పట్టణ పేదప్రజలకు భూమి పట్టాలివ్వడం లాంటి జనాకర్షక విధానాలు అమెరికాకూ, తర తరాలుగా ఆధిపత్యం కలిగిన 'కొద్ది - సంపన్న కుటుంబాలకు' కోపం తెప్పించాయి.

అమెరికా వ్యూహరచనతో సంపన్న వర్గాల మద్దతుతో వీధి ప్రదర్శనలు జరిగాయి. వీటికి సైన్యంలోని కొన్ని సెక్షన్ల మద్దతు లభించింది. ప్రదర్శనలు ఉచ్ఛస్థితికి చేరి 2001 జనవరిలో ఎస్ట్రోడాను పదవినుండి తొలగించివేసాయి. ఎస్ట్రోడాను పదవి నుండి తొలగించిన శక్తులే ఉపాధ్యక్షురాలు అరయోను అధ్యక్షురాలిని చేసాయి. అరయో అమెరికాలో చదువుకుంది. నయా ఉదారవాద ఆర్థికవేత్త. అమెరికా రాయబార కార్యాలయ అభిమానురాలు. ఈ రాజకీయ నేపథ్యం వుండడం వల్లనే అమెరికా సైనిక స్థావర విస్తరణ హక్కులు ఇవ్వడంతో పాటు నూతన సైనిక ఒప్పందంపై త్వరగా సంతకం చేసింది. ఎస్ట్రోడా అధ్యక్షుడుగా వున్నపుడు రెండు సంవత్సరాలుగా ఈ ఒప్పందాలు పెండింగ్‌లో ఉన్నాయి. అరయో అధ్యక్షురాలు కావడంతో అమెరికాకు ఒక నమ్మకమైన సేవకురాలు లభించినట్లయింది.

అమెరికా, సైన్యం, సంపన్న కుటుంబాల మద్దతులతో కొత్తగా 'ప్రతిష్టించబడిన' అరయో ప్రభుత్వం నూతన సరళీకరణ కార్యక్రమమైన ప్రైవేటీకరణను వేగవంతం చేసింది. ప్రభుత్వ విద్య, వైద్య నిధులలో కోతలు విధించింది. భారమయిన విలువ ఆధారిత పన్ను (వ్యాట్)ను అమలు చేయడంతో పేద, దిగువ మధ్యతరగతి ప్రజలపై విపరీతమయిన ప్రభావం పడింది. 2005 నాటికి అంతర్గత విదేశీ అప్పులు విపరీతంగా పెరిగి 100 బిలియన్ డాలర్లు అయింది. ప్రతీ సంవత్సరం బడ్జెట్‌లో 30 శాతం అప్పులకే చెల్లిస్తున్నారు. విదేశాలలోని 80 లక్షల మంది ఫిలిప్పియన్లు 2005లో పెద్దఎత్తున పంపిన 12.5 బిలియన్ల డాలర్లు కూడా అప్పులు కట్టడానికి ఏమాత్రం సరిపోలేదు. "ఆసియన్ టైగర్స్" ఉచ్ఛ స్థితిలో వున్నపుడు కూడా చాలా ఆశ్చర్యంగా ఫిలిప్పైన్స్‌లో అత్యల్ప తలసరి స్థూల జాతీయ ఉత్పత్తి నమోదయింది.

ఎస్ట్రోడా ఎంతగా అవినీతికి పాల్పడడం వల్ల అధ్యక్ష పదవిని కోల్పోయాడో, అరయో, ఆమె సహచరులు కూడా అదే స్థాయిలో అవినీతికి పాల్పడుతున్నారు. అధ్యక్షురాలు భర్త మైక్ అరయో దేశంలో వుంటే అవినీతి, అక్రమ సంపాదనలకు సంబంధించిన కేసులు, విచారణలు ఎదుర్కోవలసి వస్తుందని అమెరికాలో స్వయం ప్రకటిత ప్రవాసంలో వుంటున్నాడు.

సైన్యంలోని జనరల్స్‌కు, కీలక అధికారులకు ఆర్థిక లబ్ది చేకూరే విధంగా ఎన్నో సదుపాయాలు కల్పిస్తూ అరయో ప్రభుత్వం వారి మద్దతును పొందుతున్నది. కిందిస్థాయి ఆఫీసర్లపై సైనికులపై పని చేయాలి అనే ఒత్తిడి పెరుగుతుండడంతో, తక్కువ వేతనాలతో వాళ్ళలో అసంతృప్తి పెరుగుతున్నది. వీరు అనేక తిరుగుబాటు సంఘటనలకు పాల్పడుతున్నారు. 2006 జనవరిలో నావికాదళ సైనికులు తిరుగుబాటు చేసారు.

మనీలా, మిండనోవా ద్వీప కల్పంలలోని మార్కెట్లు, బస్సులు, రైళ్లు, విమానాశ్రయాలు, మసీదులను లక్ష్యంగా చేసుకొని 'సైనిక రహస్య విభాగం' వరుసగా బాంబులు పేల్చింది. ప్రభుత్వం మాత్రం ముస్లిం కిడ్నాపింగ్ ముఠా అబూసయాఫ్ ఈ పేలుళ్లకు పాల్పడిందని అసత్య ఆరోపణ చేస్తూ దేశాన్ని మరింత సైనికీకరణ చేయడాన్ని సమర్థించుకో చూస్తున్నది.

ఈ బాంబు పేలుళ్ళు, ప్రజలు చాలా క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పుడే జరిగాయి. 2004 డిసెంబర్ లో రాజధాని మనీలాలోని ఒక వ్యాపార కేంద్రం వద్ద బాంబు పేలి 15 మంది చనిపోయిన ఘటన దీనికొక ఉదాహరణ. అంతకు కొద్ది రోజుల ముందే మనీలాకు దగ్గర్లో భారీ వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడి వెయ్యి మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ భయానక స్థితి నుండి ప్రజలు తేరుకోకముందే ఈ బాంబు పేలుళ్ళు జరిగాయి. ఈ రెండు సందర్భాలలో కూడా సహాయక చర్యలు అందించడంలో ప్రభుత్వ అసమర్థత వ్యక్తమయింది.

పత్రికల వారికి అనధికారికంగా అందిన సమాచారం ప్రకారం బాంబు పేలుళ్ళను కారణంగా చూపి, అమెరికాను మరింత 'సైనిక సహాయం' కోరడం కోసం ప్రభుత్వమే ఈ పేలుళ్ళు జరిపించింది.

## అమెరికాతో కొనసాగుతున్న సంబంధాలతీరు

అమెరికా-ఫిలిప్పైన్స్ ఉమ్మడి సైనిక రక్షణా కార్యక్రమాలను పెద్ద మొత్తంలో పెంచనున్నామని అమెరికా ప్రకటించింది మిండనోవా ద్వీపకల్పంలో ముస్లిం వేర్పాటువాదుల అణచివేత కోసం జరుగుతున్న సైనిక చర్యలలో మొట్ట మొదటిసారి అమెరికా సైన్యం ప్రత్యక్షంగా పాల్గొన్నది. టెర్రరిజంపై జరుగుతున్న యుద్ధంలో ఫిలిప్పైన్స్ రెండవ యుద్ధ రంగం అని అమెరికా సహాయ రక్షణ కార్యదర్శి పాల్ ఉల్ఫోవిట్జ్ ప్రకటించాడు. అప్పటి నుండి వేలాది ముస్లింలను బలవంతంగా గ్రామాల నుండి ఖాళీ చేయించడంతో వారు వివిధ ప్రాంతాలలో నిర్వాసితులుగా బతుకుతున్నారు. వందలాది మందిని హత్య చేసారు. చాలా మందిని మాయం చేసారు. వేల సంఖ్యలో చిత్రహింసలకు గురయినారు. దీనితో ముస్లిం గెరిల్లాల కార్యకలాపాలు మరింత అధికమయ్యాయి.

ఇరాక్ పునర్‌నిర్మాణానికి ఫిలిప్పైన్స్ ఒక నమూనాగా నిలుస్తుందని 2003 అక్టోబర్‌లో జార్జిబుష్ ఫిలిప్పైన్స్‌కు వచ్చినప్పుడు అన్నాడు. 1898లో అమెరికా దురాక్రమణకు పాల్పడి 13 సంవత్సరాల పాటు కొనసాగించిన ఫాసిస్టు హత్యాకాండలో 10 లక్షలకుపైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు అనే విషయాన్ని మరిచిపోయినట్టున్నాడు. ఫిలిప్పైన్స్‌లో కొనసాగుతున్న హంతక దళాల ప్రజాస్వామ్యాన్ని 'ప్రజాస్వామ్యానికి నమూనా'గా అభివర్ణించాడు.

లక్షలాది ప్రజలు వ్యతిరేకించినప్పటికీ, అమెరికా ఇస్తున్న మద్దతుకు ప్రత్యుపకారంగా అరయో ప్రభుత్వం ఇరాక్‌కు ఫిలిప్పైన్స్ సైనికులను పంపించింది. ఇరాక్‌లోని తిరుగుబాటుదారులు ఫిలిప్పైన్స్ కార్మికులను నిర్బంధించి సైన్యాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసిన తరువాత మాత్రమే వెనక్కు తీసుకున్నారు. ఎందుకంటే అమెరికా అందిస్తున్న ఆర్థిక సహాయంపైకన్నా పశ్చిమాసియాలోని ఫిలిప్పైన్స్ కార్మికులు పంపిస్తున్న డబ్బులపైనే దేశ ఆర్థిక వ్యవస్థ ఆధారపడి వుంది. ఇరాక్‌లో జరుగుతున్న పునర్‌నిర్మాణ పనులలో కొద్దిపాటి వాటానయినా ఫిలిప్పైన్స్ కంపెనీలకు కల్పిస్తారని ఆశించారు, కానీ ఇప్పటి వరకు అటువంటిదేమీ జరుగలేదు. 2006లో అదనంగా 5 వేల అమెరికా సైనికులు మిండనోవా ప్రాంతానికి రానున్నారు.

అమెరికా దళాలు, వేర్పాటువాదులకు పట్టున్న దేశ దక్షిణ ప్రాంతానికే పరిమితం కావడం లేదు. దేశ మధ్య ప్రాంతాలలోని ద్వీపకల్పాలూ, లూజాన్‌లో ఉమ్మడి సైనిక విన్యాసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలోని కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలోని నూతన ప్రజాసైన్యం గత నలభై సంవత్సరాలుగా భూసంస్కరణలూ, ఆర్థిక వ్యవస్థపై కొద్ది మంది సంపన్నుల, సామ్రాజ్యవాదుల పట్టుకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నది. అమెరికా, స్థానిక పాలకవర్గాలు పదివేల సైన్యమున్న ఎన్.పి.ఎ (నూతన ప్రజాసైన్యం)ను తమ ప్రయోజనాలకు అత్యంత ప్రమాదకరమని భావిస్తున్నాయి.

## పట్టణాలలో ప్రజల ప్రతిఘటన

2004లో జరిగిన ఎన్నికలలో అరయో తన ప్రత్యర్థిపై స్వల్ప మెజారిటీతో విజయం సాధించింది. పెద్దఎత్తున హింసకూ, మోసానికి పాల్పడడం ద్వారానే ఆ గెలుపయినా సాధ్యమయింది.

ఏవిధంగా రిగ్గింగ్ చేయాలో ఎన్నికల అధికారితో మాట్లాడుతున్నపుడు రికార్డ్ చేసిన క్యాసెట్లు 2005లో బహిర్గతమవడంతో అరయో, ఆమె క్యాబినెట్ సహచరులు తక్షణమే రాజీనామా చేయాలని ప్రజల నుండి పెద్దఎత్తున నిరసన వెల్లువెత్తింది. ఆ సందర్భంగా ప్రభుత్వంపై పెట్టిన అవిశ్వాస తీర్మానం కొద్దిపాటి తేడాతో ఓడిపోయింది.

అరయో ప్రభుత్వం అమలుచేస్తున్న దారుణ నూతన-ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల దేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థ పూర్తిగా కృశించి పోతుండడంతో ఏమి చేయాలో పాలుపోక కొద్ది మంది వృత్తి నిపుణులు వలసపోవడం ద్వారా ఈ పరిస్థితుల నుండి తప్పించుకుంటున్నారు. మిగతా మధ్యతరగతి ఉద్యోగస్తుల నిరసనలూ, పెరుగుతున్న సామాజిక ప్రజా ఉద్యమాలూ తిరిగి అంతర్జాతీయ వార్తలలో చోటు చేసుకుంటున్నాయి.

2006 ఫిబ్రవరిలో లెయిటి ద్వీపకల్పంలో వర్షాలూ, అడవుల నరికివేతవల్ల కొండచరియలు విరిగిపడిన వినాశకర దుర్ఘటనలో దాదాపు 2 వేల మంది ప్రజలు శిధిలాల కింద సమాధి అయ్యారు. బాధితులకు కనీస సహాయం కూడా అందించడంలో ప్రభుత్వం విఫలమవడంతో దేశ ప్రజల ఆగ్రహావేశాలు పెల్లుబికాయి.

నియంత మార్కోస్‌ను కూల్చివేసిన 20వ వార్షిక దినమయిన ఫిబ్రవరి 23న, అధ్యక్షురాలు అరయో అత్యవసర పరిస్థితి ప్రకటించి ర్యాలీలను, ధర్నాలను నిషేధించి, తనకు వ్యతిరేకమైన ప్రసార మాధ్యమాలను మూసేయించింది.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తున్నారని అసత్య ఆరోపణతో కాంగ్రెస్ సభ్యులనూ, మిలటరీ అధికారులనూ, సామాజిక కార్యకర్తలనూ దాదాపుగా 59 మందిని అరెస్టు చేయడానికి ఆదేశాలు జారీ చేసింది. మార్కోస్ నియంతృత్వాన్ని కూల్చివేయటాన్ని పురస్కరించుకొనేగాక, ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో పాల్పడిన అవినీతికీ, లంచగొండితనానికీ, ఆర్థిక దుర్వినియోగానికీ, మానవహక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా కూడా ఊరేగింపులు రూపొందాయి. నిషేధాజ్ఞలను ధిక్కరించి జరిగిన ర్యాలీలను హింసాత్మకంగా అణిచివేసారు.

తిరుగుబాటుదారులుగా ఆరోపణలెదుర్కున్న వారిలో వామపక్ష రాజకీయ పార్టీలకు చెందిన ఆరుగురు కాంగ్రెస్ సభ్యులు, ఒక మానవ హక్కుల న్యాయవాది, ఉద్యోగ విరమణ చేసిన, ప్రస్తుతం ఉద్యోగంలో కొనసాగుతున్న సైనిక అధికారులూ, సామాజిక కార్యకర్తలూ వున్నారు. వారిపై చేసిన ఆరోపణలలో ఏమాత్రం కూడా వాస్తవం లేదు. ఉదాహరణకు అనక్పావిస్ (శ్రామిక జనం) పార్టీకి చెందిన కాంగ్రెస్ సభ్యుడు, 73 సంవత్సరాల వయసున్న క్రిస్పిన్ బెల్ట్రాన్ చాలా అనుభవమున్న కార్మిక నాయకుడు, మార్కోస్ వ్యతిరేక కార్యకర్త. అత్యవసర పరిస్థితి ప్రకటించిన వెంటనే మార్కోస్‌కు వ్యతిరేకంగా పోరాడినపుడు తిరుగుబాటుదారుడని 25 సంవత్సరాల క్రితం పెట్టి కేసును సాకుగా చూపి అరెస్టు చేసారు.

ప్రత్యేకించి బయాన్‌మున పార్టీ, దాని అనుబంధ సంస్థలతోపాటు వర్గ పునాదిపై ఆధారపడి పని చేసే రాజకీయ పార్టీలను, కార్మికసంఘాలను పూర్తిగా అణిచివేయాలనే లక్ష్యంతో అరయో ప్రభుత్వం సరికొత్త దాడిని మొదలుపెట్టింది. 2001-2005 మధ్య ప్రభుత్వం చేసిన వరుస హత్యాకాండలో ఈ పార్టీలకు చెందినవారు 80 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో చట్టబద్దంగా ఎన్నికయిన నగర మేయర్లూ, రాష్ట్రాల ప్రతినిధులతోపాటూ దేశ కాంగ్రెస్‌కు ఎన్నికయిన సభ్యులు కూడా వున్నారు. అంతకు ముందు గ్రామీణ ప్రాంతంలో రైతాంగంపై అమలయిన నిర్బంధం 2006 నుండి మనీలాలో కాంగ్రెస్ సభ్యులపై, ప్రసారమాధ్యమాలపై, కార్మికవర్గంపై, వామపక్ష రాజకీయ పార్టీలపై కొనసాగుతున్నది. 2006 మొదటి పది వారాలలో హత్యకు గురైన 26 మందిలో బయాన్‌మున సంస్థకు చెందిన వారు ముగ్గురు. కాంగ్రెస్ సభ్యులను కూడా అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే లేదా ప్రశ్నించే వాళ్ళెవరినీ ఉపేక్షించం లేదా వదిలిపెట్టమనే సంకేతాన్ని చట్టబద్ద వామపక్ష రాజకీయ పార్టీలకు ప్రభుత్వం పంపించింది.

స్వతంత్ర మానవహక్కుల సంస్థ కరాపతన్ తెలియజేసిన దాని ప్రకారం పెద్దఎత్తున మిలిటరి మోహరించివున్న ప్రాంతాలలో కూడా అదృశ్యాలూ, హత్యలు జరుగుతున్నాయి. మిలిటరీ సహకారం లేకుండా ఈ హంతక దళాలు ఇంత నిర్భయంగా హత్యలు చేయలేవు. హత్యలకు సాక్షులుగా వున్నవాళ్లు కూడ అదృశ్యమవుతున్నారు.

హత్యలకు పథకాలు రూపొందిస్తున్నవారిని కానీ పాల్పడుతున్నవారిని గాని విచారించి శిక్షించడంలో ఫిలిప్పైన్స్ న్యాయవ్యవస్థ పూర్తిగా విఫలమయింది. హంతక దళాల నాయకులు ఫలానావారే అని గుర్తించినప్పటికీ సైన్యం వారిని అరెస్టు చేయడంగానీ, విచారించడంగాని చేయడంలేదు. ప్రాంతీయ మిలిటరీ కమాండ్‌ల, ప్రత్యేకించి అమెరికా శిక్షణ పొందిన ప్రత్యేక బలగాల రక్షణలోని హంతక దళాలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని మానవహక్కుల సంస్థలు

సాక్ష్యాలు చూపిస్తున్నాయి. 'మిన్‌డోరో కసాయి'గా అపఖ్యాతి పాలయిన కల్నల్‌జోవిటో పాల్పరన్‌ను సైన్యాధ్యక్షున్ని చేసారు. ఇతడు పెద్దఎత్తున మానవహక్కుల ఉల్లంఘనలకు పాల్పడిన వాటికి సంబంధించి చాలా సాక్ష్యాధారాలు ఉన్నాయి. అయినప్పటికీ ఇతన్ని సైన్యాధ్యక్షున్ని చేయడం ద్వారా మిలటరీ అండతో జరుగుతున్న ప్రభుత్వ టెర్రరిజంకు అరయో తన మద్దతును తెలియజేసింది. 2005లో మధ్య లూజాన్‌లో ఇతను విధులు నిర్వహించినపుడు నాలుగు నెలల్లో 52 రాజకీయ హత్యలు జరిగాయి.

## ప్రతిఘటన స్థాయి

సామాజిక, ఆర్థిక వ్యవస్థలు పూర్తిగా నాశనమైపోతున్నప్పటికీ, మరోవైపు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు సహాయ కార్యక్రమాలు నిర్వహించడంలో పూర్తిగా విఫలమవుతూ కూడా బలప్రయోగం ద్వారా ప్రభుత్వం అధికారంలో కొనసాగాలని చూస్తున్నది. గ్రామాల నుండి పట్టణాల వరకు ప్రజల ప్రతిఘటన పెరుగుతున్నది. రైతాంగ, స్థానిక అల్పసంఖ్యాక రైతాంగ, పారిశ్రామిక కార్మికుల, ఉపాధ్యాయుల, విలేఖరుల, ప్రభుత్వ ఉద్యోగుల, విద్యార్థుల, మహిళల, కళాకారుల, మానవహక్కుల కార్యకర్తల, న్యాయవాదుల, మతాధిపతులతో కూడిన ప్రజాసంఘాలు ప్రభుత్వ బీభత్స క్యాంపెయిన్‌ను అధిగమిస్తూ పెంపొందుతున్నాయి. నియంత మార్కోస్ పరిపాలన కూలిపోయిన 20వ వార్షికోత్సవం సందర్భంగా నిషేధాజ్ఞల్ని ధిక్కరించి మనీలాలోనూ, ఇతర పట్టణాలలోనూ వేలాది ప్రజలు ఊరేగింపులలో కదంతొక్కారు. మార్చి 8 సందర్భంగా పోలీసుల నిషేధాజ్ఞల్ని ధిక్కరించి 10 వేల మందికిపైగా మహిళలు ఊరేగింపు నిర్వహించారు. దేశవ్యాప్తంగా వున్న విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉద్యమిస్తున్నారు. మాజీ అధ్యక్షులు, వ్యాపారవర్గాలు, మతాధిపతులు అరయో రాజీనామ చేసి 'అధికార మార్పును సుగమం' చేయాలని కోరుకుంటుండగా, ప్రభుత్వ హత్యాకాండ వల్ల నష్టపోయిన బాధితులకు న్యాయం జరగాలనీ, అమెరికా సైనిక స్థావరాన్ని ఎత్తివేయాలనీ, విలువ ఆధారిత పన్ను (వ్యాట్)ను రద్దు చేయాలనీ, కనీస వేతనాలు కల్పించాలనీ, భూసంస్కరణలు అమలు చేయాలనీ, అప్పుల చెల్లింపుపై మారటోరియం విధించాలనీ, కీలక ఆర్థిక సంస్థలను తిరిగి జాతీయం చేయాలనీ, ప్రభుత్వానికీ, నూతన ప్రజాసైన్యం, ముస్లిం వేర్పాటువాదులకు మధ్య ఫలప్రదమయ్యే విధంగా చర్చలు జరగాలనీ ప్రజా ఉద్యమాలూ వారి రాజకీయ ప్రతినిధులు కోరుకుంటున్నారు. చివరకు అధ్యక్షురాలు అరయో బలవంతంగానైనా రాజీనామా చేస్తుందని అధికారులు చెపుతున్నారు. అయితే ఎవరు? ఎప్పుడు చేస్తారన్నదే ప్రశ్న. ★

*(...3వ పేజీ తరువాయి)*

వైద్యా, ఆరోగ్యా, సమాచార సేవల మీద పెట్టే ఖర్చుకు నాలుగు రెట్లు. దీన్నిబట్టి ఆర్థిక మంత్రి ప్రాధాన్యత ఏమిటో అర్థమవుతుంది. యు.పి.ఎ ప్రభుత్వం అధికార అందలం అందుకోవడం కోసం రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని, తన ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసింది. యు.పి.ఎ భాగస్వామ్య పక్షాలు ఒకే అంగీకారంతో కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని ప్రకటించాయి. ఈ మూడు సంవత్సరాల పరిపాలనలో రైతాంగం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడి లాగానే ఉంది. నిత్యం రైతాంగపు ఆత్మహత్యల రేటు పెరుగుతూనే వుంది. ప్రస్తుతం ప్రత్యేక ఆర్థిక మండలాల పేరిట, అనేక ప్రాజెక్టుల పేరిట ప్రజలను నిర్వాసితులను చేసి వారి భూముల నుండి వెళ్లగొట్టే ప్రక్రియలో రైతాంగంతో సహా యావత్తు ప్రజానీకపు జీవితాలు అల్లకల్లోలంగా మారుతున్నాయి. దేశంలో రెండవ హరిత విప్లవం తీసుకొస్తామని ప్రభుత్వం ఊదరగొడుతూనే ఉంది. ఈ బడ్జెట్ రైతాంగ, వ్యవసాయ ప్రాధాన్యతతో కూడుకొన్నదని, ద్రవ్యోల్బణాన్ని అదుపులో పెట్టే చర్యలు తీసుకొన్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఆచరణలో మాత్రం మార్పులు ఇప్పటికీ ఏమీ లేవు. పాలకవర్గాలు బడ్జెట్‌లో ఏమి వాగ్దానం చేశాయి అని చూసే బదులు వాస్తవ జీవితంలో ఈ ప్రభావం ఎలా ఉంటుందో చూస్తే గానీ అసలు విషయం అర్థం కాదు.

సామ్రాజ్యవాదులకు ఊడిగం చేసే దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు అధికారంలో ఉన్నంత వరకు ప్రభుత్వాలు ప్రవేశపెట్టే ఏ బడ్జెట్ అయినా, ఏ నిర్ణయమైనా ఆ వర్గాలకు ప్రయోజనం చేకూర్చేవిగానే ఉంటాయి- ఉంటున్నాయి కూడా. ఈ రోజు అంబానీ కుటుంబం దాదాపు రెండు లక్షల కోట్ల సంపదను పోగు చేసుకుందంటే ఈ విధానాలే కారణం. పెట్టుబడిదారులూ, భూస్వామ్య వర్గాలు విపరీతమైన సంపద పోగు చేసుకుంటున్నారు. కావున ఈ వర్గాల అధికారాన్ని కూలదోసి కార్మిక కర్షకుల నాయకత్వంలో నూతన ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని స్థాపించుకొన్నప్పుడే ప్రజలకు ఉపయోగపడే నిజమైన ఆర్థిక విధానాలను రూపొందించుకోగలం. ★

# నిర్బంధంలో బస్తర్ మహిళ

అణిచివేత ఉన్నంతకాలం భూంకాల్ తిరుగుబాటు మళ్లీ మళ్లీ ఉద్భవించక తప్పదని నేటి చరిత్ర మరోసారి నిరూపిస్తోంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నాజీలను తలపించే బి.జె.పి పరిపాలన ఆదివాసుల బతుకులను ఛిన్నా భిన్నం చేస్తున్నది. ఒక్క బస్తర్‌లోనే సి.ఆర్.పి.ఎఫ్, ఎస్.ఎ.ఎఫ్, నాగా, మిజో ఫోర్స్, సివిల్ ప్రైవేట్ సేన (ఎస్.పి.ఒ.)లకు చెందిన వేలాది బలగాలను మోహరించి అణచివేత కార్యక్రమాన్ని అమలు చేస్తున్నది. సల్వాజుడూం పేరుతో చేస్తున్న ఈ అణచివేతను దర్భాగూడెం, మణికుంట, ఎర్రబోరు, రానిబోదిలీలలో వలె ప్రతిఘటించక తప్పని పరిస్థితి నేడు బస్తర్ ప్రజల ముందుంది.

బస్తర్ ఆదివాసులు జల్-జంగల్-జమీన్‌లపై హక్కు కోసం పోరాడుతున్నారు. అడవి బిడ్డల న్యాయమైన ఈ పోరాటానికి నక్సలైట్ల మద్దతు వుంది. ఈ పోరాడుతున్న ప్రజలపై స్త్రీ, పురుష పిల్లలూ, వృద్ధులన్న తేడా లేకుండా ప్రభుత్వం సల్వాజుడుం పేరుతో సర్వం విధ్వంసం నిర్బంధకాండకు పాల్పడుతోంది. ఈ నిర్బంధకాండలో భాగంగా మహిళలపై జరుగుతున్న అణచివేతను చూద్దాం!

దక్షిణ బస్తర్‌లో ప్రభుత్వ బలగాలు, ప్రైవేట్ సేనలు (ఎస్.పి.ఒ.లు, గూండాలు) మహిళలపై సామూహిక అత్యాచారాలకు పాల్పడుతున్నారు. పాలకవర్గాలు మహిళలపై అన్ని దేశాల్లోనూ రాష్ట్రాల్లోను ఉపయోగించే చేతకాని ఆయుధం అత్యాచారం. దాన్ని బాగా వంటపట్టించుకున్న సి.ఆర్.పి.ఎఫ్, నాగా, ఎస్.పి.ఒ, గూండాలు అందరూ వందలాది మంది మహిళల్ని అత్యాచారం చేశారు. పదుల సంఖ్యలో మహిళల్ని చంపివేశారు.

ఆంధ్రప్రదేశ్‌లోని వరంగల్ జిల్లాలో 1982లో ఆర్.ఎస్.యు విద్యార్థిని సుజాతను గాంధీ బొమ్మ చుట్టూ నగ్నంగా ఊరేగించి ఆర్.ఎస్.యులో పని చేయరాదని, చేస్తున్నందుకు ఇది శిక్ష అని హెచ్చరించారు. ఎ.పి పోలీసులు రెండు దశాబ్దాల కిందనే అమలు చేసిన హేయమైన హింస నేడు బస్తర్‌లో ఆదివాసీ మహిళలపైన అమలవుతోంది. 2006 మార్చి 12వ తేదీన కుంట ఏరియాలోని ఏటగట్టె గ్రామానికి చెందిన పొడియం రాజే అనే మహిళను 150 మంది సి.ఆర్.పి.ఎఫ్, నాగా, ఎస్.పి.ఒ గూండాలు నడిరోడ్డుపై నగ్నంగా నిలబెట్టి పార్టీ గురించీ, ఊరి సంఘం గురించి వివరాలు చెప్పమనీ లేకుంటే ఇప్పుడు నిన్ను ఏం చేస్తామో తెల్సుకదా అంటూ చప్పట్లుకొడ్తూ చిందులు వేశారు. ఐనా ఆ మహిళ చలించలేదు. ధైర్యంగా వుంది. గెరిల్లాల, సంఘ నాయకుల రహస్యాన్ని కాపాడింది. పోరాడే ప్రజలను అణచివేతలు-అత్యాచారాలు ఏం చేయలేవనే విప్లవ చైతన్యాన్ని చాటి చెప్పింది రాజే.

ఇదే విధంగా బాసగూడెం ఏరియాలో మల్లేపాడ్ అనే గ్రామానికి చెందిన ఏడుగురు మహిళలు తిమ్మపురం అనే గ్రామానికి ఇప్పపూలను అమ్ముకోవడానికి వెళ్తుండగా ఒక గుట్టపై ఆంబుష్‌కు కూర్చున్న సి.ఆర్.పి.ఎఫ్ వాళ్లు ఆ మహిళలపై విచ్చలవిడిగా కాల్పులు జరుపగా మిడియం సుక్కి అనే మహిళ అక్కడికక్కడే చనిపోయింది. మిగతా ఆరుగురు మహిళలు 3 రోజులు అడవిలో తలదాచుకుని ఇంటికి చేరారు. ఈ మహిళలు సాధారణ గ్రామ మహిళలు అని తెల్సికూడా ఉద్దేశ పూర్వకంగానే వారిపై కాల్పులు జరిపి, ఒక మహిళను చంపి ఎదురుకాల్పుల్లో ఒక మహిళా నక్సలైటు చనిపోయిందని పోలీసులు అబద్ధాల ఆకాశవాణిలో కల్లబొల్లి ప్రచారం చేశారు. మిడియం సుక్కికి రెండు సంవత్సరాల పాలు తాగే పాప వుంది. భర్త కూలీ కోసం ఆంధ్రప్రదేశ్ వెళ్లగా ఆమె శవం అనాథ శవంగా అడవిపాలయింది.

2006 మే 18న నెల్‌గూడ అనే గ్రామంలో ప్రజలందరూ కూడా సల్వాజుడూం దాడుల్లో నష్టపోయిన కుటుంబాల సమస్యలు తెల్సుకోవడానికి సమావేశం అవుతుండగా ఇన్‌ఫార్మర్ ద్వారా విషయం తెల్సుకున్న సి.ఆర్.పి.ఎఫ్, నాగా బలగాలు వందలాదిగా చుట్టుముట్టి నిరాయుధ ప్రజలపై విచ్చలవిడిగా కాల్పులు జరుపగా 20 యేళ్ల సోని కాలుకు తూటా తగిలి అక్కడే పడిపోయింది. గాయంతో కదలలేని స్థితిలో వున్న సోనిని ఎస్.పి.ఒ గూండాలు, సి.ఆర్.పి.ఎఫ్, నాగా బలగాలు కత్తులతో, కాడీలతో శరీరంలో అన్ని భాగాలలో గుచ్చిగుచ్చి పైశాచికంగా హింసలు పెట్టి శరీరం మొత్తం జల్లెడలా చేసి చంపి నక్సలైట్ల డ్రెస్ తొడిగించి మహిళా నక్సల్ రామే ఎదురుకాల్పుల్లో చనిపోయిందని ప్రకటించారు. ఇది పోలీసు బలగాల గొప్ప విజయం అని వార్తా పత్రికలలో, రేడియోలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఇదీ బి.జె.పి ప్రభుత్వం పాలనలో ఉన్న రాష్ట్రంలో, హిందూ మత ధర్మంలో, మహిళల్ని పూజించే (చంపే) నీతి.

సల్వాజుడూం ముందు లొంగి పోవడానికి వెళ్లిన గ్రామాల మహిళల్ని ఇళ్లకు వెళ్లేందుకు వదలకపోవడంతో పిల్లల తల్లులు మాకు చిన్న పిల్లలు వున్నారు, మమ్ముల్ని వదలండి అని అడిగితే, మీకు నిజంగా పిల్లలు వున్నారా? ఉంటే పాలు పిండి చూపించండి అని పోలీసు బలగాలు బలవంతం చేస్తున్నారు. పిల్లల దగ్గరికి

వెళ్లడం కోసం తల్లులు పాలుపిండి చూపించవలసి వస్తోంది. ఇటువంటి అమానవీయ చర్యలెన్నో నేడు బస్తర్‌లో జరుగుతున్నాయి.

సల్వాజుడూం గూండాలు, నాగా పోర్స్, సి.ఆర్.పి.ఎఫ్ వాళ్లు వందల కొద్దిగా కుంట ఏరియాలోని గగన్‌పల్లి అనే గ్రామంపై పడి మహిళలందరినీ ఒకదగ్గర జమచేసి కొట్టడం, తిట్టడం చేశారు. కొందర్ని బోరింగ్ దగ్గర వున్న బురద గుంటలో పొర్లించి పొర్లించి మీ మొగుళ్లు ఎటు వెళ్లారు? వాళ్లను నక్సలైట్లలోకి పంపించి మీరు ఇక్కడ ఏం తెలియనట్టు నటిస్తున్నారు అంటూ కొట్టారు. పిల్లలు, తల్లులు ముసలివాళ్లు అనే విచక్షణ లేకుండా కొట్టారు. మరికొందరిని ఎర్రబోర్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. తీసుకెళ్తున్నపుడు మార్గమధ్యంలో నది దాటే సమయంలో మడకం దూలే అనే మహిళను 12 మంది సి.ఆర్.పి.ఎఫ్, ఎస్.పి.ఒలు, గూండాలు ఒకరి తర్వాత ఒకరు నీళ్లలో ముంచుతూ అత్యాచారం చేశారు. దాదాపు శవ స్థితిలో వదిలివెళ్లగా గ్రామస్తులు ఇంటికి మోసుకెళ్లి అడవిలోని చెట్ల మందులతో బతికించుకున్నారు.

ఇదీ హిందుస్థాన్ - హిందూమత ప్రభుత్వ రాజ్యంలో మహిళలకు జరుగుతున్న (అ)మర్యాదలు.

ఇటువంటి అత్యాచారాల మూలంగా సల్వాజుడూం దాడికి గురైన దక్షిణ, పశ్చిమ డివిజన్‌లలో వందల సంఖ్యలో మహిళలు గర్భవతులైనారు. ఇరాక్‌లోని అమెరికా సైన్యం కోసం ఇరాక్ మహిళల్ని 'కంఫర్టబుల్ మహిళలు'గా అమెరికా మార్చుతున్నట్టుగానే స్త్రీలను గౌరవించాలని చెప్పే భారత దేశంలో కూడా జాతుల పోరాటాలను అణచివేయడంలో భాగంగా అణచివేత బలగాలు స్థానిక మహిళలను మార్చుతున్నాయి. అలాగే ఆదివాసీ మహిళలనూ మార్చాలని చూస్తున్నారు. మరి ఈ ప్రతీఘాతుక యుద్ధంలో బలి అవ్వడమా? లేదా బలిదానం చేసి పోరుకేతనంగా నిలవడమా అనేది నేటి బస్తర్ మహిళ ముందున్న సమస్య.

గ్రామాలపైకి దాడులకు వచ్చిన నాగా, ఎస్.పి.ఒ, గూండాలు, చిన్న పిల్లల్ని సైతం తల్లిదండ్రులకి కాకుండా శిబిరాల్లోకి పట్టుకెళ్లి బంధిస్తున్నారు. వాళ్లు బందీలుగా బతుకలేక పారిపోయివచ్చి 'కోయ భూంకాల్ మిలీషియాలో' చేరుతున్నారు, దళాలతో వుంటున్నారు. సల్వాజుడూం అణచివేత క్రూర చర్యలు పిల్లలను కూడా ప్రతిఘటన మార్గంలోకి తెస్తున్నాయి. ఇళ్లు కాల్చడంతో నీడ కరువై అడవి నీడలో, రక్షణ కరువై దళాల రక్షణలో వారు సైతం గెరిల్లాలుగా మారక తప్పని పరిస్థితి ఏర్పడుతోంది.

★

---

*(....9వ పేజీ తరువాయి)*

నందిగ్రామ్ సంఘటనతో సి.పి.ఎం సోషల్ ఫాసిస్టు ముఖం బట్టబయలైంది. ఇప్పుడైనా వామపక్షాల మీద భ్రమలున్న ఉదారవాద మేధావుల కళ్లు తెరచుకోవాలి. తను అధికారంలో ఉన్నచోట కాల్పులు జరిపైనా భూములు గుంజుకోవాలంటున్న సి.పి.ఎం ఆంధ్రప్రదేశ్‌లో భూపోరాటాలకు పూనుకుంది. ప్రజలకు భూములు దక్కటం పట్ల సి.పి.ఎం నిజాయితీ ఏమిటో నందిగ్రామ్‌లోనే రుజువైంది. చట్టబద్ధ పోరాటాలూ, మామూలు ఆందోళనలతో పాలకవర్గాల ప్రయోజనాలకు బలవుతున్న ప్రాజెక్టుల నిర్వాసితులకు న్యాయం దక్కదని సంవత్సరాల తరబడి మేధాపాట్కర్ నాయకత్వంలో జరిగిన 'నర్మదా బచావో ఆందోళన్' నగ్నంగా నిరూపించింది. చట్టాలు పాలకవర్గాల చుట్టాలు. అందుకే ఉన్నత న్యాయస్థానాలు కూడా పాలకవర్గాలకే కొమ్ముకాసి నర్మదా ప్రాజెక్టు నిర్వాసితుల్నే ముంచాయి. ఈ చట్టాలూ, శాసన, పాలనా వ్యవస్థలూ అన్నీ సామ్రాజ్యవాదుల గులాములు. ఎన్ని కోట్ల ప్రాణాలు బలైనా, ఎంత రక్తం ఏరులై పారినా సామ్రాజ్యవాద రాబందులు భారత ప్రజల రక్తమాంసాల్ని పీల్చి, దేశ సంపదను తన్నుకుపోవడానికే కాచుకు కూర్చున్నాయి. అందుకు తగిన ఆదేశాల్ని తమ సేవకులైన భారత పాలకవర్గాలకు జారీ చేస్తున్నాయి. తమ సామ్రాజ్యవాద యజమానుల ముందు సాష్టాంగపడిన పాలకవర్గాలు ఆ ఆదేశాలనే శిరసావహిస్తున్నాయి. దీని ఫలితమే నందిగ్రామ్ కాల్పుల తర్వాత అక్కడ ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటుకు భూసేకరణ జరపబోమని పశ్చిమ బెంగాల్ సి.పి.ఎం ప్రభుత్వం చెప్పినా, ఆ రాష్ట్ర పరిశ్రమల మంత్రి నిరుపమ్‌సేన్ సింగూర్‌లో రైతుల భూములు టాటా కార్ల ఫ్యాక్టరీ కోసం అప్పజెప్తామనీ, ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎస్.ఇ.జడ్ ఏర్పాటు జరిగి తీరుతుందనీ తెగబడి మరీ ప్రకటిస్తున్నాడు. ఇక చావో రేవో తేల్చుకోవాల్సింది ప్రజలే. దొడ్డి దారిన ప్రవేశిస్తున్న 'వలస రాజ్య స్థాపన'ను భూస్థాపితం చేయడానికి తెగించి పోరాడాలి. నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా రాజీలేని మిలిటెంట్ పోరాటాలు చేపట్టటమే ఈ ప్రాజెక్టులకు బలవుతున్న నిర్వాసిత ప్రజల ముందున్న సరైన పరిష్కారం.

★

*(....19వ పేజీ తరువాయి)*

మీద ఎన్.టి - డి.కె పి.ఎల్.జి.ఎ బలగాలు రెండు వైపుల నుండి దాడి చేశాయి.

నవంబర్‌లో జరిగిన కాల్పులలో కా. మడకం గంగయ్య, కా. మోతి అమరులయినారు. నవంబర్ 27న నిమ్మలగూడెం - డోకపాడు గ్రామాల మధ్య పోలీసులు కాల్పులు చేస్తే కా. ఇడమాల్ అమరుడైనాడు. ఈ విధంగా పోలీసులు 10 రోజులు అటవీ ప్రాంతంలో తిరుగుతూ ఆదివాసీ ప్రాంతాల మీద పట్టు సాధించడానికి ప్రయత్నం చేస్తున్న క్రమంలో ఎదురుదాడులు కొనసాగడంతో గ్రేహౌండ్స్ బలగాలు వెనుతిరిగాయి.

## ఎన్‌కౌంటర్లకు నిరసనగా బంద్ - కాంగ్రెస్ నాయకులమీద దాడి

ఎ.పి-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటరుకు నిరసనగా, పి.ఎల్.జి.ఎ వారోత్సవాన్ని పురస్కరించుకొని డిసెంబర్ 2న పార్టీ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చింది. బంద్ సందర్భంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా, సరిహద్దు ప్రాంతంలో పెద్దఎత్తున బలగాలను మోహరించారు. విస్తృతమైన తనిఖీలు చేపట్టారు. అయినప్పటికీ బంద్ జిల్లా వ్యాప్తంగా విజయవంతమైంది.

కుంట ప్రాంతంలో సల్వాజుడూంలో పని చేసిన భీం అనే వ్యక్తి చింతూరు మండలం ఎదురుపాడు గ్రామంలో ఉంటూ "మావోయిస్టు పార్టీని రానివ్వద్దు, సహకరించవద్దు" అంటూ ప్రచారం చేస్తూ సల్వాజుడుం కార్యకర్తలను ఆర్గనైజ్ చేయసాగాడు. అక్టోబర్ నెలలో భీంను ప్రజాకోర్టులో పెట్టి పి.ఎల్.జి.ఎ చంపివేసింది. ఈ విధంగా కుంట ప్రాంతం నుండి వచ్చి చింతూరు, భద్రాచలం ప్రాంతంలో ఆర్గనైజ్ చేస్తున్నారు. రామచంద్రునిపేట గ్రామానికి చెందిన కుంజా లక్ష్మణ్, మాడివి లక్ష్మయ్యలను గ్రేహౌండ్స్ పోలీసులు, సల్వాజుడుం గుండాలు కలిసి అరెస్టు చేసి కేసులు పెట్టారు. మావోయిస్టు సానుభూతిపరులని కేసులు పెట్టి జైలుకు పంపారు. ఆ తరువాత పోలీసులకు సహకరిస్తున్న ముగ్గురిని దళం దేహశుద్ధి చేసింది. చర్ల, వెంకటాపూర్ ప్రాంతంలో పోలవరం ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ పోస్టర్లు పడ్డందుకు అలుబాక, సీతారాంపూర్, మునలేరు గ్రామాలకు చెందిన దాదాపు 20 మందిని అరెస్టు చేసి కేసులు పెట్టి జైలుకు పంపారు. ఈ విధంగా మావోయిస్టు కార్యక్రమాలు ఎక్కడ కనబడ్డా పోలీసులు వెంటనే మావోయిస్టు సానుభూతివరులని, సంఘం సభ్యులని కేసులు పెట్టి, కొడుతున్నారు.

2006, జూలైలో ఎన్‌కౌంటర్లకు నిరసనగా చర్ల మండలం సత్యనారాయణపురం గ్రామానికి చెందిన సింగిల్‌విండో ఛైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు అయిన వర్మను పి.ఎల్.జి.ఎ గొడ్డళ్లతోటి నరికి చంపింది. అట్లాగే కూనవరం మండలం కాంగ్రెస్ నాయకుడు శ్రీమంతుల సీతారామరావును కూడా కాల్చి చంపింది. ఈ సంఘటనతో కాంగ్రెస్ నాయకులందరూ వలసబాట పట్టారు. మరికొంత మంది కాంగ్రెస్ పార్టీకి రాజీనామాలు చేశారు. ఈ సంఘటనను ఆసరా చేసుకొని పోలీసులు ఏజెన్సీ ప్రాంతంలో పెద్దఎత్తున గాలింపులు చేపట్టారు. డివిజన్‌లోని ప్రధాన పార్టీల నాయకులకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడికెళ్లినా తమకు సమాచారం అందించాలని నోటీసులు జారీ చేశారు.

## పోలవరం అనుకూల నేతలకు ఇదో షాక్

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన పోలవరం ప్రాజెక్టుకు అనుకూలంగా ఉన్న కాంగ్రెస్ నాయకులకు కూనవరం ఎం.పి.పి సీతారామారావు హత్య పెద్ద షాక్ అయింది. "ఎలాగైనా సరే పోలవరం కట్టాలి" అన్న ఆలోచనలో ఉన్న అధికార పార్టీ నేతలు పోలవరం నిర్వాసితులకు నచ్చజెప్పేందుకు చైతన్య యాత్రలను నిర్వహించాలనుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ చందా లింగయ్య ఆధ్వర్యంలో ఒక బృందం 2006 నవంబర్‌లో చైతన్య యాత్రల పేరిట బయలుదేరేందుకు సిద్ధపడింది. ఈ తరుణంలో పోలవరం అనుకూల నేతలకు మావోయిస్టులు హెచ్చరికలు జారీ చేయడంతో చైతన్యయాత్రలు వాయిదా పడినాయి. వేలేరుపాడు మండలం వోయిదా గ్రామంలో ప్రాజెక్టుకు అనుకూలంగా ఉన్న ఆంధ్ర కమ్మ కులానికి చెందిన బ్రహ్మయ్యను దళం దేహశుద్ధి చేసింది. ప్రాజెక్టు కావాలని ఒత్తిడి చేసే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కోస్తాంధ్ర నాయకులు తాత్కాలికంగా వెనుకంజ వేసారు. ఇట్లా తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కుంటూనే, కొన్ని నష్టాలకు గురవుతూనే ఖమ్మం జిల్లా ఉద్యమం ముందుకు పోతోంది. పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆదివాసి సంఘాలు, హక్కుల సంఘాలు, విప్లవ పార్టీలు, తెలంగాణ ఐక్య కార్యాచరణ సమితి ఉద్యమిస్తున్నాయి. సెప్టెంబర్ 2006 నెలలో 15 వేల మంది ప్రజలతోటి ఖమ్మం పట్టణంలో "ప్రాణాలైనా అర్పిస్తాం - పోలవరం ప్రాజెక్టును అడ్డుకుంటాం" అని పెద్ద బహిరంగ సభ జరిగింది. ఈ సభ జిల్లా ప్రజల మీద మంచి ప్రభావాన్ని వేసింది.

ఈ విధంగా ఖమ్మం జిల్లాలో మావోయిస్టు ఉద్యమం పోలీసు తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటూనే, కొన్ని నష్టాలకు గురవుతూనే పురోగమిస్తోంది. ★

# ఎర్రశెల అమరులకు జోహార్లు

2006 నవంబర్ 10న ఉదయం 11 గంటలకు గ్రేహౌండ్స్ బలగాలతో (నెల్లూరు సరిహద్దులోని కడప జిల్లా బద్వేల్‌కు 20 కి.మీ దూరంలోనున్న పల్లె దగ్గరలోని) ఎర్రశెల కొండపైన జరిగిన బూటకపు ఎదురుకాల్పుల్లో రాయలసీమ బాధ్యతలు చూస్తున్న సి.పి.ఐ (మావోయిస్టు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ సభ్యుడు కా. రాఘవులు, జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్స్ కల్పన, మల్లిఖార్జున్‌లు, దళకమాండర్లు అశోక్, రాంబాబులు, మహిళా టీం బాధ్యురాలు సంధ్య, దళ సభ్యులు భరత్, సుజాత, పార్వతిలు అమరులయ్యారు. ఇందులో రాఘవులు, కల్పన ఇద్దరూ జీవిత సహచరులు. వీరిద్దరిదీ గుంటూరు జిల్లా. అలాగే రాంబాబు-పార్వతి ఇద్దరూ కూడా జీవితసహచరులు వీరిద్దరితోపాటు మిగిలిన 5గురిది కూడా అనంతపురం జిల్లానే.

రాయలసీమలో అనంతపురం జిల్లాకు విప్లవోద్యమ చరిత్రలో ఒక ప్రాముఖ్యత వుంది. శ్రీకాకుళం తర్వాత పరిటాల శ్రీరాములు నాయకత్వంలో జరిగిన శివాజమీ భూముల పోరాటంలోకి ప్రజలు పెద్ద సంఖ్యలో కదిలారు. తీవ్ర నిర్బంధ పరిస్థితుల్లో భూమి, భుక్తి, విముక్తి లక్ష్యంతో జరిగిన ఈ రైతాంగ పోరాటం మూడు దశాబ్దాలుగా కొనసాగుతూ విద్యార్థి యువజన, కార్మిక, మేధావి రంగాలను ఎంతో ప్రభావితం చేసింది.

కామ్రేడ్స్ దేవన్న, సత్యం, గంగన్న, ప్రవీణ్, శంకర్, మల్లిఖార్జున్ వంటి ఉద్యమం తీర్చిదిద్దిన నాయకులు ఈ గడ్డనే అమరులయ్యారు. వారు నడిపిన పోరాటం ఫ్యాక్షనిజాన్ని, భూస్వామ్యాన్ని, దళారీ నిరంకుశపాలనను ఎదిరించింది. ఈ కామ్రేడ్స్ నాయకత్వంలో వేల ఎకరాల భూములు ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. రైతాంగం గిట్టుబాటు ధరల కోసం పోరాడారు. సహకార సంఘాల ద్వారా రైతాంగం తమ ఉత్పత్తులను పెంచుకొని షావుకార్ల దోపిడీని ఎదుర్కొన్నారు. హాస్టల్ విద్యార్థులు తమ సమస్యల కోసం పోరుబాట పట్టారు. ఇంకా అనేక సామాజిక సమస్యల పరిష్కారానికి ప్రజలు ఉద్యమించారు. రాయగిరి, పెన్నహోబిలం, చిత్రావతి దళాల ప్రాంతాలలోను, అనంతపురంలోనూ జరిగిన ఆ పోరాటాల ప్రభావంతో ముందుకొచ్చిన యువతీయువకులు ఎందరో విప్లవోద్యమంలో నేలకొరిగారు. ఆ బాటనే ఈ ఏడుగురు అనంతపురం కామ్రేడ్స్ కూడా పయనించారు. వారికి వినమ్రంగా జోహార్లర్పిద్దాం.

ఆంధ్రప్రదేశ్‌లో ఈమధ్య కాలంలో జరుగుతున్న వరుస 'ఎన్‌కౌంటర్ల'లో ఇది ఒకటి. లొంగిపోయిన మాజీలను కోవర్టులుగా మార్చుకుని వారి ద్వారా ఆహారంలో విషమిచ్చి అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు పథకం ప్రకారం దాడిచేసి హత్య చేసారని నిజనిర్ధారణకు వెళ్ళిన ఎ.పి.సి.ఎల్.సితో పాటు పత్రికలు, స్థానికులు అభిప్రాయపడ్డారు. మృతదేహాలు రంగుమారడం, నోటి నుండి నురగలు రావడం, పాయింట్ బ్లాంక్ రేంజిలో కాల్చినట్లుగా మృతదేహాలపై గుర్తులుండడం, మృతదేహాలు త్వరగా వాసనరావడం, ఈ కామ్రేడ్స్ పోలీసుల పైకి కాల్పులు జరిపినట్లుగా ఆధారాలు లేకపోవడం... వంటి అనేక అంశాల్ని పరిగణనలోకి తీసుకుంటే ఇది బూటకపు ఎన్‌కౌంటరేనని స్పష్టమౌతుంది.

ఇటీవల కామ్రేడ్స్ మాధవ్, మంజీర, సుదర్శన్ వంటి నాయకులను కోల్పోయిన ఎ.పి ఉద్యమానికి, కా. రాఘవులు తదితర కామ్రేడ్స్ అమరత్వం పెను విఘాతం వంటిది.

ఇప్పటికే కామ్రేడ్ సత్యం, గంగన్న, శంకర్, గణేష్ వంటి నేతలను పోగొట్టుకొని తీవ్ర నష్టాల్లో వున్న రాయలసీమ ఉద్యమానికి ఈ 'ఎన్‌కౌంటర్' సమీప భవిష్యత్‌లో పూడ్చుకోలేని తీవ్రమైన నష్టం.

పాలకవర్గాలు తమ రక్త దాహాన్ని తీర్చుకోవడానికి విప్లవకారులపై, ప్రజలపై విచక్షణా రహితంగా హత్యాకాండకు పాల్పడుతున్నాయి. తమ ప్రయోజనాలకు అడ్డంకిగా వున్న మావోయిస్టు పార్టీని నామ రూపాలు లేకుండా అంతం చేయాలనే ఉద్దేశంతో అవి విప్లవోద్యమంపై రక రకాల కుట్రలకు పాల్పడుతున్నాయి. ఎన్ని కుట్రలకు పాల్పడ్డా, ఎంత హింసకు పాల్పడ్డా పాలకవర్గాలకు చేకూరే ప్రయోజనాలు తాత్కాలికమైనవే. గోడకు కొట్టిన బంతిని తిరిగి వెనక్కు దూసుకురాకుండా ఆపడం ఎవరితరమూ కానట్టే అణచివేత నుండి పుట్టే తిరుగుబాటును ఆపడం ఎవరి తరమూ కాదు. పాలకవర్గాలు ప్రజలపై గుమ్మరిస్తున్న హింస ప్రతిహింసగా మారి పాలకవర్గాలను అంతం చేస్తాయి. ఇది గతానికి సంబంధించిన చారిత్రక వాస్తవం మాత్రమే కాదు, భవిష్యత్ చరిత్రకు సంబంధించిన వాస్తవం కూడ.

ఎర్రశెల అమరులకు జోహార్లు. ఆ అమరుల ఆశయాలను కొనసాగిద్దాం.

# ఆరిపోని ఆశయ జ్వాల కామ్రేడ్ రాఘవులు (అప్పారావు)

కామ్రేడ్ రాఘవులు అసలు పేరు వెలగా అప్పారావు. గుంటూరు జిల్లా నరసరావుపేట పక్కనే ఉన్న కేసానుపల్లి గ్రామంలో శేషారత్నమ్మ, చౌడయ్య దంపతులకు అతను చివరి సంతానం. నరసరావుపేటలో 1985వ సంవత్సరంలో ఎస్.ఎస్.ఎన్ కళాశాలలో ఇంటర్మీడియేట్ చదువుతూ రాడికల్ విద్యార్థి సంఘం కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడు. ఉత్సాహం, చురుకుదనం, తెలివితేటలు, ఆదర్శాలు ఉన్న అప్పారావు సన్నగా పొడవుగా ఉండేవాడు. తనకు రాజకీయాలు చెప్పి ఆర్గనైజ్ చేసిన పొట్టి కామ్రేడ్ (కామ్రేడ్ ఏసన్న) పక్కన ఈ పొడవైన యువకుడు వెంటబడి తిరుగుతూ విద్యార్థుల సమస్యలపై అనేక ప్రచారా, ఆందోళన కార్యక్రమాలు చేపట్టాడు. విద్యార్థుల్లోనూ, అధ్యాపకుల్లోనూ, నాన్‌టీచింగ్ స్టాఫ్‌లోనూ, పట్టణ ప్రజల్లోనూ, రాడికల్‌గా మంచి గుర్తింపు పొందాడు. అదే కాలంలో నరసరావుపేటలో యువజన సంఘాలను ఆర్గనైజ్ చేసి, అనేక కార్యక్రమాలు చేపట్టాడు. జిల్లా, రాష్ట్ర కార్యకలాపాల్లో చురుగ్గా ఉండేవాడు.



ఎన్.టి.ఆర్ ప్రభుత్వం రాడికల్స్‌పై అప్రకటిత ఎమర్జెన్సీ అమలుచేసిన నిర్బంధంలో కా. అప్పారావు కూడా అరెస్టయి కొంతకాలం జైలు జీవితం గడిపాడు. బెయిల్‌పై జైలు నుండి విడుదలై రహస్య జీవితానికి వచ్చాడు. నరసరావుపేట, సత్తెనపల్లి గ్రామీణ ప్రాంతాల్లో యువజన, రైతాంగ ఉద్యమాలు నిర్మించాడు. పల్నాడు ప్రాంతంలో పార్టీ నాయకత్వంలో జరిగిన అనేక రైతాంగ పోరాటాల్లో భాగమయ్యాడు. 1990 నాటికి ఆర్గనైజరుగా ఎదిగిన అప్పారావు తనపేరును రాఘవులుగా మార్చుకుని బొల్లాపల్లి ఏరియాలో రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించాడు. 1990 నుండి 1997 వరకు బొల్లాపల్లి, పుల్లలచెరువు, కారంపూడి, వెల్దుర్తి మండలాల్లోను, మాచర్ల, వినుకొండ పట్టణ ప్రాంతాల్లోని అన్ని సెక్షన్ల ప్రజల్ని విప్లవోద్యమంలో భాగం చేసాడు. 1993 నాటికే జిల్లా కమిటీ సభ్యుడుగా ఎదిగిన రాఘవులు జిల్లా ఉద్యమం సమన్వయంలో భాగంగా 1997 నుండి దాచేపల్లి దళం బాధ్యతలు చూసాడు. 1998లో జిల్లా కార్యదర్శిగా ఎన్నుకోబడి జిల్లా ఉద్యమానికి సారథ్యం వహించాడు. 2000లో జరిగిన కోస్తా-రాయలసీమ రీజనల్ మహాసభలో ప్రత్యామ్నాయ ఆర్.సి సభ్యుడుగా ఎన్నిక అయ్యాడు. 2005లో రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఎన్నికై ఉద్యమ అవసరాలరీత్యా రాయలసీమ ఉద్యమబాధ్యతలు స్వీకరించి ఓబులేశ్‌గా రాయలసీమలో అడుగుపెట్టాడు. అప్పుడికే అక్కడ జరిగిన నష్టాల కారణంగా తనే అనంతపురం-కడప జిల్లాల జాయింట్ కమిటీకి కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాడు. విప్లవోద్యమం తనపై ఉంచిన బాధ్యతలను స్వీకరిస్తూ 2006 నవంబర్ 10వ తేదీ వరకు పట్టుదలగా పనిచేసి అమరుడయ్యాడు.

గుంటూరు జిల్లాకు విప్లవోద్యమ చరిత్రలో చాలా ప్రాముఖ్యత ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం కొండల్లో సాయుధ రైతాంగ పోరాటం జరుగుతున్న సమయంలోనే గుంటూరులో 'శ్రీకాకుళ పోరాట సంఘీభావ కమిటీ' ఏర్పడింది. డాక్టర్ చాగంటి భాస్కర్, అత్తులూరి మల్లిఖార్జున్ లాంటివారు శ్రీకాకుళం పోరాటంలో భాగమయి యువతరానికి ఆదర్శంగా నిలిచారు. కామ్రేడ్ గురవయ్య, సూర్యం, ఏసన్న, మంజీర, సురేష్ లాంటి కామ్రేడ్స్ గుంటూరు జిల్లా ఉద్యమ వారసత్వాన్ని కొనసాగించారు. ఆ వారసత్వమే రాఘవులు, కల్పనలకు మరింత పట్టుదలా, విశ్వాసాల్ని కల్పించింది.

జిల్లాలో దేవుడు మాన్యం భూ ఆక్రమణ పోరాటాలు, అడవి బంజరు ఆక్రమణ పోరాటాలు ఉద్యమాన్ని ఒక అడుగు ముందుకు వేయించాయి. ఫారెస్టు అధికారుల దౌర్జన్యాల్ని ఎదిరించిన ఉద్యమం  ఆదివాసీ ప్రజల్లో విశ్వాసాన్ని పొందింది. శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టాలని మాచర్ల, వినుకొండ ఏరియాల్లో చేసిన ప్రదర్శనలు, పిడుగురాళ్ళలో రైతాంగ సమస్యలపై ప్రజలతో జరిపిన ప్రదర్శనలు గుంటూరు, మాచర్ల, గుత్తికొండ సభల్లో వేలు, లక్షలుగా ప్రజలు పాల్గొని విప్లవోద్యమం ఎడల తమకున్న అనుబంధం చాటడం చూస్తే గుంటూరు జిల్లాలో విప్లవోద్యమ భవిష్యత్ అర్థమవుతుంది.

కా. రాఘవులు పల్నాడులో కరువు, గిట్టుబాటు ధరలు సమస్యలపైన అనేకసార్లు వేలాది మంది రైతాంగాన్ని కదిలించాడు. బంద్‌లు నిర్వహించాడు. కరువుదాడులు చేయించాడు. శత్రు నిర్బంధాన్ని ప్రతిఘటించడంలో అనేక టి.సి.ఓ.సిలను ప్లాన్ చేసి అమలు జరిగేలా చూసాడు. జిల్లాలో రాజకీయ నాయకుల్ని, పోలీసు అధికారులను, పెత్తందార్లను శిక్షించడంలో తనవంతు బాధ్యతను నిర్వహించాడు. ఉద్యమం ఎదుర్కొన్న అనేక సమస్యలను, ఆటుపోటు సమయంలో నిబ్బరంగా నిలిచాడు. అనేక ప్రజా సంఘాలను సమన్వయించి గైడ్ చేయడంలో అనుభవం సాధించాడు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని వందలాది ప్రజా సమస్యలను ప్రజాపంచాయితీల రూపంలో పరిష్కరించి భూస్వాముల, పెత్తందార్ల మెడలు వంచడంలో, మోర్జంపాడు లాంటి చోట్ల చాలా పకడ్బంధీ ప్లాన్‌తో కరువు దాడులు చేసి జిల్లా రాష్ట్ర పోలీసు రెవెన్యూ యంత్రాంగాన్ని గడగడలాడించడంలో ప్రజాకంటకుడు కాంగ్రెస్ పార్టీ నాయకుడు లక్ష్మీరెడ్డిని, కారంపూడి ఎస్.ఐ నిమ్మకాయల కోటేశ్వరరావు, ఎస్.ఐ.బి కానిస్టేబుల్ మస్తాన్ వలీని ఖతం చేసి ఉద్యమానికి ఏర్పడిన ఆటంకాలను తొలగించడంలో అద్దంకి, బండ్లమోటు, చిలకలూరిపేట, నరసరావుపేటలలో పెద్ద దాడులు చేయడంలో, మరెన్నో ఆంబుష్‌లు చేసి శత్రు కూంబింగ్‌లను నిరోధించడంలో, ప్రజా సమీకరణ, మిలిటెంట్ ప్రతిఘటన ద్వారా జిల్లా ఉద్యమాన్ని అభివృద్ధిపరచడంలో అతనిది ముఖ్యమైన పాత్ర.

బొల్లాపల్లి ప్రాంతంలోని లంబాడా రైతాంగం నుండి జిల్లాలో అన్ని సెక్షన్ల ప్రజలూ, పట్టణ కార్మిక, విద్యార్థి, మేధావి వర్గాలకు కా. రాఘవులు చిరపరిచితుడు. మంచి స్నేహితుడు కూడా. కేడర్‌తో కలిసిపోతూ నిరంతరం ఉత్సాహంగా ఉంటూ విప్లవ చైతాన్యాన్ని అందించేవాడు.

ఎక్కువగా శ్రద్ధపెట్టి చదవడం, రాయడం, చర్చించడం చేస్తూ నిరంతరం నేర్చుకునే తపన చూపేవాడు. 1988లో కా. కల్పనను వివాహం చేసుకుని ఆమెతో తన సహచర జీవితంలో సమస్యలు రాకుండా వైవాహిక జీవితాన్ని విప్లవాత్మకంగా, ఆదర్శంగా మలుచుకున్నాడు.

రాయలసీమకు వెళ్ళిన తర్వాత అక్కడ పరిస్థితుల్ని ఉద్యమాన్ని అర్థం చేసుకుంటూ కేడర్‌తో సన్నిహిత సంబంధాలు పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే 2006లో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో గాయపడ్డాడు. విప్లవోద్యమంలో తనతో పని చేసిన అనేక మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. కొందరు దిగజారిపోయారు. ఉద్యమం అనేక సమస్యలను ఎదుర్కొంది. ఈ కష్టకాలాలన్నింటా కా. రాఘవులు గెండె నిబ్బరంతోనే పట్టుదలగా కేడర్‌లో, ప్రజల్లో విప్లవంపట్ల విశ్వాసాన్ని పెంపొందిస్తూ, రాయలసీమ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్ళే కృషి చేసాడు.

ఆ కర్తవ్య నిర్వహణలోనే 2 దశాబ్దాల పూర్తి వృత్తి విప్లవకర జీవితాన్ని పీడిత ప్రజలపైన, విప్లవ రాజకీయాలపైన విశ్వాసంతో అంకితం చేసాడు. 20 సంవత్సరాల గుంటూరు జిల్లా విప్లవోద్యమ చరిత్రతో లోతుగా అనుబంధం కలిగిన నాయకుడు. 10 సంవత్సరాలపాటు జిల్లా నాయకుడుగా గైడ్ చేసిన ఉద్యమ సారధి. ఎందర్నో విప్లవకారులుగా ఉద్యమానికి పరిచయం చేసి తీర్చిదిద్దిన నాయకుడు. రాఘవులు పేరు చెప్పితే గుంటూరు జిల్లా గుర్తుకు వస్తుంది. గుంటూరును గుర్తుచేస్తే కామ్రేడ్ రాఘవులు తలపుకు వస్తాడు. అట్లా రాఘవులూ, గుంటూరు జిల్లా రెండూ విడదీయరాని అంశాలయ్యాయి. అటువంటి సీనియర్ నాయకున్ని కోల్పోవడం విప్లవోద్యమానికి తీవ్ర నష్టం.

కామ్రేడ్ రాఘవులు ఆశయాలను దృఢంగా కొనసాగిద్దాం.

## కామ్రేడ్ కల్పన (రమణ, చందన)



గుంటూరు జిల్లా మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో పుట్టి పెరిగిన దగ్గుబాటి కల్పన హైస్కూలు చదువు కోసం విజయవాడ వచ్చి హాస్టల్‌లో ఉంటున్న క్రమంలో మహిళా సంఘం పరిచయాల్లోకి వచ్చింది. 1988లో 10వ తరగతి పూర్తి చేసుకొని మహిళా సంఘ కార్యకలాపాల్లో పాల్గొంటున్న క్రమంలో పార్టీ సలహామేరకు కా. రాఘవులుతో వివాహం జరిగింది.

కా. కల్పన తండ్రి సి.పి.ఐ నాయకుడు కావడంతో ఆమెకు మొదటి నుంచీ కమ్యూనిస్టు రాజకీయ పరిచయం ఉంది. అలాగే ఆమె చిన్నాన్న కూడా విప్లవోద్యమంలో పని చేయడంతో ఆమెలో విప్లవపార్టీలో పని చేయాలనే ఉత్సాహం కలిగింది. విప్లవ మహిళా సంఘం ఇచ్చిన చైతన్యం ఆమెను ఒక విప్లవ కార్యకర్తగా మలిచింది. వివాహం అయిన వెంటనే కా. కల్పన దళ సభ్యురాలుగా బొల్లాపల్లి ఏరియాకు కా. రమణగా చేరుకుంది. అక్కడ దళ జీవితాన్ని ప్రజల జీవన పరిస్థితుల్ని అర్థం చేసుకుని దళ సభ్యురాలుగా నిలదొక్కుకుంది. అదే దళంలో కమిటీ సభ్యురాలుగా, కమాండర్‌గా కూడా ఎదిగింది. కొంతకాలం పాటు సంధ్య పేరుతో గుంటూరు పట్టణంలో మహిళా ఆర్గనైజేషన్ పనుల్లో భాగమయ్యింది.

తర్వాత వెల్దుర్తి దళం బాధ్యతలు స్వీకరించిన కా. రమణ రైతాంగాన్ని అనేక సమస్యలపై కదిలించింది. జిల్లాలో జరిగిన కరువు దాడులు, మిలిటెంట్ చర్యల్లో ఉత్సాహంగా పాల్గొన్నది. అద్దంకి పోలీస్ స్టేషన్‌పై దాడిలో ముఖ్య భూమికను నిర్వహించింది. ఇలా ఉద్యమంలో తన పాత్రను పెంచుకుంటూ 2004లో జిల్లా కమిటీ సభ్యురాలయింది.

శారీరకంగా బలహీనురాలైనా, అనారోగ్య సమస్యలున్నా నిరంతరం ప్రజాసంబంధాలు మెరుగుపరిచే పనిలో శ్రద్ధగా ఉండేది. కేడర్‌తో స్నేహ సంబంధాలు పెంపొందించుకుంటూ వారి అభివృద్ధికి కృషి చేసేది. తన భావాలను, విప్లవోద్యమ పరిస్థితుల్ని ఓపికగా ఇతరులతో పంచుకునేది. తెలియని విషయాలను తెలుసుకోవడానికి, నిలదొక్కుకోవడానికి నిరంతరం తపనపడేది. రాఘవులుకు ఆ ప్రాంతంలో ఎంత గుర్తింపు ఉంటుందో కమాండర్‌గా రమణకూ స్థానిక ఆదివాసీ ప్రజల్లోను దళిత, ఇతర సెక్షన్ల ప్రజల్లోను అంతగా ఆదరణ ఉంటుంది.

రాఘవులుతో తన వైవాహిక జీవితంలో సమస్యలు రాకుండా విప్లవోద్యమానికి, వైవాహిక జీవితానికి వైరుధ్యంరాని విధంగా చూసుకుంది.

2005లో రాయలసీమకు మారి అక్కడ విప్లవోద్యమంలో చందన పేరుతో బాధ్యతలు స్వీకరించింది. అక్కడి పరిస్థితులను అర్థం చేసుకుంటూ ఎదుగుతున్న క్రమంలో ఎర్రశెల కొండ బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరురాలయింది.

జిల్లాస్థాయికి ఎదిగిన సీనియర్ కామ్రేడ్‌ను విప్లవోద్యమం కోల్పోవడం బాధాకరం. 18 సంవత్సరాల సుదీర్ఘ కాలం విప్లవకారిణిగా అవిశ్రాంతంగా పోరాడి ఆదర్శంగా నిలిచిన కా. కల్పన జీవితంలోని పట్టుదలనూ, క్రమశిక్షణనూ విప్లవ ఆదర్శాన్ని మనం స్వీకరించి నేర్చుకోవాలి.

కామ్రేడ్ కల్పన ఆశయాలను కొనసాగించడం ద్వారా ఆమె లేని లోటును తీర్చుకుందాం.

## కామ్రేడ్ విజయలక్ష్మి (శ్యామల)

కామ్రేడ్ శ్యామల(21) సొంతపేరు విజయలక్ష్మి. మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి ఏరియాలో పుట్టింది. చిన్నప్పటి నుండే బండెడు ఇంటిచాకిరీ చేసేది. ఎన్ని పనులు చేసినా ఆమె శ్రమకు గుర్తింపు వుండేది కాదు. ఊహ తెలిసినప్పటి నుండి నల్లదానా, కర్రెదానా అంటూ తిట్లూ, ఈసడింపులు. ఊహ తెలిసినాక ఆ మాటలు మరీ గాయపరిచేవి ఆమెను. ఆడపిల్లలకు రకరకాల వంకలుపెట్టి కట్నం మరింత ఎక్కువ అడిగే ఈ సమాజంలో ఆమెను ఇంట్లో వాళ్లు మోయలేని భారంగా చూసేవాళ్లు. తను నల్లగా వున్నందుకు ఇంట్లో అందరూ తిట్టడం, తన పెండ్లి ఎలా చేయాలోనని సతమతమవటం చూసి నల్లగా పుట్టడం నేరమా? అందమంటే ఏమిటి? మనసుకూ, శ్రమకూ విలువ లేదా అని బాధపడేది.

అట్లా ఘర్షణ పడుతున్న శ్యామలకు విప్లవ మహిళా సంఘం పరిచయం అయింది. దానితో తను పడుతున్న ఘర్షణకూ, బాధకూ పరిష్కారం దొరికిందామెకు. సంఘంలో చురుగ్గా పని చేస్తూ 2002లో దళంలో చేరింది. కొద్ది కాలానికి ఆమె నల్లమల ప్రాంతంలోని ప్రొటెక్షన్ ప్లటూన్‌లో సభ్యురాలైంది. 2004లో ఆమె, కా. సంజీవ్ (ఇటీవలే నల్గొండ జిల్లాలో అమరుడయ్యాడు) జీవిత భాగస్వాములయ్యారు. ఆమె పట్టుదల, ఉద్యమం పట్ల అంకిత భావం, శ్రమించే గుణాన్ని చూసి 2005లో పార్టీ ఆమెను ఏరియా స్థాయి సభ్యురాలిగా గుర్తించింది. అదే ప్లటూన్‌లో వుంటూ నాయకత్వాన్ని రక్షించే కీలకమైన బాధ్యతలో చివరి ఊపిరి వరకూ తన కర్తవ్యాన్ని నిర్వర్తించింది.

2006 జూలై 23న ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం దగ్గర శత్రువు పెద్ద ఎత్తున పథకం పన్ని జరిపిన మూకుమ్మడి దాడిలో శత్రువుతో హోరా హోరిగా పోరాడుతూ కా. మాధవ్ తదితరులతో కా. శ్యామల అమరురాలైంది.

కా. శ్యామల ఆశయానికి ప్రాణమవుదాం. ఆమె అమరత్వాన్ని ఊరూరా గానం చేద్దాం.

## కామ్రేడ్ రజిత (సుశీల)



కామ్రేడ్ రజిత పాలమూరు జిల్లాలోని పాలెం గ్రామంలో 1974లో పుట్టింది. ఆమెకు ముగ్గురు అన్నదమ్ములు. ఒక చెల్లి. వారిది పేద కుటుంబం. వూళ్లోని సర్కార్ బళ్లో 10వ తరగతి వరకూ చదివిన తర్వాత రజిత వాళ్ల కుటుంబం బతుకుదెరువుకని హైదరాబాద్‌కు వెళ్లింది. ఆడపిల్లలకు చదువెందుకని ఇంట్లో ఎన్ని అభ్యంతరాలు పెట్టినా కష్టపడి చదివి డిగ్రీలో చేరింది. ఆడపిల్లగా తానెదుర్కుంటున్న వివక్ష, లైంగిక వేధింపులు ఆమెను మహిళల జీవితం గురించి బాగా ఆలోచింప చేసినాయి. అదే సమయంలో ఆమెకు కాలేజీలో మహిళా చేతన అనే మహిళా సంఘం పరిచయం అయింది. ఆ పరిచయం వల్ల తనలాగా బాధలు పడుతున్న మహిళలు ఎందరో వున్నారని అర్థం చేసుకుంది. ఆ బాధలు పోవాలంటే మహిళలు సంఘటిత పోరాటం చేయాలని తెలుసుకొని ఆ మహిళా సంఘంలో చేరి చురుకైన కార్యకర్తగా మారింది. తన చెల్లిని కూడా మహిళా సంఘం కార్యకర్తగా మార్చింది. దాదాపు ఎనిమిదేళ్ల పాటు జంటనగరాల్లో

మహిళా చేతన ఆధ్వర్యంలో జరిగిన ప్రతి పోరాటంలో ముందుంది. సంక్షేమ పథకాల అమలు కోసం, బెంగుళూరులో జరిగిన ప్రపంచసుందరి పోటీలను వ్యతిరేకిస్తూ, విద్యార్థుల, బస్తీ మహిళల సమస్యల పరిష్కారానికై, మహిళా జన్మభూమిని వ్యతిరేకిస్తూ, వరద బాధితులకు సంఘీభావంగా......ఇట్లా ఎన్నో పోరాటాల్లో చురుకైన పాత్రను వహించింది. ఈ పోరాటాల్లో భాగంగా ఎన్నోసార్లు అరెస్టయింది. ఒకసారి జైలుకు కూడ వెళ్లింది. ఇట్లా పోరాటాల్లో చురుకైన పాత్రను వహిస్తూనే కరాటే నేర్చుకుంది. శారీరక దారుఢ్యం ఆడపిల్లలకు ఆత్మస్థైర్యాన్నిస్తుందని నమ్మింది. ఆ తర్వాత కరాటే ఇన్‌స్ట్రక్టర్‌గా మారి ఎందరో అమ్మాయిలకు తాను నేర్చుకున్న విద్యను ఉచితంగా నేర్పింది.

మహిళా సంఘంలో పని చేయడం, కరాటే నేర్చుకోవడం, దానికి తోడు తల్లిదండ్రులు చేస్తామన్న పెళ్లికి తలవంచకపోవడంతో ఇంట్లో రజితను తిట్టడం, కొట్టడం మొదలైంది. దాంతో అప్పటికే ఒక నర్సింగ్ హోంలో రిసెప్షనిస్టుగా పని చేస్తున్న రజిత ఇల్లు వదిలి బయటకు వచ్చింది. ఆమె దారిని ఆమె చెల్లి కూడా అనుసరించింది.

అట్లా యింటా బయటా పోరాటమే జీవితంగా బతికిన కా. రజిత మహిళా విముక్తి సమస్య పరిష్కారానికి సాయుధ పోరాటమే ఏకైక మార్గమని అర్థం చేసుకుంది. దానితో ఎటువంటి శషభిషలూ లేకుండా 2003లో మావోయిస్టు పార్టీ ఆధ్వర్యంలో సాగుతున్న సాయుధ పోరాటంలో చేరింది. మొదట నల్లమల డివిజన్‌లోని పాలవంక ఏరియా పరిధిలో ఆమె పని చేసింది. నగర జీవితం నుండి వచ్చినప్పటికీ కష్టభరితమైన నల్లమల కొండల్లో ఆమె పట్టుదలగా నడిచింది. చెంచులతో స్నేహం చేసింది. వాళ్లు పెట్టిన బండకారం, నూకలన్నాన్నే పరిమాన్నంలాగా తిన్నది. వాళ్లను సంఘటితం చేయడానికి శాయశక్తులా కృషి చేసింది. ఆ తర్వాత ప్రొటెక్షన్ ప్లటూన్ సభ్యురాలైంది. అందులో భాగంగా బరువులెత్తుకొని కొండలు గుట్టలెక్కుతూ గంటల తరబడి అలుపెరుగకుండా నడిచింది. ప్రతిఘటనలో భాగం కావడానికి ఆమె ఎప్పుడూ ఉత్సాహం చూపేది. పలు ఆంబుష్‌ల్లో భాగం పంచుకుంది.

అంత కష్టభరిత జీవితంలోనూ కా. రజిత ఒక్కరోజు కూడా తప్పకుండా ఎక్సర్‌సైజ్ చేసేది. క్షణం వృధా చేయకుండా చదువు మీద శ్రద్ధ పెట్టేది. సహచరుల నుండీ నాయకత్వం నుండీ కొత్త విషయాలు తెల్సుకోవాలని ఎప్పుడూ ఆరాటపడుతుండేది.

మరింతగా అభివృద్ధి అయి ఉద్యమానికి ఎంతగానో ఉపయోగపడవల్సిన సమయంలో 2006 జూలై 23న ఎర్రగొండపాలెం వద్ద జరిగిన శత్రు పాశవిక దాడిలో ఎ.పి రాష్ట్ర కార్యదర్శి కా. మాధవ్ తదితరులతో కా. రజిత అమరురాలయింది.

కామ్రేడ్ రజితలోని దృఢ సంకల్పాన్ని ఆదర్శంగా తీసుకుందాం.

## కామ్రేడ్ ఆత్రం హనుమంతరావు (కరణ్)

ఆదిలాబాద్ జిల్లా కెరిమేరి మండలం సాకడ గ్రామంలో పేద ఆదివాసీ కుటుంబంలో కా. కరణ్ పుట్టాడు. ఎస్.టి హాస్టల్‌లో వుంటూ ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. అదే కాలంలో అతనికి పార్టీతో పరిచయం అయింది.

కా. కరణ్ 2001 మధ్యలో దళంలోకి రిక్రూట్ అయినాడు. ఇంద్రవెల్లి ఏరియాలో గెరిల్లా జీవితం ప్రారంభించాడు. నిర్బంధం మధ్యనే ఆదివాసీ గూడాలకు పోయి పనులు చాకచక్యంగా చేసుకు వచ్చేవాడు.

చంద్రబాబు హయాంలో 2001లో కడెం మండలం గంగపూర్ గ్రామంలో ఇన్‌ఫార్మర్‌ను శిక్షించడానికి దళం పోయినపుడు విప్లవ వ్యతిరేకులు పోలీసుల ప్రోద్బలంతో ఆర్గనైజ్ అయి దళం మీద దాడి చేసారు. ఆ దాడిని కా. కరణ్ ప్రతిఘటిస్తూ అక్కడి నుండి రిట్రీట్ అయినాడు. ఈ దాడిలో తన చేతికి గాయం అయింది. అయినప్పటికీ ధైర్యంగా వుంటూ, మనోనిబ్బరంతో తిరిగి ఏనాటికయినా వారిని శిక్షించాలనే వర్గ కసిని వ్యక్తం చేసేవాడు.

తన చైతన్యాన్ని పెంచుకుంటూ 2002లో పార్టీ సభ్యుడు అయినాడు. 2003లో ఎ.సి సభ్యుడు అయినాడు. ఆ తర్వాత 2004 జూన్‌లో మంగి ఏరియా మిలీషియా కమాండర్ అయినాడు. 2004 డిసెంబర్‌లో నార్నూర్ ఎల్.ఓ.ఎస్ కమాండర్ అయినాడు. 2005 అక్టోబర్‌లో తిరిగి మిలీషియా కమాండర్ అయినాడు.

చర్చల కాలంలో మిలీషియా కమాండర్‌గా చొరవతోటి పని చేస్తూ నిర్బంధంలో దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరిస్తూ ముందుకు వచ్చిన యువతనందరిని మిలీషియా యూనిట్లలోకి సమీకరించాడు. కా. కరణ్ దృఢంగా నిలబడి ఇతర కామ్రేడ్స్‌ను కూడ నిలబెట్టాడు.

2006 ఏప్రిల్ మొదటి వారంలో కా. కరణ్ తమ స్వగ్రామం అయిన సాకడలో జరిగిన ఎన్‌కౌంటర్లో అమరుడయ్యాడు.

★

# దండకారణ్య ప్రజల ప్రియతమ నాయకుడు, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు
# కామ్రేడ్ వికాస్ (ఊరడి శ్రీనివాస్)కు అరుణారుణ వందనాలు

2006 సెప్టెంబర్ 16, దండకారణ్య విప్లవ ప్రజానీకాన్ని శోకంలో ముంచిన దినం. ఆ రోజు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడూ, గడ్చిరోలి డివిజనల్ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ వికాస్ (శ్రీనివాస్)ను పోలీసులు పట్టుకొని, చిత్రహింసలు పెట్టి, బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేశారు. పార్టీకి సంబంధించిన ముఖ్యమైన పని మీద కామ్రేడ్ వికాస్ మరొక కామ్రేడ్‌తో కలిసి మాన్‌పూర్ డివిజన్‌లో సోన్‌దాయి గ్రామం నుంచి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా శత్రు చేతికి చిక్కాడు. ద్రోహి ద్వారా నమ్మకంగా అందిన సమాచారంతో కాంకేర్ జిల్లా ఎస్.పి ప్రదీప్‌గుప్తా, 60 మంది పోలీసులతో కా. వికాస్‌ను చుట్టుముట్టి పట్టుకున్నాడు. కా. వికాస్‌తో పాటు వున్న మరొక కామ్రేడ్ పోలీసులను ఏమార్చి తప్పించుకోగా, వికాస్‌కు ఆ అవకాశం చిక్కలేదు. కా. వికాస్‌ను ఉదయం 7.30 గంటలకు పట్టుకుని, సాయంత్రం 4 గంటల వరకు క్రూరంగా చిత్రహింసలు పెట్టారు. కానీ, అతని నుంచి వీసమెత్తు సమాచారం కూడా రాబట్టలేక ఓడిపోయిన శత్రువు వికాస్‌ను హత్యచేసి, ఎప్పటిమాదిరిగానే ఎన్‌కౌంటర్ కట్టు కథనల్లాడు.



45 సంవత్సరాల కామ్రేడ్ వికాస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వరంగల్ జిల్లా, జనగాం మండలం నిడిగొండ గ్రామంలో పేద కుటుంబంలో పుట్టాడు. సొంతపేరు ఊరడి శ్రీనివాస్. ఆయన స్వగ్రామం 1940లలో ఉవ్వెత్తున లేచిన సాయుధ తెలంగాణా పోరాటంలో దృఢంగా నిలబడిన గ్రామం. బాల్యం నుంచి తెలంగాణ వీరగాథలను ఒంటపట్టించుకుని ఎంతో స్ఫూర్తి పొందాడు. పెద్దవాడౌతున్న క్రమంలో ఆ చుట్టుపక్కల కరీంనగర్, ఆదిలాబాద్ రైతాంగ పోరాటాలు వికాస్‌పై చాలా ప్రభావాన్ని వేశాయి. 10వ తరగతి వరకు రఘునాధపల్లిలో, ఇంటర్మీడియట్ వరకు జనగాం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదివాడు. చదువు ముగించి ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లిన శ్రీనివాస్ కామ్రేడ్ ప్రసాద్‌రావు పరిచయంతో విప్లవ రాజకీయాలు నేర్చుకున్నాడు. (కా. ప్రసాదరావు హైదరాబాద్‌లో రాడికల్ విద్యార్థి సంఘ నాయకుడుగా పని చేసి, తర్వాత తూర్పు గోదావరి జిల్లా ఆదివాసీ ప్రాంతంలో ఒక దళానికి కమాండర్ పని చేసే క్రమంలో 1989లో జరిగిన ఎన్‌కౌంటర్లో అమరుడయ్యాడు). కా. ప్రసాద్‌రావుతో 1989లో నిజాం కాలేజి గ్రౌండ్‌లో అఖిల భారత విప్లవ విద్యార్థి సమాఖ్య (ఎ.ఐ.ఆర్.ఎస్.ఎఫ్) మహాసభలకు హాజరయ్యాడు. ఆ ప్రేరణతో భారత విప్లవోద్యమానికి తన జీవితాన్ని అంకితం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఆ తర్వాత పార్టీ నిర్ణయం మేరకు దండకారణ్యం ఆదివాసీ ప్రాంతంలో పని చేయడానికి వెళ్ళాడు. 1980లో దండకారణ్యంలో గడ్చిరోలి జిల్లా (మహారాష్ట్ర)లో కా. పెద్ది శంకర్ రక్తాన్ని చిందించి విప్లవ విత్తనాలు చల్లాడు. 1985 నాటికి సిరొంచ, అహిరి, ఏటపల్లి ఏరియాలకు ఉద్యమం విస్తరించింది. 1984లో కమలాపూర్‌లో జరప తలపెట్టిన ఆదివాసీ రైతుకూలీ సంఘ మహాసభను మహారాష్ట్ర పోలీసులు జరగకుండా భగ్నం చేశారు. వందలాది రైతాంగాన్ని, యువకుల్ని అరెస్టులు చేశారు. అహిరి జమిందారు విశ్వేశ్వరరావు విప్లవోద్యమానికి వ్యతిరేకిగా తయారయ్యాడు. కమలాపూర్‌లో రైతుకూలీ మహాసభలను అడ్డుకున్నప్పటికీ, పార్టీ నాయకత్వంలో ప్రజలు అక్కడ విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవడంలో దృఢంగా నిలబడ్డారు. ఆ సమయంలో కా. శ్రీనివాస్, శివన్న పేరుతో అక్కడ దళ సభ్యుడిగా ఆదివాసీ ప్రజల్లో పని ప్రారంభించాడు.

అడవి, ఆదివాసుల సంస్కృతి, భాష, తిండి అన్నీ కొత్త అయినప్పటికీ క్రమంగా వాటికి అలవాటు పడిపోయాడు. ప్రభుత్వ నిర్బంధ క్యాంపెయిన్, విశ్వేశ్వరరావు దుష్ప్రచార క్యాంపెయిన్ లాంటి సమస్యల్ని ఎదుర్కొంటూ దృఢంగా ముందుకుసాగాడు. ఇంతటి నిర్బంధంలో కూడా ప్రజలతో సజీవ సంబంధాలు కొనసాగిస్తూ రథసారధిగా విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి కృషి చేశాడు. ఆ సమయంలో డివిజనల్ కమిటీ సభ్యుడు పోరెడ్డి వెంకటరెడ్డి మితవాద పంథానవలంబించి జిల్లా కమిటీలో సంక్షోభం సృష్టించాడు. ఇటువంటి సంకట పరిస్థితుల్లో కూడా కా. శివన్న పార్టీ పంథాను దృఢంగా నిలబెట్టాడు. తోటి కామ్రేడ్స్ గెరిల్లా జీవితంలో నిలబడలేక దిగజారిపోయినప్పటికీ కా. శివన్న కఠోరమైన విప్లవోద్యమ జీవితంలో దృఢంగా నిలబడ్డాడు.

మొదటి నుండీ బలహీనంగా వుండే శివన్నకు గెరిల్లా జీవితంలోని సరైన తిండి, నిద్రలేని పరిస్థితుల వల్ల 1987లో

టి.బి వ్యాధి వచ్చింది. అనారోగ్యం నుంచి కోలుకుని పెరిమిలి గెరిల్లా దళానికి డిప్యూటీ కమాండర్ బాధ్యతలు చేపట్టాడు. మొదటి నుండీ ఆ ప్రాంతంలో కూడా జమిందారు అనుచరుల ఆధిపత్యం కొనసాగుతుండేది. వాళ్ళు పెట్టే బాధల్ని ఎదుర్కొని, పెత్తందారుల ఆధిపత్యాన్ని ఎదిరించడానికి శివన్న ప్రజల్ని సంఘటితం చేశాడు. దళ డిప్యూటీ కమాండర్ బాధ్యతలు నిర్వహిస్తూనే, కొరియర్ బాధ్యతలు కూడా నెరవేర్చాడు. 1989లో ఒక టేకేదార్ ఇచ్చిన సమాచారంతో కా. శివన్న అరెస్టయ్యాడు. రెండు సంవత్సరాలు జైలులో నరకయాతనలు అనుభవిస్తూ కూడా విప్లవ కర్తవ్యం కోసం దృఢంగా నిలిచాడు. కా. శివన్నను విడిపించడానికి కుటుంబమూ, పార్టీ చట్టబద్ధంగా చేసిన ప్రయత్నాలేవీ ఫలించక పోవటంతో, పార్టీ ఆ దళ ఏరియాకు సంబంధించిన ఎం.ఎల్.ఏ ధర్మారావు ఆత్రంను కిడ్నాప్ చేసి, శివన్నను విడుదల చేయాలనే షరతు విధించింది. 14 రోజుల తర్వాత ప్రభుత్వం కా. శివన్నను విడుదల చేసింది. విడుదలైన తర్వాత కా. శివన్న 'వికాస్' పేరుతో అహిరి దళ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు.

అప్పటి నుండి గడ్చిరోలి డివిజన్లో పోలీసు నిర్బంధం తీవ్రమైంది. బూటకపు ఎన్‌కౌంటర్లలో డజన్లకొద్దీ ఆదివాసీ యువకుల్ని చంపటం, 'టాడా' నల్ల చట్టం కింద వందలాది ఆదివాసీలను అరెస్ట్ చేసి జైళ్లలో కుక్కటం తీవ్రమైంది. ఆదివాసీ యువకుల్ని పోలీసు బలగాల్లోకి పెద్దయెత్తున భర్తీచేసి, సి-60 పేరుతో కమాండో బలగాలను తయారుచేసి, ఆ ప్రభుత్వం ఆదివాసులపై, పార్టీపై యుద్ధాన్ని ప్రకటించింది. ఈ విధంగా తయారుచేసిన బలగాలు ఆదివాసీ రైతుల్ని మాయం చేసి, హత్య చేయటం మొదలుపెట్టాయి. 1993లో మంగేరుఝరీలో 14 మంది ఆదివాసీ రైతుల్ని ఒకేసారి హత్య చేశారు. ఇటువంటి ఫాసిస్టు దాడులతో ప్రజల్ని భయభ్రాంతుల్ని చేశారు. రైతాంగాన్నీ, కార్యకర్తల్ని ప్రజా సంఘాల్లో పని చేయకుండా తీవ్రంగా భయపెట్టారు. ప్రతి గ్రామానా పోలీసు సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. గ్రామాల్లో పోలీసులు మకాం వేసి రైతుల్ని నానాయాతనలు పెట్టడం ప్రారంభించారు. ఆ సమయంలో ప్రజలు మనోధైర్యాన్ని కోల్పోయారు. గెరిల్లా దళాలకు తిండి దొరకటం కూడా కష్టమైంది. అటువంటి గడ్డు పరిస్థితుల్లో ప్రజల్ని అంటిపెట్టుకుని వుంటూనే, శత్రు దాడిని తిప్పికొట్టి, సరైన ఆత్మరక్షణా ఎత్తుగడల్ని చేపట్టడంలో కా. వికాస్ ముందు నిలిచాడు. డివిజన్‌లో కోసుఫూండ్రీ, భీమన్‌కొజ్జి, మంగేరుఝరీ, కిష్టాపూర్ గ్రామాల్లో శత్రువుపై ఆంబుష్ చేసి డజన్లకొద్దీ పోలీసుల్ని మట్టుబెట్టి, తుపాకులు స్వాధీనం చేసుకోవడంలో చొరవ చూపాడు. గెరిల్లా బలగాల చొరవతో క్రమంగా పరిస్థితి ప్రజా సైన్యం చేతిలోకి వచ్చింది. దీని తర్వాత, 1995లో గడ్చిరోలి డివిజన్ పార్టీ రెండవ మహాసభ విజయవంతమైంది. ఈ మహాసభలో కా. వికాస్ డివిజనల్ కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యాడు. ఆ తర్వాత ప్రత్యేక సైనిక చర్యల కొరకు దండకారణ్యంలో మొట్ట మొదటగా ఏర్పాటు చేసిన ప్లాటూన్లలో ఒక ప్లాటూన్‌కు కమాండర్‌గా కా. వికాస్ బాధ్యతలు స్వీకరించి, సమర్థవంతమైన కమాండర్‌గా ఎదిగాడు. 1996లో రాజనంద్‌గావ్ జిల్లా, మాన్‌పూర్ పోలీసు స్టేషన్‌పై జరిగిన రెయిడ్‌లో కా. వికాస్ పాల్గొన్నాడు. ఈ దాడిలో 32 ఆయుధాలు స్వాధీనమయ్యాయి. ఆ తర్వాత 1997లో గడ్చిరోలిలోని కండీ అనే గ్రామం దగ్గర శత్రువుపై జరిపిన ఆంబుష్‌లో కా. వికాస్ పాల్గొన్నాడు. ఈ దాడిలో ఆలం పాండు అనే క్రూరమైన ఎస్.ఐతో సహా ఐదుగురు కమాండోలు చచ్చారు. 1998 ఆగస్టులో గోడ్సూరు గ్రామం దగ్గర కాలినడకన గస్తీకి వచ్చిన పోలీసులపై జరిపిన ఆంబుష్‌కు కా. వికాస్ నాయకత్వం వహించాడు. ఈ దాడిలో ఐదుగురు పోలీసులు చావగా, 4 ఎస్.ఎల్.ఆర్ తుపాకులు గెరిల్లాల స్వాధీనమయ్యాయి.

2000 సంవత్సరంలో అప్పటి గడ్చిరోలి డివిజనల్ కార్యదర్శి కరణ్ శత్రువు ముందు లొంగిపోయాడు. అంతకు కొద్దినెలల ముందు జిల్లా కమిటీ సభ్యుడు కా. విక్రం శత్రువుతో పోరాడుతూ అమరుడయ్యాడు. ఈ కష్టతరమైన స్థితిలో డివిజనల్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన, కా. వికాస్ నేతృత్వంలో ఉద్యమం పురోగమించింది. అదే సంవత్సరం డిసెంబర్‌లో జరిగిన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ 3వ మహాసభలో ఎస్.జడ్.సి ప్రత్యామ్నాయ సభ్యుడిగా ఎన్నికయ్యాడు.

2001లో జరిగిన అప్పటి పీపుల్స్‌వార్ పార్టీ 9వ కాంగ్రెస్ దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా మార్చాలనే గొప్ప కర్తవ్యాన్ని పార్టీ ముందుంచింది. ఈ కర్తవ్యాన్ని ముందుకు తీసుకుపోవడంలో భాగంగా శత్రు బలగాల్ని దెబ్బతీసే ఎత్తుగడల ప్రతిఘటనా క్యాంపెయిన్‌ను పార్టీ చేపట్టింది. ఈ క్యాంపెయిన్‌ను సఫలీకృతం చేయటంలో భాగంగా కా. వికాస్ అనేక ప్రతిఘటనా దాడుల్లో పాల్గొన్నాడు. కొన్ని దాడుల్లో పి.ఎల్.జి.ఎ బలగాలకు కా. వికాస్ నేరుగా నాయకత్వం వహించాడు. ఈ క్రమంలో 2002లో డి.కె ఎస్.జడ్.సి సభ్యునిగా ఎన్నికయ్యాడు.

కా. వికాస్ జీవన విధానంలోనూ, ప్రతి పనిలోనూ కార్మికవర్గ దృష్టి కోణం కలిగి వుండేవాడు. మావో చెప్పిన సాదాసీదా జీవన శైలిని అక్షరాలా పాటించేవాడు. పార్టీ ఆదేశాన్ని తు.చ తప్పక పాటించేవాడు. తన లోపాలను దాచుకోకుండా స్వయం

విమర్శనాపూర్వకంగా బయటపెట్టేవాడు. ఎదుటి కామ్రేడ్స్ లోపాలను గురించి కూడా సూటిగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసేవాడు. ఎదుటి కామ్రేడ్స్‌ను ఎప్పుడు కూడా బాధపెట్టేవాడు కాదు. అందరితో కలుపుగోలుగా వుండేవాడు. ఈ కారణం చేత కా. వికాస్ అందరి ప్రేమాభిమానాలు సంపాదించాడు. పార్టీ అప్పగించిన పనులను చిన్నదైనా పెద్దదైనా బాధ్యతాయుతంగా నెరవేర్చేవాడు. పెటీబూర్జువా వ్యక్తివాద ధోరణులను గట్టిగా వ్యతిరేకించేవాడు. పార్టీ ప్రయోజనాలకంటే, తన ప్రయోజనాలకు ఎప్పుడూ ప్రాధాన్యతను ఇచ్చేవాడు కాదు. ఆహార వ్యవహారాల్లో చాలా సాదాసీదాగా వుండేవాడు. తన 23 సంవత్సరాల పార్టీ జీవితంలో ఒక్కసారి కూడా కుటుంబాన్ని చూడటానికి వెళ్ళలేదు.

నేడు దండకారణ్య విప్లవోద్యమం కఠినమైన పరిస్థితుల్ని ఎదుర్కొంటూనే, విముక్తి ప్రాంతంగా మార్చే ముఖ్య కరవ్యాన్ని చేపట్టింది. గత 6 సంవత్సరాల ఆచరణను సమీక్షించి ఉన్నతమైన కర్తవ్య నిర్వహణ కోసం 2006 సెప్టెంబర్‌లో దండకారణ్య పార్టీ 4వ మహాసభను జరుపుకుంది. ఈ మహాసభకు ఎస్.జడ్.సి సభ్యుడు కా. వికాస్‌తోపాటు పి.ఎల్.జి.ఎ కమాండర్లు కూడా ప్రతినిధులుగా హాజరుకావలసి వుంది. మహాసభ ఏర్పాట్లు జరుగుతుండగా, ఇంతలో కా. వికాస్ అమరుడైన వార్తను సెప్టెంబర్ 17న రేడియోలో విన్న క్యాంపంతా ఒక్కసారి బాధతో స్తంభించిపోయింది. మహాసభకు హాజరైన కామ్రేడ్స్ అంతా కా. వికాస్ అమరత్వానికి కన్నీటి నివాళులర్పించి, ఆయన కన్న కలల్ని నిజం చేయడానికి సంసిద్ధులయ్యారు. సెప్టెంబర్ 23 నుండి అక్టోబర్ 7వ తేదీ వరకు జరిగిన మహాసభలో కా. వికాస్‌తో పాటు అమరులైన వేలాది భారత విప్లవ వీరుల రక్తంతో ఎరుపెక్కిన అరుణపతాకాన్ని సమున్నతంగా ఎత్తిపట్టి, వారి ఆశయ సాధనకై శపథం చేశారు.

### కామ్రేడ్ వికాస్ అమర్ రహే!

కా. వికాస్ అమరుడైన వార్త విని గడ్చిరోలి డివిజన్‌లోని ప్రజలు, సంఘ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థి సంఘాలూ, బాలల సంఘాలూ, భూంకాల్ మిలీషియా, జన మిలీషియా, పి.ఎల్.జి.ఎ సభ్యులూ, పార్టీ సభ్యులూ అందరూ శోకతప్తులయ్యారు. ఆయన అమరత్వానికి స్పందనగా సెప్టెంబర్ 30న పార్టీ గడ్చిరోలి జిల్లా బంద్‌కు పిలుపునిచ్చింది. టిప్పాగఢ్, భామ్రాగఢ్, పెరిమిలి, అహిరి, చాంద్‌గావ్, కసన్‌సూర్ ఏరియా కమిటీలలోని అన్ని గ్రామాల ప్రజలు కా. వికాస్ సంస్మరణ సభలు జరిపి తమ ప్రియతమ నేతకు శ్రద్ధాంజలి ఘటించారు. గడ్చిరోలి ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయే లక్ష్యంతో అన్ని గ్రామాల ప్రజలు సంస్మరణ సభలు నిర్వహించారు. కా. వికాస్‌ను క్రూరంగా హత్య చేయడంతో ఖిన్నులైన గడ్చిరోలి ప్రజలు, ఇందుకు వ్యతిరేకంగా 7 రోజులు బంద్ పాటించారు. కోట్‌గుల్ నుంచి గడ్చిరోలి, కొర్చీ నుంచి మాలేవాడ వెళ్ళే ప్రధాన రహదారులపై 8 చోట్ల రోడ్లు ధ్వంసం చేసి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించారు. ఇప్పటి వరకూ జరిగిన బంద్‌లన్నింటిలోకి ఇదే పెద్ద బంద్ అని వివిధ దిన పత్రికలు కథనాలు రాశాయి.

★

## అమరవీరుల సంస్మరణ సభలు

ఖమ్మం జిల్లా అశ్వారావుపేట ఏరియా, కుక్కునూర్ ఎల్.ఒ.ఎస్ పరిధిలో రెడ్డిగూడెం గ్రామంలో ప్రజలు 2006, జూలై 28 సందర్భంగా అమరుల సంస్మరణ సభను జరుపుకున్నారు. అమరుల చరిత్రలను వివరిస్తూ, వారి ఆశయాలను కొనియాడుతూ, పాలకవర్గాల అణచివేత, పోలీసులు చేస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్లు, ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను ఎండగడుతూ, అంతిమ లక్ష్యం కోసం పోరాడాలని పిలుపునిస్తూ ఈ సభలో వక్తలు మాట్లాడారు. సభకు స్త్రీ, పురుషులు కలిసి దాదాపు 200 మంది హాజరు అయినారు.

ఇదే ఎల్.ఒ.సి పరిధిలో కట్కూర్ గ్రామంలో అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఈ మధ్యలో అమరులైన కామ్రేడ్స్‌ను మొత్తం పార్టీలో అమరులైన కామ్రేడ్స్‌ను స్మరించుకుంటూ, వారి పోరాట పటిమను కొనియాడుతూ, ప్రభుత్వ బూటకత్వాన్ని ఎండగడుతూ ఈ సభలో వక్తలు మాట్లాడారు. ఈ సభకు 250 మంది ప్రజలు హాజరు అయినారు.

ఈ సభలే కాక కుక్కునూర్ మండలంలోని ఉప్పేరు, దామోరచర్ల, ఎల్లప్పగూడెం, సిరవెల్లి, మాదారం, రెడ్డిగూడెం, పుల్లప్పగూడెం, ములకనపల్లి మండలంలోని తిమ్మంపేట దాని చుట్టూ వున్న గ్రామాలలో జగన్నాధాపురం గ్రామ పంచాయితిలోని అయిదు గ్రామాలలో, అశ్వారావుపేట మండలంలోని ఆన్‌పాక, రెడ్డిగూడెం, తిరుమలకుంట, కట్కూరు, నారాయణపురం సెంటర్లలో పోస్టర్లు, బ్యానర్లు కట్టి విప్లవ ప్రజలు అమరుల సంస్మరణ వారాన్ని ప్రచారం చేశారు.

★

# ఇజ్రాయిలీ జియోనిస్టుల నెత్తురు కళ్ల చూస్తున్న లెబనాన్

గాజాను వినాశనం చేసిన తరువాత ఇజ్రాయిలీ లూటీదారులు ఇప్పుడు లెబనాన్ మీద విషం కురిపిస్తున్నారు. హిజుబుల్లా ఇద్దరు ఇజ్రాయిలీ సైనికులను బందీలుగా పట్టుకున్న జులై 12వ తేదీ సంఘటన తరువాత ఈ నెల రోజుల కాలంలో లెబనాన్‌ను నాశనం చేసారు. లెబనాన్‌లో నాలుగింట ఒక వంతు ప్రజలు నిరాశ్రయులయ్యారు. 845 మందిని హత్య చేసారు. ఇందులో 743 మంది పౌరులు. 4 వేల మందిని గాయపరిచారు. లెబనాన్ జనాభా కేవలం 35 లక్షలు. ఈ వినాశనం వల్ల సుమారు 45 వేల కోట్ల రూపాయల నష్టం కలిగింది. 15 వేల ఇళ్ళు ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం 75 శాతానికి పైగా జనాభాకి ఉద్యోగాలు లేవు.

గతంలో ఇదే లూటీదారులు గాజాను వినాశనం చేసారు. 26 మంది హమస్ పార్లమెంటేరియన్‌లను కిడ్నాప్ చేసారు కూడా. జూన్‌లో ఇజ్రాయిలీలు బాంబింగులో 50 మంది పాలస్తీనీయులను చంపి, 200 మందిని గాయపరిచారు. ఇద్దరు ఇజ్రాయిలీ సైనికులను బందీలుగా పట్టుకున్న ఘటనను సాకు చేసుకుని ఇజ్రాయిలీ గాజా మీద 'ఆపరేషన్ డిఫెన్స్ షీల్డ్' చేపట్టింది. 2002 తరువాత పాలస్తీనీయుల మీద చేపట్టిన అతి పెద్ద సైనిక ఆపరేషన్ ఇది.

ఇజ్రాయిల్ గాజా నుంచి ఉపసంహరించుకున్న తరువాత ఆ భూభాగం మీద సుమారు 9 వేల ఆర్టిల్లరీ షెల్స్ వేసింది. ఉపసంహరణకు ముందుగానే ఈ పథకం పన్నారు. గాజాలో ఉన్న ఏకైక విద్యుత్తు ప్లాంటు 15 లక్షల మంది ప్రజలకు విద్యుత్తు సరఫరా చేస్తుంది. ఇది ఇజ్రాయిల్ మొదటి రోజు చేసిన దాడిలోనే నాశనమయింది. 'అత్యంత మంచి కాలంలో' గాజా ఏమీ లేని నగరమయింది. గాజా ప్రపంచంలోనే అతి తక్కువ జనాభా ఉన్న ప్రాంతం. జూన్ ఆఖరి వారం నుంచీ గాజాలో విద్యుత్తు కానీ నీళ్లు కానీ లేవు. ఆస్పత్రులు, ఇతర అత్యవసర సేవలూ నిలిపివేసారు. శుభ్రత లేకపోవడంతో ప్రజారోగ్యం దెబ్బతిన్నది. మురికి కాలవలు అనేక వీధులను ముంచేసాయి. దాదాపు రోజంతా జరిగే సైనిక దాడులు, దీనికి తోడు గాజా వీధులలో తిరుగాడే ఇజ్రాయిలీ టాంకులు ప్రజలను, ముఖ్యంగా బాలలను భీతావహులను చేసాయి. పాలస్తీనాలో ఎన్నికయిన ప్రభుత్వంలో సగం మందిని ఇజ్రాయిల్ రాజ్యం కిడ్నాప్ చేసింది. హమస్ ఎన్నికయిన నాటి నుంచీ ఈయూ పాలస్తీనాకు సమస్త సహాయమూ నిలిపివేసింది. నిజానికి ఈ సహాయంలో చాలా వరకూ దాని మనుగడకు అవసరం.

గడచిన దశాబ్దంలో లెబనాన్ 1980ల యుద్ధ వినాశనం నుంచీ బాధాకరంగా ఆవిర్భవించింది. 1980లలో ఇజ్రాయిలీ ఆక్రమణ ఫలితంగా లక్ష మందికి పైగా లెబనీయులు అంతరించిపోయారు. అయితే ఇప్పుడు ఇంతకు ముందు మాదిరిగా లెబనాన్ ప్రజలు అంత తేలికగా లొంగడంలేదు. ఇజ్రాయిలీలను గట్టి దెబ్బ తీస్తున్నారు. ఈ సమరంలో వాళ్లు 158 మంది ఇజ్రాయిలీలను చంపారు. వీరిలో 119 మంది సైన్యానికి చెందిన వాళ్లు.

హిజుబుల్లా (దేవుని పార్టీ) ఇస్లామీయ సంస్థే అయినప్పటికీ ఇజ్రాయిలీ దురాక్రమణకు వ్యతిరేకంగా జాతీయ శక్తిగా అవతరించింది. లెబనాన్ మీద పదే పదే జరుగుతున్న దురాక్రమణే హిజుబుల్లా ఆవిర్భావానికి దారి తీసింది. 1958లో అమెరికా పదాతిదళాలు లెబనాన్‌లో అడుగు పెట్టాయి. ఇజ్రాయిల్ 1978లో ఒకసారి 1982లో ఒకసారి దురాక్రమించింది. 1978లో మొదటిసారిగా ఇజ్రాయిల్ దక్షిణ లెబనాన్‌లో షియాల ఆధిపత్యంలో ఉన్న భూభాగంలో ఇజ్రాయిల్ సిరియాలు లెబనాన్‌కు కలిసే షెబ్బా క్షేత్రాల ప్రాంతం మినహా పెద్ద భాగాన్ని ఆక్రమించింది. హిజుబుల్లా దీనికి ముగింపు చెప్పే వరకూ ఇది కొనసాగింది. 1982లో ఇజ్రాయిల్ దండయాత్ర చేసి లెబనాన్‌లో దాదాపు సగం వరకూ ఆక్రమించి, బీరుట్‌ను చాలా వరకూ ధ్వంసం చేసిన నాలుగు సంవత్సరాల తరువాత హిజుబుల్లా ఉనికిలోకి వచ్చింది. ఇజ్రాయిలీలను యావత్తు లెబనాన్ నుంచీ తరిమివేసిన తరువాత అది లెబనాన్ రాజకీయాలలోకి ఒక పార్టీగా ప్రవేశించింది. ఇప్పుడు పార్లమెంటులో 12 మంది సభ్యులున్నారు. ఇద్దరు మంత్రిమండలిలో ఉన్నారు. దాని అభ్యర్థుల పట్టికలో షియాలేకాక క్రైస్తవులు, డ్రూజ్‌లూ కూడా ఉన్నారు. హిజుబుల్లా ఎన్నడూ ఒంటెత్తు శక్తిగా లేదు. అన్ని సెక్షన్‌లలో పేరు సంపాదించుకుంది. ఒక అధ్యయనం ప్రకారం హిజుబుల్లాలో ఆత్మాహుతి బాంబులుగా మారిన 41 మందిలో 8 మంది ఇస్లామీయులు కాగా 27 మంది వరకూ లెబనాన్ కమ్యూనిస్టు పార్టీ, ఆరబ్ సోషలిస్టు యూనియన్ వంటి వామపక్ష రాజకీయ గ్రూపులకు చెందిన వారు. ముగ్గురు క్రైస్తవులు. వీరిలో ఒకరు కళాశాల పట్టభద్రురాలైన బడి ఉపాధ్యాయురాలు. వీరంతా లెబనీయులే. అయితే దీనికి సిరియా ఇరాన్‌ల దన్ను ఉన్నది.

లెబనాన్ మీద దాడి చేయడానికి ఇజ్రాయిల్‌ను ప్రేరేపించిందని చెబుతున్న జులై 12వ తేదీ సంఘటన విషయానికి వస్తే, ఇజ్రాయిల్ ఖైదులలో వందలాది మంది లెబనాన్ జాతీయులు ఉన్నారు. వీరిని గురించి దశాబ్ద కాలంగా ఏమీ తెలియజేయడం లేదు. ఇక

ఇజ్రాయిలీ ఖైదులలో ఉన్న పది వేల మంది పాలస్తీనీయుల గురించి చెప్పనే అక్కరలేదు. లెబనాన్ ఖైదీల కోసం హిజుబుల్లా ఇజ్రాయిలీ సైనికులను పట్టుకున్నది.

గాజా, లెబనాన్‌ల మీద ప్రస్తుత దాడులకు వెనక ఇప్పుడు ఈ ప్రాంతం గురించి కోండోలెజా రైస్ ప్రతిరోజూ మాట్లాడుతున్న 'న్యూ మిడిల్ ఈస్ట్' ఉన్నది. చెవ్రాన్ కార్పోరేట్ కార్యాలయాల నుంచి వచ్చి, సహాయ మంత్రిగా పని చేస్తున్న ఈమె ఈ విధ్వంసాన్నంతా 'న్యూ మిడిల్ ఈస్ట్ పురుటి నొప్పులు' అంటూ కొట్టి పారేస్తుంది. జులై 23వ తేదీ నాటికి లెబనాన్ జనాభాలో ఆరింట ఒక వంతు మంది నిరాశ్రయులైనప్పుడు కాల్పుల విరమణ ఆలోచనను తోసి పుచ్చింది. 'మనం న్యూ మిడిల్ ఈస్ట్‌లోకి వెళుతున్నాం. పాత దానిలోకి కాదు' అన్నది.

'న్యూ మిడిల్ ఈస్ట్' చమురు జాతీయాకరణ యావత్తు చరిత్రనూ మార్చాలని, ఇజ్రాయిలీ 'ఎనర్జీ సెక్యూరిటీ' (శక్తి భద్రత)తో సమస్త చమురు వనరులనూ భారీ చమురు టీఎన్‌సీల ప్రత్యక్ష ఆధీనంలోకి బదిలీ చేయాలనీ పథకం పన్నుతున్నది. అంతేకాకుండా, పాలస్తీనాలో నీటి, భూమి వనరులు శాశ్వతంగా ఇజ్రాయిలీ ఆధీనంలోకి వస్తాయి. పాక్షికంగా ఇజ్రాయిల్‌కు మళ్లిస్తారు కూడా. ఈ ప్రాజెక్టు కోసం వివిధ సైనిక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ కలల సామ్రాజ్యాన్ని ఆవిష్కరించడం కోసం లెబనాన్‌లో నిరంతర వినాశనంతో పాటుగా, ప్రతీ రోజూ పాలస్తీనాలో పది మందికి పైగానూ ఇరాక్‌లో వంద మందీ చనిపోతుంటారు. అయితే లెబనాన్‌లో గెరిల్లా బలగాలు ఇజ్రాయిలీ దాడిని వీరోచితంగా తిప్పి కొడుతున్నాయి.

లెబనీయ ఖైదీల కోసం కేవలం ఇద్దరు ఇజ్రాయిలీ సైనికులను బందీలుగా పట్టుకున్నందుకు ఇజ్రాయిల్ ఈ వినాశకరమైన దాడి ప్రారంభించింది. బీరుట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మూడు రన్‌వేలనూ ఇంధన డిపోలనూ, దేశంలో అన్ని సముద్ర రేవులనూ, దేశంలో వివిధ ప్రాంతాలను సిరియాకు కలిపే అనేక హైవేలను, రోడ్లనూ, లెబనాన్ దక్షిణ, తూర్పు ప్రాంతంలో పదుల వంతెనలనూ, ఫాక్టరీలనూ సైనిక బేసులను, ట్రక్కులనూ ఆంబులెన్స్‌లనూ ఆస్పత్రులనూ బడులనూ, టెలివిజన్ ట్రాన్స్‌మిటర్‌లనూ యావత్తు దక్షిణ బీరుట్‌నూ, సిడాన్, టైర్, బాల్‌బెక్ మొదలయిన పట్టణాలనూ, ఇతర గ్రామాలనూ బాంబులతో పేల్చి వేసింది. వైమానిక బలగం కార్పెట్ బాంబింగు ప్రారంభించింది. పక్షం రోజులలో ఐదుగురు లెబనాన్ పౌరులలో ఒకరు నిరాశ్రయులయ్యారు. అయితే ఈ వినాశనం ప్రతి దాడిని ఆపలేకపోయింది.

ఇజ్రాయిల్ బలగాలు లెబనాన్ భూభాగంలోకి ప్రవేశించిన తరువాత హిజుబుల్లా రాకెట్ దాడులు ప్రారంభమయ్యాయి. దూరాన హైఫా పట్టణం మీద దాడి చేసారు. ఇజ్రాయిలీ సైనికులు పెద్ద ఎత్తున చనిపోయారు. మొదటిసారిగా ఇజ్రాయిల్ భయానికి గురయింది. ఎప్పుడు, ఎక్కడ రాకెట్ తమను దెబ్బ తీస్తుందో వాళ్లకు అర్థం కాకుండా పోయింది. విస్తారమైన దాడితో గెరిల్లాలను తుడిచిపెట్టి వేయగలుగుతామని వాళ్లు భావించారు. కానీ ప్రతిఘటన కొనసాగడంతో చెప్పుకోతగిన విధంగా చేయలేకపోయారు. ఈ ప్రతిఘటన వల్లనే అమెరికా గతంలో తీవ్రంగా వ్యతిరేకించిన కాల్పుల విరమణకు ఇప్పుడు ఐక్య రాజ్య సమితి ద్వారా ప్రయత్నించింది.

అమెరికా-ఇజ్రాయిల్-బ్రిటన్‌లు కలిసి చేస్తున్న ఈ ఘోరమైన చర్యలను ప్రపంచ ప్రజలు ఖండించాలి. భారతీయ ప్రభుత్వం ఇజ్రాయిల్‌నూ లెబనాన్‌నూ కూడా ఖండిస్తూ జాగ్రత్తగా ఒక ప్రకటన ఇచ్చింది. ఇద్దరు సైనికులను పట్టుకోవడం ఇజ్రాయిలీ బలగాలు చేసిన వినాశనంతో సమానమవుతుందా? ఇది ద్వంద్వ వైఖరి తప్ప మరేమీ కాదు. ఇది ఇజ్రాయిల్‌కు స్పష్టంగా మద్దతు ఇవ్వడమే. భాజపా ఈ విషయంలో నిశ్శబ్దంగా ఉంది. అలా జియోనిస్టులకు పూర్తిగా మద్దతు ఇస్తున్నది. అయితే భారత ప్రజలు లెబనాన్, పాలస్తీనా ప్రజలకు మద్దతు ఇస్తారు. జియోనిస్టులనూ వారి అమెరికా ప్రాయోజితులనూ బలంగా ఖండిస్తారు. పశ్చిమాసియాలో ఘర్షణలలో ఎంత లోతుగా దిగితే అది వారి మెడకే అంత గట్టిగా చుట్టుకుంటున్నదన్నది నిస్సందేహం.

ఎట్టకేలకు ఇజ్రాయిలీలు/అమెరికా కాల్పుల విరమణకు అంగీకరించారు. అయితే ఇజ్రాయిలీ దాడులు లెబనాన్‌లో కొనసాగుతున్నాయి కనక ఇది మాటలకే పరిమితం. హిజుబుల్లాను నాశనం చేయాలనీ వారు ఆయుధాలు విడిచిపెట్టాలనీ మొదట అన్నారు. లెబనాన్, పాలస్తీనా ప్రజల వీరోచిత ప్రతిఘటన వల్లనే తప్పనిసరిగా ఈ కాల్పుల విరమణకు అంగీకరించడం మాత్రమే కాక కొందరు రాజకీయ ఖైదీల విడుదల కోసం చర్చలు జరపడం వైపుకు జియోనిస్టులను నెట్టింది. ఈనాడు ప్రపంచంలో జరుగుతున్న మొత్తం సామ్రాజ్యవాద వ్యతిరేక, అమెరికా వ్యతిరేక పోరాటంలో పశ్చిమాసియా ప్రజలు చేస్తున్న పోరాటం ఒక ముఖ్యమైన భాగం.

★

*(....40వ పేజీ తరువాయి)*

"బయటివాళ్ళు" నందిగ్రామ్ ప్రజల్ని రెచ్చగొట్టారనీ, నిస్సహాయులైన పోలీసులు ఆత్మరక్షణార్థం కాల్పులు జరిపారనీ అన్నాడు. ఈ అబద్ధాలకోరు తన పార్టీ గూండాల్నీ, వేలాది పోలీసుల్నీ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై మారణకాండ జరపడానికి ఉద్దేశపూర్వకంగానే పంపారనే పచ్చి నిజాన్ని దాచిపెట్టి ప్రజల్ని తెలివి తక్కువ వాళ్ళను చేయలేడు. ఈ ప్రభుత్వ ప్రోత్సాహక బీభత్సంలో అనేక మంది మహిళలతో సహా హత్యకు గురైన వాళ్ళందరూ స్థానిక రైతులేననే నిజాన్ని దాచిపెట్టలేడు. అత్యంత క్రూరమైన విధానాల ద్వారా రాజకీయ ఉద్యమాన్ని పరిష్కరించడానికి తీసుకున్న ఈ అత్యంత నీచమైన, పనికిమాలిన చర్యల్ని దాచిపెట్టలేడు. ప్రజల మీద ఎలాంటి హెచ్చరికలు లేకుండా చేసిన కాల్పుల్ని సమర్థించుకోవడానికి ఈ గోబెల్స్ భారత సంతతి ఇటువంటి అబద్ధాలూ, అవాస్తవాల ద్వారా ప్రజల్ని తెలివి తక్కువ వాళ్ళను  చేయలేరు. ఏచూరి, కారత్‌ల వంటి వాళ్ళు ప్రచారం చేస్తున్న మానవ ముఖంతో సంస్కరణలు అనే దాని క్రూరత్వం, అమానవనీయతనూ ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణకు సంబంధించిన నయా ఉదారవాద విధానాలపట్ల వీరి బూటకపు వ్యతిరేకతనూ, మార్చి 14 మారణకాండ నగ్నంగా బయటపెడుతున్నది. దళారీ నిరంకుశ బూర్జువాలకూ, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకూ ఈ సోషల్ ఫాసిస్టులు మరింత నమ్మకమైన సేవకులుగా నిరూపించుకున్నారు. ప్రజల పోరాటాన్ని అణచివేసేందుకు సోషల్ ఫాసిజాన్ని చట్టబద్ధంగా ఉపయోగించడానికి వారి సామాజిక పునాది బాగా సేవ చేస్తుందని నిరూపితమైంది. అందుకే టాటాలూ, అంబానీలూ, మిట్టల్‌లూ, ఎస్సార్, రుయాలూ, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలూ, ప్రపంచ బ్యాంకు ఈ సోషల్ ఫాసిస్టుల్ని కేంద్రంలో అధికారంలోకి తీసుకురావడానికి ప్రోత్సహిస్తుండటంలో ఆశ్చర్యం లేదు.

ఈ రోజు దేశంలోని ఈ ప్రతీఘాతుక పాలకవర్గాలు, దేశ వ్యాప్తంగా సారవంతమైన వ్యవసాయ భూమిని పెద్దయెత్తున నయా వలస సంస్థానాలుగా మార్చడానికి సిద్ధమయ్యారు. ఇందుకు మారణకాండలకు పాల్పడటానికి కూడా వెనుకాడటం లేదు. బడా వ్యాపార సంస్థల నుంచీ, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల నుంచి కాంగ్రెస్, సి.పి.ఐ (ఎం) ఇంకా ఇతర పార్టీల ఖజానాలకు వేల కోట్ల రూపాయల డబ్బు ప్రవహించింది. ధనికులకూ, పేదలకూ మధ్యా సామ్రాజ్యవాద పెట్టుబడికి మన మాతృభూమిని స్వర్గధామంగా మార్చాలని చూస్తున్న వారికీ, ప్రజలకూ మధ్యా, ఒకపక్క లక్షల కోట్ల డబ్బు పోగేసుకున్న ధనికులకూ భారత బడా వ్యాపార సంస్థలకూ, మరోపక్క దారిద్ర్యంలో మగ్గుతున్న నిరుపేద ప్రజానీకానికీ, ప్రత్యేకించి రైతాంగ, ఇతర ప్రజానీకానికీ మధ్యా రాజీలేని యుద్ధానికి రంగం సిద్ధమైందనేది స్పష్టమే. విశాల ప్రజానీకంవైపా లేక ధనిక వర్గంవైపా అనేదే ఎవరైనా తేల్చుకోవాల్సి వుంది తప్ప మధ్యలో మరో రంగం లేదు. 237 ఎస్.ఇ.జడ్‌లు ఇప్పటికే అనుమతులు పొంది, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలూ, కేంద్ర ప్రభుత్వమూ లక్షలాది ఎకరాల సారవంతమైన వ్యవసాయ భూమిని బలవంతంగా స్వాధీనం చేసుకున్నాయి. ప్రజా వ్యతిరేక ప్రాజెక్టుల కారణంగా, ఒరిస్సా, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా ఇంకా అనేక ఇతర రాష్ట్రాల్లో లక్షలాది మంది ప్రజలు నిలువనీడ లేక నిరాశ్రయులయ్యారు.

ప్రజల భూమినీ, అన్ని రకాల జీవనాధారాన్ని గుంజుకుని దేశాన్ని వలసగా మార్చుతున్న వాస్తవంగా బయటి వాళ్ళు అయిన క్రూర బహుళజాతి కంపెనీలనూ, దళారీ బడా వ్యాపార సంస్థలనూ, వారి తొత్తులనూ, భూ మాఫియానూ తన్ని తరిమి, ప్రతిచోటా కళింగనగర్‌లూ, నందిగ్రామ్‌లూ సృష్టించడానికి ప్రతీ ఎస్.ఇ.జడ్‌నూ యుద్ధ రంగంగా మార్చాలని పీడిత ప్రజానీకానికీ,  ప్రత్యేకించి రైతాంగానికి సి.పి.ఐ (మావోయిస్టు) పిలుపునిస్తోంది. పోరాడుతున్న ప్రజలకు తన పూర్తి మద్దతునిచ్చేందుకూ, ఎస్.ఇ.జడ్‌లన్నింటికీ వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం చేసేందుకూ, నందిగ్రామ్ మారణకాండకు బదులు తీర్చుకోవడానికీ సి.పి.ఐ (మావోయిస్టు) శపథం చేస్తోంది. ప్రజలకు అన్యాయానికి వ్యతిరేకంగా తిరగబడే హక్కుంది. మావోయిస్టులు రెచ్చగొడుతున్నారని బుద్ధదేవ్‌లూ, ఏచూరీలు ఎంత మొరిగినా, మాతృభూమిని అమ్మివేస్తున్న కాంగ్రెస్, బి.జె.పి, సి.పి.ఐ (ఎం), సమాజ్‌వాదీ పార్టీ, టి.డి.పి, డి.ఎం.కె, ఎ.ఐ.ఎ.డి.ఎం.కె ఇంకా ఇతర పార్టీల్లోని తమ భారత దళారుల ద్వారా ముందుకు తీసుకువస్తూ, ఎస్.ఇ.జడ్‌ల ద్వారా చేస్తున్న సామ్రాజ్యవాద దాడికి  వ్యతిరేకంగా ప్రజల్ని ఐక్యం చేసి పోరాడే ప్రజలకూ, సంస్థలకూ పూర్తి మద్దతునిస్తామని బహిరంగంగా ప్రకటిస్తున్నాం. మార్చి 16న జరిగే బంద్‌ను విజయవంతం చేయాలనీ, ఎస్.ఇ.జడ్‌లను ఉపసంహరించుకునే వరకూ వీరోచిత పోరాటాన్ని కొనసాగించాలనీ పశ్చిమ బెంగాల్ ప్రజలకు సి.పి.ఐ (మావోయిస్టు) పిలుపునిస్తోంది.

ఆజాద్

పత్రికా ప్రతినిధి

సి.పి.ఐ (మావోయిస్టు)

కేంద్ర కమిటీ

తేది: మార్చి 15, 2007

# బెంగాల్ డయ్యర్ బుద్ధదేవ్ నాయకత్వంలోని సోషల్ - ఫాసిస్టు ప్రభుత్వాన్ని కూలదోయడానికి ఐక్య సమరశీల పోరాటాన్ని ప్రారంభిద్దాం!

# ప్రతీ ప్రత్యేక ఆర్థిక మండలాన్ని నందిగ్రామ్ లాంటి యుద్ధ రంగంగా మారుద్దాం!!

హిట్లర్ అంశను పుణికి పుచ్చుకున్న బుద్ధదేవ్ ప్రభుత్వ పోలీసు బలగాలూ, సి.పి.ఐ (ఎం) సోషల్ ఫాసిస్టు సాయుధ గూండాలూ మార్చి 14న నందిగ్రామ్‌లో 16 మంది (నిజానికి 50 మందికి పైగానే) రైతుల్ని చంపి, వంద మందికి పైగా ప్రజల్ని క్షతగాత్రుల్ని చేసిన మారణకాండ, బ్రిటీషు వలస పాలనలో, జలియన్‌వాలాబాగ్‌లో రక్త పిపాసి జనరల్ డయ్యర్ జరిపిన పైశావిక మారణకాండను తలపించింది. క్రూరుడు డయ్యర్ తోలు కప్పుకున్న బుద్ధదేవ్ తూర్పు మిద్నపూర్‌లోని నందిగ్రామ్‌లో ప్రత్యేక ఆర్థిక మండలానికి (ఎస్.ఇ.జడ్) వ్యతిరేకంగా శాంతియుతంగా ఆందోళన జరుపుతున్న వారిపైకి దూకడానికి 5 వేలకు పైగా సుశిక్షత పోలీసు బలగాలనూ, వందలాది తన పార్టీ గూండాలనూ పంపించాడు. పశ్చిమ బెంగాల్‌ను సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకూ, బడా కార్పోరేట్ సంస్థలకూ, అన్యాయాలకు తెగబడే భూ మాఫియాకు స్వర్గ ధామంగా మార్చడానికి బాటలేస్తూ బుద్ధదేవ్ ఈ మారణకాండకు పాల్పడ్డాడు. గుజరాత్‌లో హిందూ మతోన్మాద మూకలు చేసినట్లు, ఈ నయా ఫాసిస్టు సాయుధ మూకలు మహిళలతో సహా పరుగెత్తుతున్న ప్రజల్ని వెంటాడి చంపారు.

నందిగ్రామ్‌లోని ఈ క్రూర మారణకాండ బుద్ధదేవ్ సి.పి.ఐ (ఎం) ప్రభుత్వమూ, కేంద్రంలోని సోనియా గాంధీ యు.పి.ఎ ప్రభుత్వమూ, తమ బడా పారిశ్రామిక ప్రముఖులా, సామ్రాజ్యవాద యజమానులా ఆదేశాల మేరకు పథకం ప్రకారం జరిపిన కుట్ర. ఈ ఘటనకు సంబంధించి గుండెల్ని రగిలించే అంశమేమిటంటే, ప్రజలు వద్దంటే నందిగ్రామ్‌లో ఎస్.ఇ.జడ్‌ను ఆపి, మరోచోటికి బదిలీ చేస్తామని బుద్ధదేవ్, ప్రకాశ్‌కారత్‌లు ప్రజలకు మళ్ళీ మళ్ళీ హామీలివ్వటం. 14 వేల ఎకరాల భూ స్వాధీనానికి సంబంధించిన అధికారిక ప్రకటన ఉపసంహరించుకున్నామని హామీ యిచ్చారు. గోబెల్స్ లాంటి ఈ అబద్ధాలకోరులు దీన్ని సాకుగా ఉపయోగించుకున్నారు. ఎస్.ఇ.జడ్‌ను బదిలీ చేసే ఉద్దేశమేమీ లేదనేది ఇప్పుడు స్పష్టమైపోయింది. బహుళజాతి కంపెనీల, పారిశ్రామిక సంస్థలా సేవజేసే క్రమంలో వామపక్ష కూటమి ప్రభుత్వం రైతుల బహుళ పంట భూమిని గుంజుకుని, ఆందోళన చేస్తున్న ప్రజల సమాధులపై ఎస్.ఇ.జడ్ నిర్మించాలని నిర్ణయించుకుంది. దీనికి నిదర్శనంగా, మార్చి 14 మారణకాండకు కొద్ది వారాల ముందు తొమ్మిది మంది రైతుల్ని చంపింది. నందిగ్రామ్ భూముల్లో పారిన మహిళల, పిల్లల రక్తం వామపక్ష వాక్పటిమనూ, రాజకీయ దళారులు సీతారం ఏచూరి, బృందాకారత్, రాఘవులూ తదితరుల వాగాడంబరాన్నీ బట్టబయలు చేసింది. వాళ్ళు ప్రతిపక్షంలో వున్నచోట ఓటు బ్యాంకును పెంచుకోటానికి పోరాటాలు చేస్తారు. కానీ, అధికారంలో వున్నచోట పోరాటాలు చేస్తున్న ప్రజల్ని చంపుతారు.

అడాల్ఫ్ హిట్లర్ జాతీయ సోషలిజానికి తీసిపోని ఈ సోషల్ - ఫాసిస్టుల వాగాడంబరాన్ని నందిగ్రామ్ ఘటన సామాన్యుడికి కూడా అర్థమయ్యేటట్లు రుజువు చేసింది. హింసకు కారణాన్ని తృణమూల్, మావోయిస్టుల మీదకు నెట్టి, రక్త పంకిలమైన మారణకాండ నింద నుంచి తమను తాము కాపాడుకోవటానికి సీతారాం ఏచూరి చేసిన సిగ్గుమాలిన ప్రయత్నాలు, వామపక్ష ముసుగులోని ఈ దేశ ద్రోహుల, వాళ్ళ తొత్తుల సోషలిస్టు వాగాడంబరాన్ని ఇప్పటికీ నమ్ముతున్న వాళ్ళందరి కళ్ళు తెరిపిస్తాయి. సామ్రాజ్యవాదులకూ, భారత బడా వ్యాపారానికి నమ్మకంగా సేవచేసే రాజకీయ దళారీ అయిన ఈ సోషల్ - ఫాసిస్టు పశ్చిమ బెంగాల్‌లోని తమ "వామపక్ష" ప్రభుత్వం ఈ సమస్యను రాజకీయంగా పరిష్కరించడానికి ప్రయత్నించింది గానీ, మావోయిస్టుల లాంటి

*(తరువాయి 39వ పేజీలో.....)*

**ఏప్రిల్ 22న కామ్రేడ్ లెనిన్ 137వ జన్మదినోత్సవ విప్లవ శుభాకాంక్షలు!**

**మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్థిల్లాలి!!**